www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 13-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 345 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం: తిథి: చవితి రా. 1.27 తదుపరి పంచమి; నక్షత్రం: అశ్విని రా. 6.25 తదుపరి భరణి; వర్జ్యం: మ. 2.45-4.13, తె. 3.25-4.55; దుర్ముహూర్తం: మ. 12.01-4.13; అమృతఘడియలు: ఉ. 11.50-1.18; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.29; సూర్యాస్తమయం: 6.22 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

దిగొచ్చిన ఎస్‌బీఐ

సుప్రీం ఆదేశాల మేరకు ఎన్నికల బాండ్ల వివరాలు ఎన్నికల కమిషన్‌కు సమర్పణ

ఆ వివరాలు బయటపెడితే అంతర్జాతీయ సమాజంలో మన పేరుప్రతిష్ఠలకు దెబ్బ

సుప్రీం తీర్పుపై ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్ కోరండి.. రాష్ట్రపతికి ఎస్‌బీఐ చీఫ్ లేఖ

న్యూఢిల్లీ, మార్చి 12: సుప్రీంకోర్టు దెబ్బకు ఎస్‌బీఐ దిగొచ్చింది. వివరాల సమర్పణకు గడువు పెంచేది లేదని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తేల్చిచెప్పడంతో.. ఎలక్టోరల్ బాండ్ల వివరాలను మంగళవారం సాయంత్రం ఎన్నికల కమిషన్‌కు సమర్పించింది. ఇక, ఇప్పుడు ఆ వివరాలను ప్రజాబాహుళ్యం ముందు ఉంచాల్సిన బాధ్యత ఈసీ మీద ఉంది. సుప్రీం ఆదేశాల మేరకు శుక్రవారం (మార్చి 15) సాయంత్రం 5 గంటల్లోగా ఎన్నికల కమిషన్ ఆ వివరాలను

మిగతా 14వ పేజీలో...

కాళేశ్వరం, విద్యుత్తు ప్రాజెక్టులపై విచారణకు

రెండు జ్యుడీషియల్ కమిషన్లు

కాళేశ్వరం అవినీతిపై కమిషన్‌కు చైర్మన్‌గా జస్టిస్ పీసీ ఘోష్

భద్రాద్రి, యాదాద్రి విద్యుత్తు ప్రాజెక్టులపై జస్టిస్ నర్సింహారెడ్డి

ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలుపైనా.. 100 రోజుల్లో విచారణ

కుల వృత్తులు, గిరిజనులు, ఈబీసీ వారికి 16 కార్పొరేషన్లు

అర్హులందరికీ అతి త్వరలో తెల్ల రేషన్ కార్డులు జారీ

మహిళా ఉత్పత్తులకు ఔటర్ చుట్టూ మార్కెటింగ్ సదుపాయం

రెండ్రోజుల్లో 93 శాతానికి పైగా రైతుబంధు సొమ్ము పంపిణీ

డీఎస్సీ-2008 అభ్యర్థులకు ఉద్యోగాలు, కనీస వేతనాలు

రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో నిర్ణయాలు



రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు వెల్లడిస్తున్న మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు, పొన్నం, కోమటిరెడ్డి

హైదరాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్తు ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వీటిలో చోటుచేసుకున్న అవకతవకలపై విచారణ కోసం రెండు వేర్వేరు జ్యుడీషియల్ కమిషన్లను ఏర్పాటు చేసింది. విచారణ వ్యవధిని 100 రోజులుగా నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు ఆమోదం తెలిపారు. కాళేశ్వరం, యాదాద్రి, భద్రాద్రిపై న్యాయ విచారణతో పాటు అర్హులందరికీ తెల్ల రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్లు, కుల వృత్తుల వారికి కార్పొరేషన్ల ఏర్పాటు, రైతు బంధు కింద మిగతా రైతులకు ఆర్థిక సాయం, ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) చుట్టూ మహిళా ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం వంటి కీలక అంశాలపై భేటీలో చర్చించారు. సమావేశం వివరాలను మంత్రులు

మిగతా 13వ పేజీలో...

4,356 అధ్యాపక పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకం

జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో డీఎస్సీ ద్వారా ఎంపిక

నోటిఫికేషన్ జారీ.. 16న ఇంటర్వ్యూలు

నాణ్యమైన విద్యే లక్ష్యం: మంత్రి దామోదర 7

జీవో317, 46పై వినతుల స్వీకరణ 14న 13

'జయ జయహే..' పాటలో మార్పులు!

రాష్ట్ర చిహ్నం, విగ్రహం, గీతంలో మార్పులపై క్యాబినెట్ సబ్‌కమిటీ తొలి సమావేశం 12

2014లో ఇంటర్‌నెట్ బిల్లు ఎక్కువగా ఉండేది. మోదీ పాలనలో తగ్గించాం. ఒక చాక్లెట్ తక్కువ కొనుక్కొని అయినా సరే.. డేటాను ఎక్కువగా ఉపయోగించండి. వచ్చే 45 రోజులూ అవిశ్రాంతంగా శ్రమించండి.

- సికింద్రాబాద్‌లో బీజేపీ సోషల్ మీడియా కార్యకర్తలతో భేటీలో షా



ఎల్బీ స్టేడియంలో జరిగిన సభలో అమిత్ షాను సత్కరిస్తున్న కిషన్‌రెడ్డి

12 సీట్లు పక్కా

తెలంగాణ నుంచి గెలిపించి పంపండి

దేశవ్యాప్తంగా బీజేపీకి 400 సీట్లు

బీఆర్ఎస్, కాంగ్రెస్ కుంభకోణాలు, అవినీతి చిట్టా నా దగ్గర ఉంది

కానీ, ఇప్పుడు చెప్పదల్చుకోలేదు

4 వేల కోట్ల మియాపూర్ భూములు, ఓఆర్ఆర్ స్కామ్‌లకు పాల్పడ్డ బీఆర్ఎస్

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కేసీఆర్ కుమార్తె

కాంగ్రెస్ స్కామ్‌లపై రేవంత్ జవాబివ్వాలి

పదేళ్లలో రాష్ట్రానికి 2.42 లక్షల కోట్లు

అయోధ్యలో మందిరాన్ని కట్టి చూపాం

ఎల్బీ స్టేడియం సభ, సికింద్రాబాద్‌లో పార్టీ కార్యకర్తలతో భేటీలో అమిత్ షా

హైదరాబాద్/సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీఆర్ఎస్.. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా భారీ కుంభకోణాలకు పాల్పడ్డాయని.. వాటి అవినీతి చిట్టా తన వద్ద ఉందని కేంద్ర హోం మంత్రి, బీజేపీ అగ్ర నేత అమిత్ షా ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల సన్నాహక చర్యల్లో భాగంగా మంగళవారం నగరానికి చేరుకున్న ఆయన.. సికింద్రాబాద్‌లో బీజేపీ సోషల్ మీడియా కార్యకర్తలతో, ఎల్బీ స్టేడియంలో విజయ సంకల్ప సమ్మేళనం పేరిట పార్టీ

మిగతా 2వ పేజీలో...

ఇకపై ఏటా 'విమోచన దినోత్సవం'

సెప్టెంబరు 17న నిర్వహించాలని నిర్ణయం

నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్ర హోంశాఖ 13

మోదీ, కేసీఆర్ మధ్య

చీకటి ఒప్పందం

మా సర్కారును కూల్చే కుట్ర.. కాంగ్రెస్ జోలికొస్తే కనుగుడ్లు పీకేస్తాం



పరేడ్‌గ్రౌండ్ సభలో మహిళలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్

ప్రభుత్వాన్ని కంచె వేసి కాపాడేది ఆడబిడ్డలే

పదేళ్లు ఏం చేశారని మోదీకి ఓటెయ్యాలి?

రాష్ట్రాన్ని తాగుబోతుల సంసారం చేసిన కేసీఆర్

ఓడినా సిగ్గు రాలేదు.. ఇంకా వంకర బుద్ధే

కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తాం

ఆ బాధ్యత నాదే.. ప్రభుత్వానికి అండగా ఉండండి

స్వశక్తి మహిళా సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డలంతా కలిసి గెలిపించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రధాని నరేంద్రమోదీ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుట్ర పన్నుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. మోదీ, కేసీఆర్ చీకట్లో ఒప్పందం చేసుకున్నారని, అందుకే బీజేపీ ఎంపీ అభ్యర్థులను ప్రకటించిన చోట బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించలేదని అన్నారు. ఎవరికి వారు విడివిడిగా ప్రచారం చేసుకొని కాంగ్రెస్‌ను దెబ్బతీయాలన్న అవగాహన ఆ రెండు పార్టీల మధ్య ఉందన్నారు. మంగళవారం

మిగతా 13వ పేజీలో...

ఇకపై వాహనాల రిజిస్ట్రేషన్ కోడ్ 'టీజీ' 2

గెజిట్ విడుదల చేసిన కేంద్ర రవాణా శాఖ

టీఎస్‌ను మార్చాలంటూ రేవంత్ సర్కారు విజ్ఞప్తి

సత్వరమే స్పందించి, ఆమోదం తెలిపిన కేంద్రం

మగువల ప్రయాణం మరింత భద్రం! 13

'టీ-సేఫ్' యాప్‌ను ప్రారంభించిన రేవంత్ రెడ్డి

దేశంలో తొలిసారి రాష్ట్ర పోలీసుల ప్రత్యేక సేవ



రెండు పిల్లర్లు కుంగితే

పెడబొబ్బలా!

ఒక పన్ను ఊడితే అన్నీ ఊడగొట్టుకుంటామా?

నా మీద ఏడుపుతో అబద్ధపు ప్రచారాలు

కాళేశ్వరంపై రెండు రోజుల్లో మీ ముందుకొస్తా

నేనుండగా రాష్ట్రంలో ఎకరం పొలం ఎండిందా?

రేవంత్‌రెడ్డి పండబెట్టి తొక్కుతా అంటుండు

ఇది ఒక ముఖ్యమంత్రి మాట్లాడే భాషేనా?

అత్యాశకు పోయి కాంగ్రెస్‌ను గెలిపించారు

నన్ను గెలిపిస్తే ప్రధాని మోదీని ఢీ కొట్టేవాడిని

కరీంనగర్ సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

కరీంనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ ఓటర్లు తనకు బ్రేకులు వేయకుండా గెలిపించి ఉంటే ఈ పాటికి మోదీ అసమర్థపాలనకు వ్యతిరేకంగా సగం దేశాన్ని ఏకం చేసేవాడినని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనను తిడుతూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ప్రస్తావించారు. గత పదేళ్లలో నేనెప్పుడైనా దురుసుగా ప్రవర్తించానా? అని ప్రశ్నించారు. మంగళవారం ఆయన కరీంనగర్ ఎస్సారార్ కళాశాల మైదానంలో బీఆర్ఎస్ కదనభేరి సభలో మాట్లాడారు. 2001 మే 17న ఇదే మైదానం నుంచి తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించామని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. ఇటీవల ఎన్నికల్లో ప్రజలు అత్యాశకు పోయి, మోసపోయి కాంగ్రెస్‌ను గెలిపించారని చెప్పారు. వంద రోజుల పాలన పూర్తయ్యే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏమీ అనవద్దని తన పార్టీ ఎమ్మెల్యేలకు చెప్పానని కేసీఆర్ వెల్లడించారు. రైతుబంధు 15 వేలు ఇస్తామని, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం

మిగతా 12వ పేజీలో...

మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థిగా శంభీపూర్ రాజు



భక్తి శ్రద్ధలతోనే చిన్నపీటపై కూర్చున్నా!


ఎవరికీ తల వంచే వాడిని కాను

ఉప ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని శాసిస్తున్నా

సింగరేణి అతిథిగృహ శంకుస్థాపనలో భట్టి విక్రమార్క

సంస్థల్లో 1352 ఉద్యోగాల భర్తీ

జైపూర్, రామగుండంలో 800 మెగావాట్ల ప్లాంట్లు: భట్టి





పోఖ్రాన్‌లో భారత్ శక్తి విన్యాసాలను తిలకిస్తున్న ప్రధాని మోదీ, రాజ్‌నాథ్ సింగ్

రక్షణలో స్వావలంబన

దేశీయంగా రక్షణ పరికరాల తయారీ రెట్టింపు

పదేళ్లలో రూ.లక్ష కోట్లు దాటిన ఉత్పత్తి

'భారత్ శక్తి' విన్యాసాల్లో ప్రధాని మోదీ వెల్లడి 14

అహ్మదాబాద్ నుంచి పది వందేభారత్‌లకు పచ్చజెండా

రూ.85 కోట్ల రైల్వే ప్రాజెక్టులకు శ్రీకారం



మరో రెండు వందే భారత్ రైళ్లు షురూ 3

విశాఖపట్నం-భువనేశ్వర్ మార్గంలో..

సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య పరుగు

రైల్వే అభివృద్ధి ఘనత ప్రధానిదే: కిషన్‌రెడ్డి

కారు దిగేస్తున్నారు!

కాంగ్రెస్, బీజేపీ వైపు బీఆర్ఎస్ నేతల చూపు.. కీలక నేతల్లో కొందరు పార్టీ మారే అవకాశాలు

కడియం శ్రీహరితో టచ్‌లోకి కాంగ్రెస్.. కడియం చేరితే వరంగల్ లోక్‌సభ టికెట్?

తర్వాత స్టేషన్‌ఘన్‌పూర్ ఉప ఎన్నికలో కుమార్తె కావ్యకు పార్టీ టికెట్ ఆఫర్!

వేం నరేందర్, కోమటిరెడ్డితో అమిత్‌రెడ్డి భేటీ.. కాంగ్రెస్ సర్కారుకు దానం కితాబు

బీజేపీలోకి ఆరూరి రమేశ్.. నేడు అమిత్ షా సమక్షంలో చేరిక



హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌లో కీలక నేతలు పక్క చూపులు చూస్తున్నారా? కారు దిగేందుకు సిద్ధమవుతున్నారా? గులాబీ కండువాను తీసేసి.. కాంగ్రెస్ లేదంటే బీజేపీలో చేరే దిశగా ఆలోచన చేస్తున్నారా? ప్రత్యర్థి పార్టీని పొగడటమే ఎరుగని ఓ కీలకనేత, ఆశ్చర్యకరమైన రీతిలో ఆహా.. ఓహో అని ప్రభుత్వాన్ని పొగడటం.. ఇంకొందరేమో బాహాటంగానే ప్రత్యర్థి పార్టీల నేతలతో భేటీ అవుతుండటం.. ఇలా బీఆర్ఎస్‌లో మునుపెన్నడూ కనిపించని పరిణామాలను చూస్తుంటే ఆ పార్టీ ఒకింత ఇబ్బందికర, అయోమయమైన పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతోందనే చెప్పొచ్చు. తాము గేట్లు ఎత్తితే బీఆర్ఎస్ ఖాళీ అవుతుందంటూ మొన్నటికి మొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో ఇప్పటికే కొందరు కీలక నేతలు కాంగ్రెస్‌తో టచ్‌లోకి వెళ్లి ఉంటారా? అనే ఆందోళనలు గులాబీ దళంలో వ్యక్తమవుతున్నాయి. తాజా పరిణామాలు కూడా బీఆర్ఎస్ నేతలకు గేట్లు తెరిచే దిశగానే సాగుతున్నాయి. ఇప్పటికే పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత కాంగ్రెస్‌లో చేరారు. నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ రాములు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ బీబీ పాటిల్ కూడా బీజేపీలో చేరారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ కూడా బీజేపీలో చేరుతున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఆయన మంగళవారం కేంద్ర మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. బుధవారం ఆరూరి కాషాయ కండువాను కప్పుకొనే అవకాశమున్నట్లు

మిగతా 12వ పేజీలో...

కారు దిగిన నేతలకే టికెట్లు 2

కమలం ఎంపీ బీ ఫారాల్లో వారికే అగ్రస్థానం

2 టికెట్లు ఖరారు.. 4 టికెట్లపై త్వరలో ప్రకటన

మరో 2 స్థానాలపై బీఆర్ఎస్ నేతలతో చర్చలు

గులాబీ పార్టీని వెనక్కి నెట్టడమే బీజేపీ లక్ష్యం!



14

హరియాణా సీఎంగా నాయబ్ సైనీ

మనోహర్‌లాల్ ఖట్టర్ అనూహ్య రాజీనామా

ఆయన స్థానంలో సీఎంగా ఓబీసీ నేత సైనీ

ప్రమాణం చేయించిన గవర్నర్ దత్తాత్రేయ

ప్రస్తుతం కురుక్షేత్ర నియోజకవర్గం ఎంపీ..!

జననాయక్ జనతా పార్టీతో బీజేపీ కటీఫ్

లోక్‌సభ ఎన్నికల్లో పొత్తుపై విభేదాలతోనే..

మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు అరెస్టు 12

సిరిసిల్లలో అదుపులోకి తీసుకున్న పోలీసులు

హైదరాబాద్‌కు తరలింపు..

ఫోన్ల ట్యాపింగ్, హార్డ్‌డిస్క్‌లపై విచారణ

డీసీపీ పర్యవేక్షణలో ప్రశ్నిస్తున్న బృందం!

చైనా అభ్యంతరాన్ని ఖండించిన భారత్

▸ అరుణాచల్ ప్రదేశ్ ఎప్పుడూ తమదేనని స్పష్టం

న్యూఢిల్లీ, మార్చి 12 : అరుణాచల్ ప్రదేశ్‌లో ఇటీవల ప్రధాని మోదీ పర్యటన పట్ల చైనా వ్యక్తం చేసిన అభ్యంతరాన్ని భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. అరుణాచల్ ప్రదేశ్.. గతంలో, ఇప్పుడు, ఇక ముందు కూడా తమ దేశంలోనే అంతర్భాగంగా ఉంటుందని ఉద్ఘాటించింది. ఆ ప్రాంతంపై చైనాకు గతంలో అనేక సందర్భాల్లో అవగాహన కల్పించామని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ వెల్లడించారు. అరుణాచల్ ప్రదేశ్‌లో భారత నాయకుల పర్యటనలు, ఆ రాష్ట్రంలో భారత్ చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు డ్రాగన్ అడ్డు చెప్పడం ఏమాత్రం తగదని పేర్కొన్నారు.

12 సీట్లు పక్కా



ఎల్బీ స్టేడియంలో జరిగిన విజయ సంకల్ప సమ్మేళనంలో ప్రసంగిస్తున్న బీజేపీ అగ్రనేత అమిత్‌షా, హాజరైన నాయకులు, కార్యకర్తలు

(మొదటి పేజీ తరువాయి)

కార్యకర్తలతో నిర్వహించిన సమావేశాల్లో పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ ఆత్మగౌరవం పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ రూ.4 వేల కోట్ల వియాపూర్ భూముల కుంభకోణం, ఓఆర్ఆర్ కుంభకోణం సహా రూ.లక్షల కోట్ల అవినీతికి పాల్పడిందని ధ్వజమెత్తారు. కేసీఆర్ కుమార్తె కవిత ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఇరుక్కుపోయారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ కోల్ బ్లాక్స్, కామన్‌వెల్త్, 2జీ, శారదా చిట్‌ఫండ్, ఐఎన్ఎస్ మీడియా, ఎయిర్‌సెల్, అగస్టా వెస్ట్‌లాండ్, బోఫోర్స్.. వంటి కుంభకోణాలతో రూ.12 లక్షల కోట్ల అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. ఆ పార్టీ అవినీతిపై ఇక్కడి సీఎం సమాధానమివ్వాలంటూ రేవంత్ రెడ్డిని ఉద్దేశించి పేర్కొన్నారు. "వారి అవినీతి జాబితా అంతా నావద్ద ఉంది. కానీ నేను ఇప్పుడు చెప్పదలచుకోలేదు" అని అమిత్ షా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీల ఎజెండా ఒక్కటేనని.. మజ్లిస్ ఎజెండానే కారు, హస్తం అమలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. "కాంగ్రెస్ పార్టీ నెహ్రూ నుంచి రాహుల్ వరకూ నాలుగు తరాలుగా ఒకే కుటుంబం చేతుల్లో ఉండగా.. బీఆర్ఎస్ కేసీఆర్, కేటీఆర్ చేతుల్లో ఉంది. మజ్లిస్‌లోనూ కుటుంబ పాలనే. వీరితో తెలంగాణకు లాభం జరగదు. మూడూ అవినీతి పార్టీలు" అని అమిత్‌షా ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి దేశవ్యాప్తంగా 400 సీట్లు రావాలన్న ఆయన.. తెలంగాణలో 12కంటే ఎక్కువ స్థానాలు గెలిపించి, 12 కమలాలను ఢిల్లీకి పంపాలని కార్యకర్తలకు సూచించారు.

హామీలన్నీ నెరవేర్చాం..

గత ఎన్నికల్లో ఇచ్చిన 'అయోధ్యలో రామమందిర నిర్మాణం' హామీని నెరవేర్చామని.. 70 ఏళ్లుగా కాంగ్రెస్ చేయలేకపోయిన పనిని చేసి చూపించామని అమిత్‌షా గుర్తుచేశారు. సోనియా, మన్మోహన్ పాలనలో పాకిస్థానీలు వచ్చి ఇక్కడ బాంబు పేలుళ్లకు పాల్పడేవారని.. కానీ తాము యురీ, పుల్వామాలో దాడులు జరిగిన పదిరోజుల్లోపే పాకిస్తాన్‌లోకి చొచ్చుకెళ్లి సర్జికల్ స్ట్రైక్ చేశామని పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్‌లో 370 అధికరణను తొలగించామని.. ట్రిపుల్ తలాక్ రద్దుతో ముస్లిం మహిళలకు మేలు చేశామని.. శాసనసభలు, లోక్‌సభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించామని, సీఏఏ తెస్తామన్న హామీని నెరవేర్చామని గుర్తుచేశారు. "సీఏఏతో ఎవరి పౌరసత్వానికీ ఇబ్బంది ఉండదు. ఆ చట్టంతో మైనారిటీలు పౌరసత్వం కోల్పోతారంటూ రాహుల్, ఒవైసీ తప్పుడు ప్రచారం చేస్తున్నారు" అని అమిత్ షా మండిపడ్డారు. సీఏఏ పౌరసత్వాన్ని ఇచ్చే చట్టమే గానీ.. తొలగించదని తేల్చిచెప్పారు. పదేళ్ల యూపీఏ పాలనలో ఉమ్మడి ఏపీకి సోనియా, మన్మోహన్ సర్కారు రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేస్తే.. తెలంగాణ కోసం మోదీ గత పదేళ్లలో రూ. 2.42 లక్షల కోట్లు ఖర్చు చేశారని అమిత్ షా పేర్కొన్నారు. ఇక.. రోడ్లు, విమానాశ్రయాలు, వర్సిటీల వంటివాటిపై రూ.4 లక్షల కోట్ల కంటే ఎక్కువ ఖర్చు చేశామన్నారు. కాగా.. ఎల్బీస్టేడియంలో విజయ సంకల్ప సభలో పాల్గొన్న అనంతరం అమిత్‌షా పాతబస్తీలోని భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. 'హనుమాన్' చిత్రానికి అందించిన ప్రోత్సాహానికి ఆ సినిమా హీరో తేజ, దర్శకుడు ప్రశాంత్ వర్మ ఆయన్ను కలుసుకుని, కృతజ్ఞతలు తెలిపి, హనుమంతుడి ప్రతిమను బహూకరించారు.

అత్యధిక ఎంపీ సీట్లే లక్ష్యం: కిషన్‌రెడ్డి

రాష్ట్రంలో అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకోవడమే అందరి అజెండా కావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు. మంగళవారం ఎల్బీ స్టేడియంలో జరిగిన విజయ సంకల్ప సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. కాంట్రాక్టర్లు, వ్యాపారుల వద్ద రాహుల్ టాక్స్ వసూలు చేస్తోందని ఆరోపించారు. అసదుద్దీన్ ఒవైసీని ఓడించడానికే బీజేపీ హైదరాబాద్ ఎంపీ స్థానానికి పోటీ చేస్తోందని తెలిపారు. సీఏఏ, ఏ మతానికీ వ్యతిరేకం కాదని కిషన్‌రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. దేశంలో అన్ని వర్గాల ప్రజలూ ప్రధాని మోదీని ఆదరిస్తున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ మాట్లాడుతూ.. తాము బరాబర్ రాముడి పేరు చెప్పి ఓట్లు అడుగుతామని కాంగ్రెస్‌కు తేల్చిచెప్పారు. ఆ పార్టీకి దమ్ముంటే బాబర్ పేరుతో ఎన్నికలకు రావాలని సవాల్ చేశారు. 17 ఎంపీ స్థానాలను గెలిపిస్తే రాహుల్ ప్రధాని అవుతారని, అప్పుడు ఆరు గ్యారంటీలూ అమలుచేస్తామంటూ కాంగ్రెస్ పార్టీ మరోసారి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో 450 స్థానాల్లో బీజేపీ గెలువడం ఖాయమని నిజామాబాద్ అభ్యర్థి, ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. రజాకార్లమని అంటున్న ప్రతి ఒక్కరూ తెలంగాణకు శత్రువులే అని బీజేపీ తరఫున హైదరాబాద్ ఎంపీగా పోటీ చేస్తున్న మాధవీలత అన్నారు.

15న మల్కాజిగిరిలో మోదీ రోడ్ షో

ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 15న మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో రోడ్డు షోలో పాల్గొననున్నారు. అనంతరం.. 16న నాగర్‌కర్నూలులో, 18న జగిత్యాలలో బహిరంగ సభలకు హాజరవుతారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, మంగళవారం రాత్రి పార్టీ ముఖ్యనేతలతో సమీక్ష నిర్వహించారు.

కష్టపడితే 15 సీట్లు గ్యారంటీ

▸ రాష్ట్ర బీజేపీ ముఖ్యనేతలతో అమిత్ షా

హైదరాబాద్, మార్చి12 (ఆంధ్రజ్యోతి): "సర్వే ప్రకారం తెలంగాణాలో 12 స్థానాల్లో మనం గెలువబోతున్నాం. మరికొంత కష్టపడితే 15 స్థానాలు గ్యారంటీ" ..అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ రాష్ట్ర పార్టీ ముఖ్యులతో వ్యాఖ్యానించారు. మంగళవారం రాత్రి ఐటీసీ కాకతీయలో వారితో ఆయన దాదాపు అరగంటసేపు మాట్లాడారు. మోదీ పట్ల, బీజేపీ పట్ల పాజిటివ్ వాతావరణం ఉందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బహిరంగసభల కంటే పోలింగ్‌బూత్ స్థాయిలోనే కార్యక్రమాలు నిరంతరం కొనసాగించడం ముఖ్యమని స్పష్టం చేశారు. "పోలింగ్ బూత్‌ల పటిష్ఠత అత్యంత కీలకం. రోజూ స్థానికంగా బైక్ ర్యాలీలు నిర్వహించండి. పార్టీ గుర్తును క్షేత్రస్థాయికి తీసుకెళ్లండి. వాల్‌రైటింగ్ పెద్దఎత్తున ఉండాలి. మోదీ ప్రభుత్వ పథకాల కరపత్రాలను ఇంటింటికీ తీసుకువెళ్లండి. ప్రతీ పార్లమెంటు సెగ్మెంటులో కాల్ సెంటర్ ఏర్పాటు చేసుకోండి" అంటూ దిశానిర్దేశం చేశారు. తన నియోజకవర్గమైన గాంధీనగర్(గుజరాత్)లో కాన్ఫరెన్స్ ద్వారా 3 లక్షల మందితో మాట్లాడానని తెలిపారు. "మీరు కూడా అలాగే ప్లాన్ చేసుకోండి. కిందటిసారి నేను 6 లక్షల మెజారిటీతో గెలిచా. ఈసారి ఇంకా ఎక్కువ మెజారిటీతో గెలవబోతున్నా. బూత్ స్థాయి వ్యవస్థ పటిష్ఠంగా ఉండడమే ఇందుకు కారణం" అని పేర్కొన్నారు. కాగా, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అమిత్‌షాను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వరంగల్ బీఆర్ఎస్ నేత ఆరూరి రమేశ్ కూడా అమిత్‌షాను కలుసుకున్నారు. బుధవారం ఆయన బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, బీజేపీలో చేరే అవకాశం ఉంది. చేరితే వరంగల్ ఎంపీ స్థానాన్ని ఆయనకే ఇచ్చే అవకాశం ఉందని పార్టీనేతలు తెలిపారు.

తప్పుడు సందేశాలను తిప్పికొట్టాలి

▸ బీజేపీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌లతో కిషన్‌రెడ్డి

బోయినపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇతర పార్టీల నాయకులు బీజేపీపై బురద చల్లే వ్యాఖ్యలు, అసత్య ప్రచారాన్ని చేస్తుంటారని.. వాటిని తిప్పికొట్టాలని బీజేపీ సోషల్ మీడియా వారియర్స్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సికిందరాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో మంగళవారం జరిగిన బీజేపీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌ల సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో 17కు 17 ఎంపీ సీట్లు గెలవడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. సమావేశానికి వచ్చిన హోంమంత్రి అమిత్ షాకు ధన్యవాదాలు తెలిపారు.

హైదరాబాద్‌లో అమిత్ షా బిజీ

హైదరాబాద్ సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్ షా మంగళవారం నగరంలో బిజీ బిజీగా గడిపారు. మధ్యాహ్నం 1.56 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఆయనకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.. తెలంగాణ ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్, తదితరులు స్వాగతం పలికారు. చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మి ఆలయానికి వెళ్లిన షా.. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఎల్బీ స్టేడియంలో జరిగిన విజయ సంకల్ప సమ్మేళనంలో.. పోలింగ్ బూత్ అధ్యక్షులు, ఇన్‌చార్జ్‌లతో సమావేశమయ్యారు.

కారు దిగిన నేతలకే టికెట్లు

కమలం ఎంపీ బీ ఫాంలలో వారికే అగ్రస్థానం.. 2 టికెట్ల ఖరారు.. 4 టికెట్లపై త్వరలోనే ప్రకటన

▸ మరో రెండు స్థానాలపై బీఆర్ఎస్ నేతలతో చర్చలు

▸ బీజేపీ లక్ష్యం.. గులాబీ పార్టీని వెనక్కి నెట్టడమే

న్యూఢిల్లీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల బరిలో గణనీయమైన స్థానాలను సాధించి బలం పెంచుకున్న బీజేపీ.. పార్లమెంటు ఎన్నికల్లోనూ సత్తా చాటాలని భావిస్తోంది. ఎంపీ ఎన్నికల్లో వీలైనన్ని ఎక్కువ సీట్లు గెలుచుకుని మరింత బలపడాలని వ్యూహం రచిస్తోంది. ఈ ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో విజయం సాధించడం ద్వారా తమ ఓటు బ్యాంకును మరింత పెంచుకుని రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను వెనక్కి నెట్టేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగానే ఎంపీ అభ్యర్థుల విషయంలో కాషాయ పార్టీ దూకుడుగా వ్యవహరిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా కమల దళంలోకి వలస వచ్చే నేతలకు అగ్ర తాంబూలం ఇస్తూ.. రాష్ట్రంలో పాగా వేసేందుకు సన్నద్ధమవుతోంది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీలో చేరేందుకు సిద్ధమైన నేతలకు టికెట్‌పై స్పష్టమైన హామీ ఇవ్వని కమలనాథులు.. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో వారే స్వయంగా ఇతర పార్టీల నేతల దగ్గరికి వెళ్లి మంతనాలు జరుపుతున్నారు. పార్టీలో చేరితే టికెట్ పక్కా అంటూ హామీ ఇస్తున్నారు. బీఆర్ఎస్‌కు భవిష్యత్తులో గడ్డుకాలమేనని వివరిస్తూ.. తామే ప్రధాన ప్రత్యర్థి అని నమ్మకం కలిగిస్తూ నేతల చేరికలను వేగవంతం చేస్తున్నారు. ఈ క్రమంలో బీజేపీ లోక్‌సభ అభ్యర్థుల తొలి జాబితాలో రాష్ట్రంలోని తొమ్మిది సీట్లకు పోటీ చేయబోయే వారి పేర్లను ప్రకటించింది. అందులో జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు కుమారుడు భరత్‌కు పార్టీలో చేరిన వెంటనే టికెట్లను ఖరారు చేసింది. దీంతో ఆయా స్థానాలపై ఆశలు పెట్టుకుని, ఇప్పటికే అక్కడ పనిచేసుకుంటున్న కమల నాథులు పార్టీ వైఖరి పట్ల గుర్రుగా ఉన్నారు.

రెండో జాబితాలోనూ వారిదే హవా..

బీజేపీ నేడో రేపో విడుదల చేసే రెండో జాబితాలో రాష్ట్రంలోని మిగిలిన సీట్లకూ అభ్యర్థులను ప్రకటించనుంది. మొత్తం 17 స్థానాల్లో మిగిలిన మహబూబ్‌నగర్, మహబూబాబాద్, ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్, నల్లగొండ, పెద్దపల్లి, మెదక్ సీట్లకు అభ్యర్థులను ప్రకటిస్తారు. ఈ సీట్లలో అభ్యర్థిత్వం గురించి వినిపించే పేర్లలో ఏ ఒక్కరూ కూడా ఏళ్లకుఏళ్లుగా పార్టీని నమ్ముకుని ఉన్నవారు లేకపోవడం గమనార్హం. మహబూబాబాద్ నుంచి సీతారాం నాయక్, ఖమ్మం నుంచి జలగం వెంకట్రావు, ఆదిలాబాద్ నుంచి నగేశ్, నల్లగొండ నుంచి శానంపూడి సైదిరెడ్డి అభ్యర్థిత్వాలు ఖరారైనట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నలుగురూ నాలుగు రోజుల క్రితం బీఆర్ఎస్ నుంచి కమలం పార్టీలో చేరారు. వరంగల్ టికెట్ బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్, పెద్దపల్లి టికెట్‌ను బీఆర్ఎస్‌తో అత్యంత సన్నిహితంగా ఉంటున్న మిట్టపల్లి సురేందర్‌కు ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. మెదక్ సీటుకు రఘునందన్‌రావు.. మహబూబ్‌నగర్ స్థానం కోసం డీకే అరుణ, జితేందర్‌రెడ్డి పోటీపడుతుండగా.. వీరెవరూ బీజేపీలో కింది స్థాయి నుంచి పనిచేసుకుంటూ వచ్చిన వారు కాదు.

వలస నేతలకు టికెట్లపై అసంతృప్తి..

క్రమశిక్షణకు మారుపేరుగా ఉండే కాషాయ పార్టీలో వలస నేతలకు టికెట్లు కేటాయించడంపై అసంతృప్తి జ్వాలలు భగ్గుమంటున్నాయి. మల్కాజ్‌గిరి నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ మురళీధర్ రావు తన భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తానని ఇటీవల ట్వీట్ చేసిన విషయం తెలిసిందే. పార్టీలో సభ్యత్వం లేని వ్యక్తికి హైదరాబాద్ టికెట్ ఇవ్వడమేంటని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. నిజామాబాద్ టికెట్ దక్కిన ధర్మపురి అర్వింద్‌పై స్థానిక నేతలు ఢిల్లీలో ప్రెస్‌మీట్ పెట్టి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇలా ఎన్నడూ లేనివిధంగా పార్టీ ప్రకటించిన అభ్యర్థులకు వ్యతిరేకంగా అసంతృప్త జ్వాలలు చెలరేగడం కమల దళంలో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. రెండో జాబితా ప్రకటించిన తర్వాత పార్టీలో అసమ్మతి సెగలు మరింత ఎక్కువగా ఉంటాయనే చర్చ జరుగుతోంది.

ఇకపై వాహనాల రిజిస్ట్రేషన్ కోడ్ 'టీజీ'

▸ గెజిట్ విడుదల చేసిన కేంద్ర రవాణా శాఖ

▸ 'టీఎస్'ను మార్చాలని రేవంత్ సర్కారు విజ్ఞప్తి

▸ సత్వరమే ఆమోదం తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 12: మోటారు వాహనాలకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర కోడ్‌ను మారుస్తూ కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ మంగళవారం గెజిట్ విడుదల చేసింది. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు కొలువుదీరాక.. ప్రస్తుతం ఉన్న 'టీఎస్' కోడ్‌ను 'టీజీ'గా మార్చాలంటూ కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఈ విజ్ఞప్తిని పరిశీలించిన కేంద్రం.. ఆ మేరకు ఆమోదం తెలుపుతూ.. గెజిట్‌ను జారీ చేసింది. నిజానికి తెలంగాణ ఏర్పాటు తర్వాత.. అంటే జూన్ 2, 2014 నుంచి 'టీజీ' కోడ్ అమల్లోకి వచ్చింది. కేసీఆర్ సర్కారు దానిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. తెలంగాణ స్టేట్(టీఎస్)కు ఆమోదం తెలపాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఆ కోడ్ వచ్చే దాకా రాష్ట్రంలో కొత్త వాహనాల రిజిస్ట్రేషన్లను నిలిపివేసింది. అలా.. దాదాపు 10 రోజుల పాటు రవాణా శాఖ వాహన రిజిస్ట్రేషన్ల జోలికి వెళ్లలేదు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి 'టీజీ' కోడ్ డిమాండ్ ఉండేది. అప్పట్లో దేవేందర్ గౌడ్ స్థాపించిన నవతెలంగాణ పార్టీ తరఫున హైవేల్లో వాహనాలను నిలిపి.. 'ఏపీ' అని ఉన్న రిజిస్ట్రేషన్ ప్లేట్లకు 'టీజీ'ని అతికించారు. అయితే.. కేసీఆర్ సర్కారు మాత్రం టీఎస్ వైపే మొగ్గుచూపింది. అంతేకాదు.. పత్రికల్లో కూడా రాష్ట్రం ఏర్పడ్డ తొలినాళ్లలో తెలంగాణకు బదులుగా 'టీజీ' అనే పొడి అక్షరాలను వినియోగించడంపైనా కూడా కేసీఆర్ సర్కారు అభ్యంతరం వ్యక్తం చేసింది. 'టీజీ' కాకుండా.. 'టీఎస్'ను వాడాలని కోరుతూ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాకు సీఎస్ ద్వారా లేఖలు పంపింది.

18న జగిత్యాలకు ప్రధాని

జగిత్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఈ నెల 18న జగిత్యాలకు వస్తున్నారని బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు మైడిపల్లి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన జగిత్యాలలో మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభను నిర్వహించడానికి సమాయత్తం అవుతున్నామని వెల్లడించారు. ఈ నెల 13న జిల్లా కేంద్రంలో సన్నాహక సమావేశం నిర్వహిస్తామని చెప్పారు.

కేరళలో మంప్స్ విజృంభణ

▸ ఒక్కరోజే 190 గవదబిళ్లల కేసులు నమోదు

▸ ఈ ఏడాది 11,467 మంది పిల్లలకు వైరస్

కొచ్చి, మార్చి 12: ఇటీవల కాలంలో దేశంలో గవదబిళ్లల కేసులు విజృంభిస్తున్నాయి. తాజాగా దక్షిణాది రాష్ట్రం కేరళలోనూ మంప్స్ (గవదబిళ్లలు) కేసులు కలకలం రేపాయి. ఆదివారం ఒక్కరోజే ఈ రాష్ట్రంలో 190 మంప్స్ కేసులు బయటపడడం ఆందోళన రేపుతోంది. కేరళ ఆరోగ్య శాఖ డేటా ప్రకారం.. ఈ నెలలోనే ఇక్కడ మొత్తం 2,505 మంది చిన్నారులు గవదబిళ్లల వ్యాధి బారినపడ్డారు. ఈ ఏడాది జనవరి నుంచి చూస్తే ఇప్పటివరకు ఈ సంఖ్య 11,467కు చేరుకుంది. మలప్పురం జిల్లాతోపాటు ఉత్తర కేరళలోని ఇతర ప్రాంతాల్లో ఈ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. మంప్స్ అనేది పారామైక్సో వైరస్ ద్వారా వ్యాప్తి చెందే ఒక అంటువ్యాధి. గవద బిళ్లలు, తట్టు, పొంగు వంటి వ్యాధుల నివారణకు వ్యాక్సిన్ ఉన్నప్పటికీ.. ఈ కేసులు ఈ స్థాయిలో నమోదవడం ఆందోళన కలిగించే అంశమే.

గవద బిళ్లలు.. దాని లక్షణాలు..

పారామైక్సో వైరస్ కారణంగా గవదబిళ్లల వ్యాధి వ్యాపిస్తుంది. ఇది గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధి. 5 నుంచి 12 ఏళ్లలోపు చిన్నారులకు ఇది సోకుతుంది. తేలికపాటి జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు, గొంతునొప్పి, అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి రెండు నుంచి నాలుగు వారాలపాటు కొనసాగుతాయి. సాధారణంగా చిన్నపిల్లల్లోనే కనిపించినప్పటికీ కౌమార దశలో ఉన్నవారు కూడా ఈ వ్యాధి బారినపడే ప్రమాదం ఉంది.



లేజర్ షోను ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి, చిత్రంలో మంత్రి జూపల్లి

హుస్సేన్ సాగర్‌లో లేజర్ షో

▸ ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

రాంగోపాల్‌పేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగరానికి వచ్చే పర్యాటకులకు అపూర్వమైన అనుభూతిని అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ నిధులతో నగర వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలను చేపట్టామని.. అందులో భాగంగానే హుస్సేన్ సాగర్‌లో లేజర్ షో ఏర్పాటు చేశామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పీవీ మార్గ్‌లోని సంజీవయ్య పార్క్‌లో హుస్సేన్ సాగర్ అలలపై లేజర్ ఆధారిత సౌండ్ అండ్ లైట్ షోను కిషన్‌రెడ్డి ప్రారంభించారు. కేంద్ర పర్యాటక శాఖ రూ.50 కోట్ల నిధులతో దీనిని ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. కోహినూర్ వజ్రం భిన్న సంస్కృతులు, వివిధ ఖండాలను దాటి సాగించిన కథను ఈ షోలో వాటర్ స్క్రీన్ పై చూడవచ్చన్నారు. భవిష్యత్తులో అవసరానికి అనుగుణంగా వివిధ కథలను ఈ లేజర్ షో లో మార్పులు చేసుకోవచ్చని తెలిపారు. తెలంగాణలో పర్యాటక రంగం అభివృద్ధి చెందడానికి మార్కెటింగ్ చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రాష్ట్రంలో వాటర్ స్పోర్ట్స్‌ను అభివృద్ధి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కోహినూర్ కథ రూపకర్త, రాజ్యసభ సభ్యుడు విజయేంద్ర ప్రసాద్.. ప్రముఖ గాయని సునీత, సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ తదితరులు పాల్గొనారు.

మరో రెండు వందే భారత్ రైళ్లు షురూ

విశాఖపట్నం-భువనేశ్వర్ మార్గంలో.. సికిందరాబాద్-విశాఖపట్నం మధ్య పరుగు

- జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ
- రైల్వే అభివృద్ధి ఘనత ప్రధానిదే: కిషన్ రెడ్డి



(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మరో రెండు వందే భారత్ రైళ్లకు ప్రధాని మోదీ పచ్చ జెండా ఊపారు. మంగళవారం వర్చువల్ విధానంలో వీటిని ప్రారంభించారు. విశాఖపట్నం-భువనేశ్వర్, సికిందరాబాద్-విశాఖపట్నం మధ్య ఈ సేవలు మొదలయ్యాయి. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మోదీ.. రూ.85 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. వాల్తేరు డివిజన్‌లో ఇప్పటి వరకు పూర్తయిన డబ్లింగ్ పనులను, మూడో లైన్ పనులను కూడా ప్రధాని జాతికి అంకితం ఇచ్చారు. విశాఖపట్నం నుంచి భువనేశ్వర్‌కు ప్రారంభించిన రైలులో విద్యార్థులు, ఇతర ప్రముఖులను పలాస వరకు తీసుకెళ్లారు. విజయనగరం, శ్రీకాకుళం స్టేషన్లలో ఈ రైలుకు స్వాగతం పలికారు. సికిందరాబాద్ నుంచి బయలుదేరిన వందే భారత్ రైలు మంగళవారం రాత్రి విశాఖపట్నం రాగా.. అధికారులు స్వాగతం పలికారు. వాల్తేరు డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్ నేతృత్వంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. పద్మశ్రీ డాక్టర్ ఆదినారాయణరావు, పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, ఎమ్మెల్యే గణబాబు తదితరులు పాల్గొన్నారు. 20707/20708 నంబరు కలిగిన సికిందరాబాద్-విశాఖపట్నం-సికిందరాబాద్ రైలు బుధవారం నుంచి రెగ్యులర్‌గా నడుస్తుందని అధికారులు వెల్లడించారు. 20841/20842 నంబరు గల భువనేశ్వర్-విశాఖపట్నం-భువనేశ్వర్ రైలు ఈ నెల 17 నుంచి రెగ్యులర్‌గా నడుస్తుందని తెలిపారు.

వర్చువల్‌గా ప్రారంభం..

అమృత్ భారత్ స్టేషన్ అభివృద్ధిలో భాగంగా ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో పలు అభివృద్ధి పనులను జాతికి అంకితం ఇచ్చారు. కాచిగూడ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన రైల్వే కోచ్ రెస్టారెంట్‌ను ప్రారంభించారు. మల్కాజిగిరి, మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేట రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేసిన వన్ స్టేషన్.. వన్ స్టాల్‌ను ప్రారంభించారు. సికిందరాబాద్ స్టేషన్‌లో లార్వెన్ గ్రూపు సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారతీయ ఔషధి కేంద్రాన్ని ప్రారంభించారు. సికిందరాబాద్, కాచిగూడ, మల్కాజ్‌గిరి, మెదక్ జిల్లాలోని అక్కన్న పేట రైల్వే స్టేషన్లలో స్క్రీన్లు ఏర్పాటు చేసి ఈ కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేశారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

రైల్వే అభివృద్ధి ఘనత మోదీదే: కిషన్ రెడ్డి

దేశంలో 9 ఏళ్ల పాలనలో రూ.85 వేల కోట్ల నిధులతో రైల్వే రంగాన్ని అభివృద్ధి చేసిన ఘనత ప్రధాని మోదీకి దక్కిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సికిందరాబాద్ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సికిందరాబాద్ స్టేషన్‌ను రూ.720 కోట్లతో శంషాబాద్ ఎయిర్‌పోర్టు తరహాలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. నాంపల్లి స్టేషన్‌ను రూ.350 కోట్లతో ఆధునీకరిస్తున్నామని తెలిపారు. త్వరలోనే చర్లపల్లి స్టేషన్ ప్రారంభోత్సవం ఉంటుందని తెలిపారు. సికిందరాబాద్-చర్లపల్లి ఎంఎంటీఎస్ రైలును నడపనున్నట్లు వెల్లడించారు.

మద్యం లిఫ్టింగ్‌కు తొలగిన ఆటంకం

- రవాణా వాహనాలకు పర్మిట్లు ఇస్తామన్న ఎక్సైజ్ శాఖ

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖల మధ్య వివాదంతో నిలిచిపోయిన మద్యం లిఫ్టింగ్ మళ్లీ మొదలైంది. మద్యం రవాణా వాహనాలకు 'ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్లు (టీపీలు)' ఇస్తామని ఎక్సైజ్ అధికారులు చెప్పడంతో లిఫ్టింగ్‌కు వైన్ షాపుల యజమానులు అంగీకరించారు. మంగళవారం వారి మధ్య చర్చలు జరిగాయి. మద్యం డిపోల నుంచి వైన్ షాపులు, బార్ల వద్దకు మద్యాన్ని తీసుకెళ్లే వాహనాలకు 'ఈ-వే బిల్లులు' కానీ టీపీలు కానీ ఉండాల్సిందేనని వాణిజ్య పన్నుల కమిషనరేట్ హుకుం జారీ చేసిన సంగతి తెలిసిందే. ఎక్కడికక్కడ వాహనాలను తనిఖీ చేసి, ఈ-వే బిల్లులు లేవంటూ సీజ్ చేశారు. దీంతో ఆందోళన చెందిన వైన్ షాపుల యజమానులు డిపోల నుంచి మద్యాన్ని లిఫ్ట్ చేయడాన్ని సోమవారం నుంచి నిలిపేశారు. ఇది ప్రభుత్వ రాబడిని దెబ్బకొట్టింది. దీంతో సీఎస్ శాంతికుమారి జోక్యం చేసుకుని, వాణిజ్య పన్నుల కమిషనర్ టీకే శ్రీదేవి, ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్‌ను పిలిచి సమస్యను పరిష్కరించుకోవాలని ఆదేశించారు. దాంతో ఎక్సైజ్ శాఖ టీపీలు ఇవ్వాలని నిర్ణయించింది. టీపీలు ఉంటే వాహన రవాణాకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఎక్సైజ్ అధికారులు యజమానుల్లో విశ్వాసం కల్పించారు. టీపీలపై 'విలువ ఆధారిత పన్ను (వ్యాట్)' చెల్లించారు అన్న వాక్యాన్ని ప్రింట్ చేస్తామని తెలిపారు. దీంతో వైన్ షాపు యజమానులు ఆందోళనను విరమించారు. మంగళవారం సాయంత్రం నుంచే మద్యాన్ని లిఫ్ట్ చేయడం ప్రారంభించారు.

కదన భేరిలో కేసీఆర్‌వి పచ్చి అబద్ధాలు

- నిజాలు నేడు వెల్లడిస్తా: బండి సంజయ్

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కదన భేరి సాక్షిగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ చెప్పిన అబద్ధాలను బుధవారం ఎండగడతానని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ప్రకటించారు. ఓట్ల కోసం బహిరంగ సభలో కేసీఆర్ అవాస్తవాలు మాట్లాడారని మండిపడ్డారు. కేసీఆర్ ఏం మాట్లాడారు... వాస్తవాలు ఏంటో వివరంగా తెలియజేస్తూ వాటికి సంబంధించిన ఆధారాలను కూడా బయటపెడతానని సంజయ్ ప్రకటించారు. మొన్నటి ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టినా సిగ్గు లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడారని దుయ్యబట్టారు. కేసీఆర్, వినోద్‌కుమార్ మాటల్లోని డొల్లతనాన్ని బుధవారం వెల్లడిస్తానని సంజయ్ ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు కన్హా శాంతివనానికి ముర్ము

షాద్‌నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం రాష్ట్రానికి రానున్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని కన్హా శాంతివనంలో నిర్వహించనున్న ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవాలను ప్రారంభించేందుకు ఆమె ఈనెల 14న కన్హా శాంతివనానికి రానున్నారు. అలాగే 15న ఉపరాష్ట్రపతి ఈ ఆధ్యాత్మిక సమావేశంలో పాల్గొనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 100 దేశాల నుంచి 300 మంది ముఖ్య ప్రతినిధులు ఈ ఆధ్యాత్మిక మహోత్సవాల్లో పాల్గొంటారు. రాష్ట్రపతి రాక సందర్భంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక, ఇతర శాఖ ఉన్నతాధికారులు మంగళవారం కన్హా శాంతివనాన్ని సందర్శించి ఏర్పాట్లపై పరిశీలించారు.

పతంజలిశాస్త్రికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రదానం



అవార్డును స్వీకరిస్తున్న పతంజలిశాస్త్రి

న్యూఢిల్లీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రముఖ తెలుగు రచయిత, నాటకకర్త తలావజ్ఝల పతంజలిశాస్త్రి 2023 సంవత్సరానికి గానూ కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. ఢిల్లీలో జరుగుతున్న సాహిత్యోత్సవాల్లో భాగంగా మంగళవారం.. కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ చేతుల మీదుగా ఆయన అవార్డును స్వీకరించారు. తెలుగులో రచించిన 'రామేశ్వరం కాకులు మరికొన్ని కథలు' కథాసంపుటికి గాను పతంజలిశాస్త్రి ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. ఆయన ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా పిఠాపురానికి చెందినవారు. తిరుపతిలోని వెంకటేశ్వర యూనివర్సిటీలో ఎంఏ చేసి, పుణే డెక్కన్ కళాశాలలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆయన రచనల్లో నలుపెరుపు, సమాంతరాలు, గుప్త91, దేవరకోటేశు, వీరనాయకుడు, మాధవి సుప్రసిద్ధమైనవి.

విద్యుత్ ఉద్యోగులకు ఓపీఎస్ అమలు చేయాలి

- సీఎంకు 1104 యూనియన్ ప్రధానకార్యదర్శి వినతి

హైదరాబాద్ సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఓపీఎస్ (పాత పెన్షన్) అమలు చేయాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.సాయిబాబ సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అలాగే విద్యుత్ సంస్థల్లోని కార్మికులకు పదోన్నతులు కల్పించాలని ఆయన కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం సీఎంను కలిసి వినతిపత్రం అందచేశారు. అనంతరం సాయిబాబ మాట్లాడుతూ.. ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు రావాల్సిన డీఏలు చెల్లించాలని, ఆర్టిజన్లకు విద్యార్హతలను బట్టి పదోన్నతులు కల్పించాలని సీఎంను కోరినట్లు చెప్పారు. కాంట్రాక్ట్ వేతనాలు పొందుతున్న కార్మికులకు విద్యుత్‌సంస్థల్లో శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించాలని, జెన్‌కో కారుణ్య నియమాలకు వ్యతిరేకంగా ఇచ్చిన ఉత్తర్వులు రద్దుచేసి గతంలో ఇచ్చిన కారుణ్య నియామక పద్ధతినే పాటించాలని కోరామని తెలిపారు. విధి నిర్వహణలో ప్రమాదానికి గురై శాశ్వత అంగవైకల్యం పొందిన కార్మికుల కుటుంబసభ్యులకు కారుణ్య నియామకాలు ఇవ్వాలని కోరామని సాయిబాబ పేర్కొన్నారు.

చేనేతల ఆత్మహత్యలు ఆపండి: సీపీఎం

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చేనేత పరిశ్రమను ఆదుకుని, కార్మికుల ఆత్మహత్యలను నిలువరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మంగళవారం సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్రంలో రెండు లక్షల మందికిపైగా చేనేత కార్మికులు వస్త్ర పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని, సిరిసిల్లలో మూడు నెలలుగా చేనేత పరిశ్రమ మూతపడిందని తెలిపారు. ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారమై మార్చి 11న సిరిసిల్లలో తడక శ్రీనివాస్(42) అనే పవర్‌లూమ్ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. వస్త్ర పరిశ్రమ కార్మికులు రెండు వారాలుగా ఆందోళన చేస్తున్నారని, ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. చేనేత ఉత్పత్తులకు ప్రభుత్వం రూ.485.89 కోట్లు చెల్లించాల్సి ఉన్నా ఆ బకాయిలు చెల్లించకపోవడం వల్ల యాజమాన్యాలు వస్త్ర పరిశ్రమను బంద్ చేశాయని పేర్కొన్నారు. ప్రభుత్వం చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించి, కార్మికులను ఆదుకొనేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని తమ్మినేని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సిరిసిల్లలో నేత కార్మికుడి బలవన్మరణం


- వస్త్ర పరిశ్రమలో సంక్షోభంతో దొరకని ఉపాధి
- ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకొన్న శ్రీనివాస్



సిరిసిల్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సంక్షోభం ఓ నేత కార్మికుడిని బలిగొంది. ఉపాధి లేక, ఆర్థిక ఇబ్బందులతో సిరిసిల్లలోని బీవై నగర్‌కు చెందిన తడక శ్రీనివాస్(42) సోమవారం రాత్రి ఉరేసుకున్నాడు. శ్రీనివాస్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, ఉపాధి లేకపోవడంతో మందులు కొనుక్కోవడానికి కూడా డబ్బుల్లేవని తోటి కార్మికులు చెప్పారు. శ్రీనివాస్‌కు భార్య లావణ్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఉపాధి లేక కుటుంబంలో మనస్పర్థలు రావడంతో లావణ్య తన కూతుళ్లతో కలిసి తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. ఒంటరిగా ఉంటున్న శ్రీనివాస్ మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, శ్రీనివాస్ కుటుంబంతో పాటు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఆసాముల సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ధర్నా నిర్వహించారు. శ్రీనివాస్ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

బాలికకు బలవంతపు పెళ్లి.. వారానికే ఆత్మహత్య

పాపన్నపేట, మార్చి 12: తల్లిదండ్రుల బలవంతం మీద ఇష్టం లేని పెళ్లి చేసుకున్న ఓ బాలిక వారం రోజులకే ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాదకర ఘటన మెదక్ జిల్లా పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. మెదక్ రూరల్ సీఐ కేశవులు, పాపన్నపేట ఎస్సై నరేష్ కథనం ప్రకారం.. బోడగట్టు గ్రామానికి చెందిన మంజుల, సంగమేశ్వర్ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఓ కొడుకు ఉన్నారు. పెద్ద కూతురు నాగరాణి అలియాస్ వైష్ణవి(17) పదో తరగతితో చదువు మానేసింది. ఎనిమిది రోజుల క్రితం వైష్ణవిని అదే గ్రామానికి చెందిన ఆమె మేనబావకు ఇచ్చి పెళ్లి చేశారు. పెళ్లి ఇష్టం లేదని వైష్ణవి చెప్పినా తల్లిదండ్రులు పట్టించుకోలేదు. ఈ క్రమంలో నవవధువు మంగళవారం పుట్టింటి నుంచి అత్తింటికి వెళ్లాల్సి ఉండగా బాత్‌రూంకు వెళ్లొస్తానని చెప్పి వెళ్లి ఉరేసుకుంది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా ఉరికి వేలాడుతూ ఉంది. బాలిక తల్లిదండ్రులను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు





ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

హర్యానా వ్యూహం

అతిసమీపంలో సార్వత్రిక ఎన్నికలు, ఆర్నెల్లలో అసెంబ్లీ ఎన్నికలు ఉండగా హర్యానా రాజకీయం అనూహ్య వేగంతో మారిపోయింది. రాష్ట్రశాఖ అధ్యక్షుడుగా ఉన్న నాయబ్‌సింగ్ సైనీ మంగళవారం మనోహర్‌లాల్ ఖట్టర్ స్థానంలో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. దేవీలాల్ మునిమనవడు దుష్యంత్‌చౌతాలా నేతృత్వంలోని జన్‌నాయక్ జనతాపార్టీ (జేజేపీ)తో ఐదేళ్ళుగా సాగుతున్న పొత్తును తెంపేసుకుంటే తప్ప రాజకీయంగా మేలు జరగదని బీజేపీ అనుకుంది. అసెంబ్లీలో పదిమంది సభ్యులున్న ఆ పార్టీతో తెగదెంపులు చేసుకొని, ఆ లోటు భర్తీకోసం ఏడుగురు స్వతంత్ర ఎమ్మెల్యేల్లో ఆరుగురి మద్దతు తెచ్చుకుంది. మిత్రపక్షాన్ని గెంటేసిన తరువాత కూడా మిగిలిన ఆర్నెల్ల కాలాన్ని నిక్షేపంగా నెట్టుకురాగలిగే సంఖ్యాబలం సాధించుకుంది కనుక, భాగస్వామి పార్టీ పోయినప్పటికీ, ముఖ్యమంత్రిగా ఖట్టర్ నిక్షేపంగా కొనసాగవచ్చు. కానీ, అదే పాతమంత్రులు కొందరు తిరిగి ప్రమాణస్వీకారం చేసినప్పటికీ, ఖట్టర్ స్థానంలోకి సైనీరావడం వెనుక చాలా లెక్కలూ వ్యూహాలూ ఉన్నాయి.

లోక్‌సభ ఎన్నికల సీట్లపంపకాల్లో తేడాలు వచ్చి రెండుపార్టీలూ వేరుపడ్డాయట. 2019లో బీజేపీ పది లోక్‌సభస్థానాలు గెలుచుకుంటే, ఈ ఎన్నికలకు కాస్తంత ముందు చౌతాలా కుటుంబంలో వచ్చిన విభేదాలతో ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్ఎల్‌డీ)నుంచి దుష్యంత్ వేరుపడ్డారు. అప్పటి లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కస్థానం కూడా ఆయన గెలవలేదు. సీట్ల పంపకాల వివాదం ఇంకా కొలిక్కిరాకముందే ఒక్కసీటు కూడా ఇవ్వబోమని బీజేపీ తేల్చేయడంతో, జాట్ల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో తనకు ఇంకా కొన్నింటిలో ఎంతోబలం ఉన్నదని నమ్ముతున్న దుష్యంత్ వేరుపడినట్టు కనిపిస్తోంది. హర్యానాలో జాట్లు 27శాతం వరకూ ఉంటారు. గత లోక్‌సభ ఎన్నికల్లో అత్యధికశాతం బీజేపీ పక్షాన నిలబడ్డారు. మోదీమీద అభిమానంతోపాటు, పుల్వామా రగల్చిన దేశభక్తి వంటివి బలంగా పనిచేశాయి. కానీ, ఈ మారు రైతు ఆందోళనలు, మహిళా మల్లయోధుల నిరసనలు, మద్దతు ధర ఉద్యమాలు సహా చాలా కారణాలతో అధికశాతం జాట్లు బీజేపీ పట్ల అసంతృప్తిగా ఉన్నారని, ఖట్టర్ మీద మరీ కోపంగా ఉన్నారని తేలిపోయింది. జాట్లు ఈ మారు కాంగ్రెస్ వైపు చూస్తున్న నేపథ్యంలో బీజేపీ—జేజేపీ కలిసి సాగితే ఇరువురికీ నష్టమే కనుక విడిపోయి బాగుపడాలని రెండు పార్టీలూ అనుకొని ఉంటాయి. కాంగ్రెస్, ఐఎన్ఎల్‌డి, జేజేపీ మధ్య జాట్ల ఓట్లు చీలిపోయిన పక్షంలో మిగతా అగ్రకులాల, ఓబీసీల ఓట్లతో తాను లబ్ధిపొందవచ్చునని, ఓబీసీల ఓట్లు సంపాదించడానికి కొత్త-ముఖ్యమంత్రి ఉపకరిస్తారని బీజేపీ భావించి గత అక్టోబర్‌లో రాష్ట్రశాఖ అధ్యక్షుడిగా నియమితుడైన వ్యక్తిని ఇప్పుడు ఏకంగా ముఖ్యమంత్రిని చేసింది. రాహుల్‌గాంధీ హామీ ఇస్తున్న కులగణన ఓబీసీలను ప్రభావితం చేస్తున్నందున, దానికి విరుగుడుగా సైనీని బీజేపీ ముందుకు తెచ్చి ఉండవచ్చు. నాయబ్‌సింగ్ వచ్చినంతమాత్రాన ఓబీసీలంతా బీజేపీకి ఓట్లువేయరన్న విమర్శలను అటుంచితే, హర్యానాలో సైనీలు 8శాతం వరకూ ఉన్నారు. మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ మాదిరిగా ఈయన కూడా యూపీ, బిహార్ సహా చాలా ఉత్తరాది రాష్ట్రాల్లో ఓబీసీలను ఆకర్షించేందుకు బీజేపీకి ఉపకరించవచ్చు.

ఖట్టర్ ప్రభుత్వం మీద ప్రజావ్యతిరేకత ఏ స్థాయిలో ఉన్నదో ఈ పరిణామాలు చెబుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ఆర్నెల్లముందే ఆయనను బీజేపీ అధిష్ఠానం పక్కకు తప్పించింది. కర్నాల్‌నుంచి లోక్‌సభకు పోటీచేయించి, అసెంబ్లీ ఎన్నికల-బరిలో ఆయన లేకుండా జాగ్రత్తపడుతోంది. అప్రదిష్టపాలైన గత ప్రభుత్వం ఛాయలను పూర్తిగా చెరిపివేసి, కొత్తముఖాన్ని ముందుపెట్టి విజయం సాధించాలని అనుకుంటోంది. బీజేపీ—జేజేపీ మధ్య సీట్ల ఒప్పందం కొలిక్కివచ్చిందని, విపక్షాల ఓట్లను చీల్చి తిరిగి తాము అధికారంలోకి వచ్చేందుకు అది ఉపకరిస్తుందని కొద్దిరోజుల క్రితమే ఖట్టర్ ప్రకటించారు. ఇప్పుడు ఆయనే బరిలో లేకుండాపోయారు. కొందరు ఎమ్మెల్యేలకు తిరిగి టిక్కెట్ ఇవ్వకుండా ప్రజావ్యతిరేకతను చల్లార్చేందుకు అధికారపక్షాలు ప్రయత్నిస్తుంటాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హర్యానాలో ముఖ్యమంత్రినే మార్చివేయడం బీజేపీ తన ఓటమిని అంగీకరించడమేనని కాంగ్రెస్ అంటోంది.

బీజేపీది బలమా, బలహీనతా?

'నీ రాజకీయ సిద్ధాంతం స్వప్రయోజనాలకు అనుగుణంగా, ఆచరణీయ దృక్పథంతో ఉండాలి. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరని. శాశ్వత ప్రయోజనాలు మాత్రమే ఉంటాయి అన్న వైఖరితోనే ఏ నిర్ణయమైనా తీసుకోవాలి. రాజకీయ అధికారం లేకపోతే నీకే శక్తీ లేనట్లే' అని ప్రముఖ అమెరికన్ రాజనీతిజ్ఞుడు విలియం క్లే తన దేశంలో రాజకీయ పార్టీలకు, నాయకులకు ఇచ్చిన సలహా ప్రపంచంలో ఏ దేశంలో నాయకుడికైనా వర్తిస్తుంది. భారత రాజకీయాల్లో ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ ఎంత బలమైన పార్టీ అయినప్పటికీ 370 సీట్లు గెలవాలంటూ ఒక లక్ష్యం అంటూ విధించుకున్న తర్వాత ఆ లక్ష్యం కోసం ఇవాళ దేశంలో వివిధ ప్రాంతీయ పార్టీలతో సీట్ల సర్దుబాటు కోసం చేస్తున్న ప్రయత్నాలను చూస్తే ఆశ్చర్యం కలుగుతోంది. అన్ని చోట్లా అత్యధిక లోక్‌సభ సీట్లు కావాలని ఆశిస్తోంది. గుర్రం కంటే ముందు నాడా కొనుక్కుంటున్నట్లు కనపడుతోంది బీజేపీ వారి పరిస్థితి. ఇది బలమా, బలహీనతా?

గత వారమంతా కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా పలు ప్రాంతీయ పార్టీల అధినేతలతో చర్చలు జరిపారు. శివసేన చీలిక వర్గం నాయకుడు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ చీలికవర్గం నేత, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌లతో సుదీర్ఘ చర్చలు జరిపినా వారి మధ్య సీట్ల ఒప్పందం ఒక కొలిక్కి రాలేకపోయింది. ఒడిషా బీజేపీ నేతలు ధర్మేంద్రప్రధాన్, మన్మోహన్‌సింగ్ సహాయ్, జ్యుయల్ ఓరంలతో చర్చలు జరుపుతూనే బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్‌కు అనేక సందేశాలు పంపారు. కాని అక్కడ కూడా సీట్ల సర్దుబాటు అంత సులభంగా జరిగేలా కనపడడం లేదు. నిజానికి ఒడిషాలో బిజూ జనతాదళ్ 11 సంవత్సరాల పాటు ఎన్డీఏతో స్నేహం చేసిన తర్వాత 2009లో తెగతెంపులు చేసుకుంది. అప్పుడు కూడా అందుకు ప్రధాన కారణం సీట్ల సర్దుబాటుపై ఏకాభిప్రాయం లేకపోవడమే. మళ్లీ ఇప్పుడు 15 సంవత్సరాల తర్వాత బీజేడీకి స్నేహ హస్తం చాస్తున్న బీజేపీ మళ్లీ అత్యధిక సీట్లను కోరుకుంటోంది. 'బీజేపీకి ఎక్కువ సీట్లు ఇవ్వడాన్ని మా కేడర్ వ్యతిరేకిస్తున్నారు' అని బీజేడీ నేత ఒకరు చెప్పారు.

మహారాష్ట్రలో రాజకీయ నేతల చంక్రమణాలు, చీలికలు అక్కడి ప్రజలకు కొత్తవి కావు. దేశంలో అత్యంత సీనియర్ నాయకుడైన శరద్ పవార్ ఎమర్జెన్సీ తర్వాత కాంగ్రెస్ ముఖ్యమంత్రి వసంతదాదా పాటిల్‌పై తిరుగుబాటు చేసి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (సోషలిస్టు) అనే పార్టీ స్థాపించారు. జనతా పార్టీ, పీజంట్స్ వర్కర్స్ పార్టీతో కలిసి పీడీఎఫ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అంతకు ముందే కాంగ్రెస్ అక్కడ రెండు ముక్కలైంది. మహారాష్ట్ర రాజకీయాల్లో శివసేన బలీయమైన శక్తిగా మారుతుండడంతో ఆ పార్టీని అడ్డుకోవడానికి మళ్లీ 1987లో కాంగ్రెస్ శరద్ పవార్‌ను తమ పార్టీలోకి ఆహ్వానించింది. కాంగ్రెస్ ఆయనను రెండుసార్లు ముఖ్యమంత్రిని చేసింది. 1999లో సోనియాగాంధీపై విదేశీ ముద్ర వేసి తిరుగుబాటు చేసి నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీని స్థాపించిన పవార్ 2004 లోక్‌సభ ఎన్నికల్లో అదే సోనియా నాయకత్వంలోని యూపీఏలో తన పార్టీని మిత్రపక్షంగా మార్చారు. ఏ శివసేననైతే కాంగ్రెస్ నేతలు, పవార్ వ్యతిరేకించారో ఆ శివసేనతోనే కలిసి ప్రభుత్వాన్ని ఏర్పరిచారు. తర్వాత శివసేన, ఎన్సీపీని కూడా బీజేపీ చీల్చి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడా చీలిన పార్టీల నుంచే బీజేపీ అత్యధిక సీట్లను ఆశిస్తోంది.



తన ఆకర్షణకు తిరుగులేదని, రామమందిర నిర్మాణం వల్ల ప్రజలు తమవైపే ఉన్నారని ప్రధాని మోదీ విశ్వసిస్తున్నప్పటికీ బీజేపీకి ఇవాళ స్వంతంగా మొత్తం 543 లోక్‌సభ సీట్లలో పోటీ చేయదగ్గ శక్తి లేదు. సాధ్యమైనన్ని ఎక్కువ సీట్లలో పోటీ చేసి 50 శాతానికి పైగా ఓట్లను కైవసం చేసుకోవాలని బీజేపీ భావిస్తోంది. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే బీజేపీకి ఇవాళ ప్రాంతీయ పార్టీల అవసరం ప్రబలంగా కనపడుతోంది.



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

రాజకీయ పార్టీలు శిబిరాలు మార్చడం దేశంలో కొత్త కాదు. ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా జనతా పార్టీ ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన చరణ్ సింగ్ తర్వాత అదే ఇందిర మద్దతుతో ప్రధానమంత్రి అయ్యారు. యూపీలో బీఎస్పీ, ఎస్పీ పలుసార్లు కలిసి, విడిపోయాయి. డీఎంకె, అన్నాడీఎంకె పార్టీలు రెండింటికీ కాంగ్రెస్, బీజేపీలతో కలిసి పనిచేసిన చరిత్ర ఉన్నది. కర్ణాటకలో జనతాదళ్(ఎస్) కూడా అదే దారిలో నడిచింది. మోదీని రాష్ట్రంలోనే అడుగుపెట్టనీయబోనని ఒకప్పుడు ప్రకటించిన నితీశ్ కుమార్ బీజేపీతోనే చేతులు కలిపి రెండుసార్లు ముఖ్యమంత్రి అయ్యారు. జమ్ముకశ్మీర్‌లో పీపుల్స్ డెమాక్రటిక్ పార్టీతో కలిసి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం ఇప్పటికీ ఆశ్చర్యం కలిగిస్తుంది.

ప్రాంతీయ పార్టీలు దేశంలో బలమైన జాతీయ పార్టీతో సంబంధాలు ఏర్పర్చుకోవాలనుకోవడం, తమ రాజకీయ, రాష్ట్ర ప్రయోజనాలు నెరవేర్చుకోవాలనుకోవడం కొత్త కాదు. కాని ప్రాంతీయ పార్టీలకు జాతీయ పార్టీ అవసరం ఎంత మేరకు ఉన్నదో, జాతీయ పార్టీలకు ప్రాంతీయ పార్టీల అవసరం అంతే ఉన్నదన్న విషయం విస్పష్టం. ఇవాళ కేంద్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండూ వివిధ ప్రాంతీయ పార్టీలతో పొత్తు ఏర్పర్చుకుని అత్యధిక లోక్‌సభ సీట్లు సాధించాలని అనుకుంటున్నాయి. కాని ఈ రెండు పార్టీల్లో ప్రాంతీయ పార్టీలపై కొంత ఎక్కువ ఒత్తిడి చేసే శక్తి బీజేపీకే ఉన్నదనడం వాస్తవం. బీజేపీ కేంద్రంలో పదేళ్లలో అపారమైన అధికారాన్ని, సంపదను సమకూర్చుకోవడమే కాక వ్యవస్థలపై పట్టు సంపాదించుకోవడం కూడా అందుకు ప్రధాన కారణం. అందుకే కొన్ని ప్రాంతీయ పార్టీలను బీజేపీ రాక్షస వివాహం చేసుకోగలుగుతోంది.

కాంగ్రెస్ కేంద్రంలో దాదాపు పది సంవత్సరాలుగా అధికారంలో లేనందువల్ల, అనేక రాష్ట్రాల్లో అధికారం కోల్పోయినందువల్ల మిత్రపక్షాలు చెప్పినట్లు ఆ పార్టీ వినవలసి వస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పేలవమైన పనితీరు ప్రదర్శించినందువల్ల ఎక్కడా పొత్తులపై స్వంతంగా షరతులు విధించలేని పరిస్థితుల్లో ఉన్నది. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ఇచ్చినన్ని సీట్లు తీసుకోవల్సి రావడమే కాదు, గుజరాత్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్ పోటీ చేసిన బరూచ్ స్థానంతో పాటు రెండు లోక్‌సభ సీట్లను ఆప్‌కు కేటాయించవలసిన అగత్యం కాంగ్రెస్‌కు ఏర్పడింది. మహారాష్ట్రలో రెండో స్థానంలో పోటీ చేసే పరిస్థితి ఉండగా, బెంగాల్‌లో తృణమూల్‌కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఆడిందే ఆటగా వ్యవహరిస్తున్నారు. లోక్‌సభ సీట్ల ఒప్పందం పేరుతో జార్ఖండ్‌లో కాంగ్రెస్ నుంచి జేఎంఎం రాజ్యసభ సీటును సాధించుకోగలిగింది.

అయితే కేంద్రంలో పదేళ్లుగా అపరిమిత అధికారం చలాయిస్తూ, తన ఆకర్షణకు తిరుగులేదని మోదీ భావిస్తున్నప్పటికీ, గతంలో ఏ పార్టీ హయాంలో జరగనంత అభివృద్ధి తానే చేశానని చెప్పుకుంటున్నప్పటికీ, రామమందిర నిర్మాణం, జాతీయ వాదం మొదలైన వాటి వల్ల ప్రజలు తమవైపే ఉన్నారని అనుకుంటున్నప్పటికీ బీజేపీకి ఇవాళ దేశంలో స్వంతంగా మొత్తం 543 లోక్‌సభ సీట్లలో పోటీ చేయదగ్గ శక్తి లేదనే చెప్పాలి. గడచిన రెండు ఎన్నికల్లోనూ దాదాపు వందకు పైగా సీట్లలో ఆ పార్టీ పోటీయే చేయలేదు. గత మూడు లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ ఖచ్చితంగా గెలిచిన సీట్లు 95 మాత్రమే. వీటితో పాటు దాదాపు 262 సీట్లు తమకు సురక్షితంగా ఉన్నాయని బీజేపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అందువల్ల ఈ సారి సాధ్యమైనన్ని ఎక్కువ సీట్లలో పోటీ చేసి 50 శాతం పైగా ఓట్లను సాధించడం, సాధ్యమైనన్ని మిత్రపక్షాలను ఏర్పర్చుకోవడం, ముఖ్యంగా తెలుగుదేశం, బీజేడీ వంటి పాత ఎన్డీఏ మిత్రపక్షాలను మళ్లీ కలుపుకోవడం చేయాలని బీజేపీ భావిస్తోంది. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే బీజేపీకి ఇవాళ ప్రాంతీయ పార్టీల అవసరం ప్రబలంగా కనపడుతోంది. లేకపోతే బీహార్‌లో నితీశ్ కుమార్‌ను ఇండియా కూటమి నుంచి చీల్చాల్సిన అవసరం మోదీకి ఏర్పడేది కాదు. నితీశ్ కుమార్ తమను తిట్టిన తిట్లన్నీ బీజేపీ మరిచిపోవాల్సి వస్తోంది. అంతేకాదు, తమ ఎజెండాకు భిన్నంగా కులజనగణనను జరిపిన జేడీ(యు)ను సమర్థించాల్సి వస్తోంది. నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీ(యు)తో పాటు చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్‌జేపీ, పశుపతి పరాస్‌కు చెందిన ఎల్‌జేపీ (రాష్ట్రీయ), ఉపేంద్ర కుషవాహాకు చెందిన రాష్ట్రీయ లోక్ మోర్చా, జితన్‌రాం మాంఝీ నేతృత్వంలోని హిందూస్తాన్ అవామీ మోర్చా కూడా ఆ పార్టీకి అవసరం. ఉత్తరప్రదేశ్‌లో కూడా అప్నాదళ్ (సోనేలాల్), రాష్ట్రీయ లోక్‌దళ్, నిషాద్ పార్టీ, రాజ్‌భర్ నేతృత్వంలోని సుహల్దేవ్ భారతీయ సమాజ్ పార్టీలను విస్మరించదగిన స్థితిలో ఆ పార్టీ లేదు. అసోంలో అసోం గణపరిషద్, యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్, జార్ఖండ్‌లో ఆల్ ఇండియా జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్‌తో బీజేపీకి చేతులు కలపక తప్పడం లేదు. ఏదో రకంగా తమతో 38—40 పార్టీలు ఉన్నాయని చెప్పుకునేందుకు బీజేపీ తంటాలు పడుతోంది. ఇవాళ దేశంలో బీజేపీ కానీ, కాంగ్రెస్ కానీ విస్మరిస్తున్న పార్టీలు రెండే ఉన్నాయి. అవి వైసీపీ, బీఆరఎస్ మాత్రమే.

ప్రాంతీయ పార్టీలన్నిటిలో తెలుగుదేశం పార్టీయే ప్రాప్తకాలజ్ఞతతో వ్యవహరించిందనే చెప్పాలి. నిజానికి ఆంధ్రప్రదేశ్‌లో గత ఎన్నికల్లో బీజేపీకి ఒక శాతం ఓట్లు మాత్రమే వచ్చినప్పటికీ ఆ పార్టీకి ఆరు లోక్‌సభ సీట్లు కేటాయించడం చాలా ఎక్కువ అని ఆ పార్టీ నేతలు పలువురు చెబుతూనే ఉన్నారు. ఈ విషయం చంద్రబాబునాయుడుకు కూడా తెలియనిది కాదు. కాని ఎన్నికల నిర్వహణ విషయంలోనూ, ఎన్నికల తర్వాత సహకారం విషయంలోనూ, అభివృద్ధి విషయంలో తనకున్న పేరును విభజిత ఏపీలో కూడా సార్థకం చేసుకోవడం కోసం ఆయన బీజేపీకి స్నేహహస్తం చాచారు. దేశంలోని ప్రాంతీయ పార్టీల నేతలందరూ తీవ్ర అంతర్మథనంతో ఉన్నారంటే మోదీ ప్రత్యామ్నాయ రాజకీయాలు ఎంత బలహీనంగా ఉన్నాయో అర్థమవుతోంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

పరిశోధనా తేజోమూర్తి

పరిశోధకులు రెండు రకాలు. నానా గ్రంథాలయాలు దర్శించి, అనేకానేక పుస్తకాలు పరిశీలించి, పటిష్ఠమైన పరిశోధనా వ్యాసం సమర్పించి పీహెచ్‌డీ లేదా డి.లిట్, పట్టాలు పొందేవాళ్ళు మొదటి రకం. తాము స్వీకరించిన విషయం గురించి సామగ్రి సేకరించడానికై కాళ్లకు బలపం కట్టుకొని పూరూవాడా, నగరం మహానగరం, సందు గొందులు తిరిగీ తిరిగీ విషయసేకరణ చేస్తూ, పరిశోధనాంశానికి సంబంధించిన బీద్ధాబిక్కీ, దేశ దిమ్మర్ల మధ్యనే రోజులు నెట్టుకొస్తూ వాళ్ల కష్టాలు కడగండ్లను అక్షరబద్ధం చేస్తూ ఆ పీడిత, తాడిత, అనాదృత వర్గ ప్రజల సముద్ధరణకు జీవితాన్నే సమర్పించిన పరిశోధకులు రెండో-రకం. ఈ శ్రేణికి చెందినవాళ్లు నూటికో కోటికో ఒకరిద్దరు మాత్రమే ఉంటారు. అలాంటి అపూర్వమైన, అద్వితీయురాలైన పరిశోధకురాలే డా. వకుళాభరణం లలిత. పగలనకా రాత్రనకా ఎండనకా వాననకా, ఊరనకా వాడనకా పరిశ్రమించి, పరిశోధన పసిడిని వెలికి తీసిన ఘనపాఠి డా. వకుళాభరణం లలిత.



ఆమె తెలుగు, సమాజశాస్త్రం, సార్వజనిక పాలనా విధానాల్లో ఎం.ఎ. పట్టాలు పొందింది. కావలి జవహర్ భారతి కళాశాలలో రాజకీయశాస్త్రం బోధించింది. తెలుగు అకాడమీలో కొన్నేళ్లపాటు చరిత్ర, సమాజశాస్త్ర, గిరిజన, ఆదివాసీల చరిత్రల్లో ప్రగాఢమైన పరిశోధన గ్రంథాలు వెలువరించి, ఇంగ్లీషు పాలనా శాస్త్ర పుస్తకాల్ని తెలుగులోకి అనువదించింది. ఇవన్నింటి కలపోతగా 'ది మేకింగ్ ఆఫ్ క్రిమినల్ ట్రైబ్స్: ప్యాటర్న్స్ అండ్ ట్రాన్సిషన్' అనే విషయం మీద విద్వత్ పూర్ణమైన సిద్ధాంత వ్యాసం రాసి కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి మానవశాస్త్రంలో పిహెచ్.డి. డిగ్రీ సంపాదించింది.

లలిత 1961లో వకుళాభరణం రామకృష్ణగారి అర్ధాంగి అయ్యింది. ఇద్దరూ 55ఏళ్లపాటు దాంపత్య జీవితం ఎంతో సామరస్యంగా గడిపి అర్ధనారీశ్వర్లుగా వర్ధిల్లి విద్యార్థిలోకానికి ఆరాధ్యులుగా పూజింపబడ్డారు. లలిత వైదిక సంప్రదాయ కుటుంబంలో జన్మించినా, ఉదార ప్రవృత్తిగల పరిసరాల్లోనే చదువు సాములు సాగించారు. డా. రామకృష్ణ గారి సంస్కరణ భావజాలం ఆమె ఆలోచనాపరిధిని మరింత విశాలం చేసింది. కావలి జవహర్ భారతి కళాశాలలో ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, వేదుల సత్యనారాయణశాస్త్రి, శ్రీరామ్ వేంకట భుజంగరాయశర్మ, ఎమ్. పట్టాభిరామరెడ్డి, కె.వి. రమణారెడ్డి లాంటి హృదయ సంపన్నుల, మేధావుల ఛత్రచ్ఛాయలో పెరిగి, బౌద్ధిక, మానసిక వైశాల్యాన్ని సంతరించుకొని, ఎంతో మంది విద్యార్థుల్ని తేజోమూర్తులుగా తీర్చిదిద్దిందామె.

డా. వకుళాభరణం లలిత దృష్టి దక్షిణ భారతదేశంలోని ముఖ్యంగా ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, ఒడిస్సా, మహారాష్ట్రలోని గిరిజన, ఆదివాసీ, దళిత వర్గాల గురించి విస్తృతమైన, లోతైన పరిశోధనలు చేసి అమూల్యగ్రంథాలు వెలువరించింది. ఆమె సమాజంలో అట్టడుగున పడివున్న దేవదాసి, జోగిని, మాతంగి, యానాది, ఎరుకల, వేశ్యల, ఆడబాపల జీవితాల లోతుల్ని పరిశోధించి, ఉపన్యాసాల, వ్యాసాల, నివేదికల, పుస్తకాల ద్వారా వాళ్ల దయనీయ స్థితిగతుల్ని ప్రభుత్వం దృష్టికి తెచ్చి, వాళ్ళ సముద్ధరణకు కృషి చేసింది. ఆమె ఇంగ్లీషులో 'జోగిని విమెన్ రిఫార్మ్ అండ్ డైనమిక్స్ ఆఫ్ సోషియల్ ఛేంజ్ ఇన్ సౌత్ ఇండియా' అనే పుస్తకాన్ని సుందర్ కొంపల్లితోను, గాంధిమల్లితో 'ట్రైబ్స్ అండర్ స్టిగ్మా ప్రాబ్లమ్స్ ఆఫ్ ఐడెంటిటీ', 'ఎడ్యుకేటింగ్ ట్రైబల్ చిల్డ్రన్: ఇష్యూస్, కన్‌సర్న్స్ అండ్ రెమిడీస్', 'ట్రైబల్ కల్చర్ ఇన్ ఆంధ్ర అండ్ తెలంగాణ: ట్రెడిషన్ అండ్ ఛేంజ్' అనే పరిశోధనా గ్రంథాల్ని వెలువరించింది. కాగా ఎమ్. ప్రమీలా రెడ్డి సహకర్తృత్వంతో 'దేవదాసీ వ్యవస్థ' అనే పుస్తకాన్ని, గాంధిమల్లి, కొంపల్లి సుందర్‌తో కలిసి 'మాజీ నేరస్థ జాతులు: సమగ్ర పరిశీలన' అనే గ్రంథాన్ని ప్రచురించింది. ఆమె పరిశోధనా గ్రంథాలన్నీ అగాధ పరిశ్రమతో కూడుకొన్న ఆణిముత్యాలు. ఆమె ఆంధ్రప్రదేశ్‌లోని 28 ఆదివాసీ తెగల నృత్యాల గురించి హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రదర్శన కళాశాల విద్యార్థినీ విద్యార్థులచే రాయించిన లఘు సిద్ధాంత వ్యాసాలు అరవై పైబడే వున్నాయి.

లలిత, జీవిత భాగస్వామి ఆచార్య వకుళాభరణం రామకృష్ణతో కలిసి రాసిన 'దుర్గాబాయి దేశముఖ్', 'రఘుపతి వెంకటరత్నం నాయుడు' మొదలైన పుస్తకాలు నేటి తరానికి దారి చూపే వెలుగు దివ్వెలు. డా. వకుళాభరణం లలిత సమాజశాస్త్ర, మానవశాస్త్ర పరిశోధనలో అపారమైన కృషిచేసి, యువ పరిశోధక తరాన్ని తీర్చిదిద్దిన ప్రతిభాశాలిని. ఐదు దశాబ్దాలకు పైగా అవిశ్రాంత పరిశోధన సాగించి 2017 మార్చి 14వ తేదీన చిరవిశ్రాంతి తీసుకొన్న చల్లని తల్లి ఆమె.

— ఘట్టమరాజు

(మార్చి 14: వకుళాభరణం లలిత వర్ధంతి)

సామాజిక న్యాయమే అభివృద్ధి

దేశంలో పురుషులతో పోల్చినప్పుడు మహిళలు ఉత్పత్తి కార్యకలాపాలలో పాల్గొనటం (వర్క్ ఫోర్స్ పార్టిసిపేషన్) తగ్గిపోతూ వస్తున్నదని అధికారిక సమాచారం నివేదిస్తున్నది. ఈ స్థితి వివిధ రాష్ట్రాలలో చాలా భిన్నంగా వుంది. ఇది 'కార్మికులు'గా లెక్కించబడిన మహిళలకు మాత్రమే సంబంధించినదని అందరికి తెలిసిందే. ఇదిలా వుంటే స్త్రీ వాద మేధావులు, ఇతరులు, మన పితృస్వామ్య వ్యవస్థలో అసలు పని చేయని మహిళలు అంటూ ఎవరూ ఉండరని నిరంతరం ఎత్తి చూపుతున్నారు. వారు, మహిళల పనిని సమయ వినియోగ సర్వేలు వంటి భిన్న రూపాలలో అంచనా వేయటానికి ఇతర సాధనాలను, పద్ధతులను వారు పదే పదే సూచిస్తున్నారు. అంతేకాక, పురుషులు ఆర్థిక వ్యవస్థలో బాగా పనిచేయటానికి దోహదం చేసే మహిళల అదృశ్య పని లేకుండా పురుషులు సమర్థంగా పనిచేయటం సాధ్యం కాదు కూడా.

మహిళలకు నెలకు రూ.2500 ఇచ్చే మహాలక్ష్మి పథకం మహిళా హక్కుల ఉద్యమకారులు చేస్తున్న డిమాండ్‌ను పాక్షికంగా నెరవేర్చింది. ఉచిత బస్సు ప్రయాణ సేవను కూడా స్త్రీలు బయటకు వెళ్లటంపై మన సమాజం విధించిన కట్టుబాట్లను బద్దలు కొట్టే ప్రగతిశీల విధానంగా చూడాలి.

పితృస్వామిక వ్యవస్థ మన సమాజంలో మహిళలపైన అనేక రకాల పునరుత్పత్తి, సంరక్షణ పాత్రలను రుద్దటం మన చుట్టూ జరుగుతున్నదే. దానితో పాటు అత్యధిక శాతం మహిళలు వేతన శ్రమగా గుర్తించబడిన ఆర్థిక కార్యకలాపాలను కూడా చేస్తున్నారు. పురుషులు ఇంటి బయట ఆర్థిక పాత్ర గల పనిని చేస్తారు అనే ఊహాత్మక భావనతో పిల్లల సంరక్షణ, కుటుంబంలో పెద్దలు, రోగుల సంరక్షణ బాధ్యత కూడా ప్రాథమికంగా మహిళలపైనే రుద్దటం జరుగుతున్నది. ప్రత్యుత్పత్తి పనులలో వంట, శుభ్రం చేయటం, కడగటం, నీరు తేవటం, వంట చెరకు సేకరించటం, మేత తేవటం, వంటి అనేక పనులు ఉంటాయి. ఈ పనులను మహిళలు ప్రతిరోజు వారి జీవిత కాలమంతా చేస్తారు. 'సామాజీకీకరణ' ప్రక్రియలు పురుషులను ఇంటి పనులు చేయటకుండా నివారించాయి, కాగా మహిళలు కూడా ప్రశ్నించకుండా ఆ పనులను చేయటం కొనసాగిస్తున్నారు.

కుటుంబ పరిధిలో మహిళలు పొద్దస్తమానం చేసే పనులను గుర్తించాలని, వాటి భారాన్ని తగ్గించాలని, ఇతరులకు పంచాలని, వాటికీ విలువ కట్టి తగిన వేతనం చెల్లించాలని స్త్రీ వాద ఉద్యమకారులు, ఆర్థికవేత్తలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. మహిళలు ఇంటివద్ద చేసే పనిని, అందునా నిజానికి పురుషుల కంటే ఎక్కువ గంటలు చేసే పనిని గుర్తించటం ఈ దిశలో మొదటి అడుగు అవుతుంది. వీలైనంతవరకు అటువంటి పనిని పెద్ద ఎత్తున నిర్దేశక మార్పులు, ప్రవర్తనా రీతుల్లో మార్పుల ద్వారా తగ్గించాలి. దానితో పాటు పిల్లల సంరక్షణ వసతుల పరంగా ప్రభుత్వ సేవలు, ఇంటికి కుళాయిల ద్వారా తాగు నీటి సరఫరా, ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ, వృద్ధుల సంరక్షణ సదుపాయాలు వంటి మౌలిక సదుపాయాలను విస్తరించాలి. మహిళలకు వారు చేసే వేతనం లేని పనిని గుర్తించి దానికి సరిపడిన వేతనం ఇవ్వటం చాలా ముఖ్యం. భారత ప్రభుత్వం ఆమోదించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో ఐదవది— జెండర్ సమానత్వం, మహిళల బాలికల సాధికారతను సాధించటానికి సంబంధించినది. దానిలో 5.4వ లక్ష్యం ఈ విధంగా ప్రకటించింది 'ప్రభుత్వ సేవలు, మౌలిక సదుపాయాల కల్పన, సాంఘిక భద్రత విధానాల ద్వారా వేతనం లేని సంరక్షణ పనిని, ఇంటి పనిని గుర్తించి, దానికి విలువ నివ్వాలి. కుటుంబం లోపల పనులను బాధ్యతలను పంచుకోవటాన్ని జాతీయ స్థితిగతులకు అనుగుణంగా ప్రోత్సహించాలి'.

ఈ నేపథ్యం నుండే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వ 'గ్యారెంటీలను' మహిళల వేతనం లేని పనికి వేతనం ఇచ్చేదిగా అర్థం చేసుకుని అభినందించాలి. దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న కుటుంబాల మహిళలకు నెలకు 2500 రూ. ఇచ్చే మహాలక్ష్మి పథకం మహిళా హక్కుల ఉద్యమకారులు చేస్తున్న డిమాండ్‌ను పాక్షికంగా నెరవేర్చినట్లు అర్థం చేసుకోవాలి. అదే విధంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సేవను కూడా స్త్రీలు బయటకు వెళ్లటంపై మన సమాజం విధించిన కట్టుబాట్లను బద్దలు కొట్టే ప్రగతిశీల విధానంగా చూడాలి. ఇది మహిళలు పనిలో పాల్గొనటాన్ని పెంచే వాతావరణాన్ని సృష్టించడానికి దోహదపడుతుంది. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలితను, మిక్సీలు పంచిపెట్టటం వంటి 'ఉచితాల' గురించి, అది ప్రజా ధనాన్ని వృథా చేయటం కాదా అని ప్రశ్నించినప్పుడు ఆమె కూడా ఆ పథకాన్ని స్త్రీ వాద భావన నుండి వివరించారు. ఇటువంటి సాంఘిక భద్రత పథకాలు మహిళలకు సాధికారత కల్పించే ప్రగతిశీల విలువలు, వారికీ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కల్పించటంపై ఆధారపడినవాటిని ఎత్తి చూపవలసివుంది. వాటిని 'రేవడి'గా చూడలేము. సామాజిక న్యాయ మార్గాలే మనలను 'వికసిత్ భారత్'కు చేరుస్తాయి. సామాజిక న్యాయమే అభివృద్ధి అవుతుంది Justice itself is Vikas!

— కవిత కురుగంటి, సామాజిక కార్యకర్త

కాళేశ్వరం నేటికీ కరువుపై జలాస్త్రమే!

అల్దాస్ జానయ్య గారు 'కాళేశ్వరం ప్రాజెక్టుకు కాలం చెల్లినట్లేనా?' శీర్షికతో మార్చి 1న రాసిన వ్యాసం ఆంధ్రజ్యోతి ఎడిట్ పేజీలో అచ్చయ్యింది. ఆయన తనను తాను వ్యవసాయ ఆర్థికవేత్తగా ప్రకటించుకున్నారు. కానీ ఆయన వ్యాసం కాళేశ్వరంపై బయట చక్కర్లు కొడుతున్న వ్యతిరేక ప్రచారాలపై ఆధారపడి వండి వార్చినట్టు కనిపిస్తున్నదే తప్ప ఒక వ్యవసాయ ఆర్థికవేత్తగా ఆయన స్వతంత్ర పరిశోధన చేసి రాసినట్టు ఏ మాత్రం కనిపించడం లేదు.

ఉద్యమాల నుంచి ఉద్భవించిన కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణను తిరోగమనంలోకి తీసుకువెళ్ళిందని అల్దాస్ జానయ్య నిర్ధారిస్తున్నారు. ఈ పదేళ్ళలో వ్యవసాయ రంగంలో జరిగిన అభివృద్ధి వ్యవసాయ ఆర్థికవేత్తగా ఆయనకు కనిపించకపోవడం విచిత్రం. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి తెలంగాణలో ధాన్యం ఉత్పత్తి 45 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే. 2023 నాటికి అది 3 కోట్ల టన్నులకు పెరిగింది. దేశంలో ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్ ప్రథమ స్థానంలో ఉండేది. అతికొద్ది కాలంలోనే పంజాబు రాష్ట్రాన్ని కిందకు తోసి తెలంగాణ ప్రథమ స్థానంలో నిలచింది. ఈ పురోగతి ఎందువల్ల సాధ్యం అయ్యింది?

జూన్ 2014కు ముందు 80లక్షల ఎకరాల విస్తీర్ణానికి వివిధ వనరుల ద్వారా సాగునీరు అందిందని, తెలంగాణ ఏర్పడిన తర్వాత అది కేవలం 92లక్షల ఎకరాలకు పెరిగిందని, అది కూడా బోరు బావుల కింద పెరిగిన ఆయకట్టే తప్ప ప్రాజెక్టుల వల్ల పెరిగింది కాదని అల్దాస్ జానయ్య ఏ గణాంకాల ఆధారంగా నిర్ధారించినారో వివరిస్తే బాగుండేది. రాష్ట్ర ఏర్పాటుకు ముందు 80 లక్షల ఎకరాలకు సాగునీరు అందే పరిస్థితి ఉంటే తెలంగాణలో వేలాది మంది రైతులు ఆత్మహత్యలకు ఎందుకు పాల్పడినట్టు? జానయ్య ఎక్కడో తప్పులో కాలు వేసినట్టుగా అనిపిస్తున్నది. ఈ పదేళ్ళలో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన జల వనరుల అభివృద్ధి కారణంగానే తెలంగాణలో సాగు విస్తీర్ణం పెరిగింది. ధాన్యం ఉత్పత్తి 45 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 3 కోట్ల మెట్రిక్ టన్నులకు పెరిగింది.

ఇక కాళేశ్వరంపై అల్దాస్ జానయ్య అవగాహనారాహిత్యాన్ని వివరిస్తాను. ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాణహిత చేవెళ్ళ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు ఉన్నా దాన్ని పక్కన బెట్టి రీడిజైన్ పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టారని జానయ్య అంటున్నారు. ప్రాణహిత చేవెళ్ళ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక్క అనుమతి రాలేదు. కీలకమైన నీటి లభ్యతపై, ఇరిగేషన్ ప్లానింగ్‌పై కేంద్రం అనేక అభ్యంతరాలను లేవనెత్తింది. మహారాష్ట్ర ప్రభుత్వం బ్యారేజి ఎత్తుపై, ఆ ఎత్తు వద్ద ముంపుపై నిరంతరాయంగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చవాన్ రాసిన లేఖ అందుకు సాక్ష్యం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే 2014 నుంచి 2015 వరకు ప్రాణహిత ప్రాజెక్టుకు మహారాష్ట్ర అనుమతి సాధించడానికి కేసీఆర్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నం చేసింది. 2015 ఫిబ్రవరి 17న ఆనాటి మహారాష్ట్ర గవర్నర్ సి.హెచ్. విద్యాసాగర్ రావు సమక్షంలో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో కేసీఆర్ చర్చించారు. '152 మీ. ఎత్తుకు బ్యారేజి నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వమే అనుమతించలేదు. దానికి వ్యతిరేకంగా ఉద్యమించిన నేను అనుమతించే ప్రశ్నే ఉత్పన్నం కాదు. ఎత్తును 148మీ.కు తగ్గించుకోండి అని కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు'. ఆ తర్వాత 2015 మార్చిలో కేంద్ర జల సంఘం తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు అవసరాలకు తగినంత నీటి లభ్యత లేదని, రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచన చేసుకోవాలని సూచిస్తూ లేఖ రాసింది. ఇక కాలాయాపన జరగకుండా ప్రత్యామ్నాయ స్థలం కోసం వెతకవలసిన అవసరం ఏర్పడింది. ప్రాణహిత ప్రాజెక్టు రీ ఇంజనీరింగ్‌కు అదే మూలకారణం. ఆ వెతుకులాటలో మేడిగడ్డ అనువైన స్థలంగా కేంద్ర ప్రభుత్వ సంస్థ వాప్కోస్ నిర్ధారించింది. ఇక్కడ 284 టిఎంసిల నికర జలాలు లభ్యం అవుతాయని కేంద్ర జల సంఘం కూడా ధ్రువీకరించింది.





బ్యారేజి నిర్మాణానికి మేడిగడ్డ అనువైన స్థలం కాదని నిపుణుల కమిటీ చేసిన సిఫారసులను నాటి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసి మేడిగడ్డ వద్ద బ్యారేజి కట్టిందని నిరాధార ఆరోపణలు చేసినారు జానయ్య. అసలు విశ్రాంత ఇంజనీర్లు సమర్పించిన ఆ నివేదికలో ఏముందో జానయ్యకి తెలియదు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యల ఆధారంగానే ఆయన ఈ మాటలు రాసినారని అర్థం అవుతున్నది.

మేడిగడ్డ బ్యారేజి నిర్మాణానికి అనువైన స్థలం కాదని నిపుణుల కమిటీ చేసిన సిఫారసులను నాటి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసి మేడిగడ్డ వద్ద బ్యారేజి కట్టిందని నిరాధార ఆరోపణలు చేసినారు జానయ్య. అసలు విశ్రాంత ఇంజనీర్లు సమర్పించిన ఆ నివేదికలో ఏముందో జానయ్యకి తెలియదు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యల ఆధారంగానే ఆయన ఈ మాటలు రాసినారని అర్థం అవుతున్నది. నిజానికి ఆ నివేదిక మేడిగడ్డ బ్యారేజి నిర్మాణానికి పూర్తిగా అనుకూలం. వారు 'Desirable కాదు' అన్నది మేడిగడ్డ వద్ద బ్యారేజి నిర్మాణంపై కాదు. మేడిగడ్డ నుంచి నేరుగా మిడ్ మానేరుకు నీటిని తరలించే మార్గం పైన మాత్రమే వారు అభ్యంతరం వ్యక్తం చేసినారు. ఎందుకో ఆ నివేదికలోనే చెప్పారు. ఆ మార్గంలో సింగరేణి బొగ్గు గనులు ఉన్నాయి కనుక పైప్‌లైన్ వేయడం కానీ, సొరంగాలు తవ్వడం కానీ వీలు కాదు అన్నారు. జానయ్య, ఇతరులు కూడా ఆ నివేదికను సంపూర్ణంగా చదివి నిర్ధారణలకు రావాలని, ముఖ్యమంత్రి మాటల మీద ఆధారపడి కాదని మనవి చేస్తున్నాను.


ఇకపోతే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీల డిజైన్‌లను రాష్ట్ర ప్రభుత్వ డిజైన్ ఇంజనీర్లు పూర్తిగా కేంద్ర జల సంఘం (CWC), సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ & పవర్ (CBIP), బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (BIS) వారు 'Design of Barrages on Permeable Foundations'పై జారీ చేసిన మాన్యువల్స్, సర్క్యులర్స్, కోడ్స్ ఆధారంగా చేసినారే తప్ప వారి ఇష్టం వచ్చినట్టు చేయలేదు. దేశంలో ఎక్కడ బ్యారేజ్ నిర్మించినా వీటి ఆధారంగానే నిర్మిస్తారు. ఇక్కడ డిజైన్ లోపం ఉండే ఆస్కారమే లేదు. బ్యారేజి ప్రారంభం అయిన 2019 నుంచి వరుసగా నాలుగు సీజన్లలో భారీ, అతి భారీ వరదలు గోదావరిలో సంభవించాయి. 2022 జూలైలో వచ్చిన వరద 500 ఏండ్లకు ఒకసారి వచ్చే వరద. 28 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకొని బ్యారేజీలు నిలబడినాయి. అయితే 8 బ్లాకులుగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీలో 7వ బ్లాకులో ఒక పిల్లరు కుంగింది. దాని ప్రభావం పక్కన ఉన్న మరో రెండు పిల్లర్లపై ఉంది. మిగతా బ్లాకులు, పిల్లర్లు ఏవీ కుంగలేదు. 7వ బ్లాకులో 20వ నంబరు పిల్లరు కుంగడానికి కారణం ఏమిటో తెలియాలంటే భూభౌతిక పరీక్షల అనంతరమే తెలుస్తుంది. అంతవరదాక ఎవరు ఏమి చెప్పినా ఊహాగానాలే తప్ప ఖచ్చితమైన కారణం కాజాలదు.

చివరగా ఈ కాళేశ్వరం ప్రాజెక్టుపై అదనంగా ఏ ఖర్చు చేయవద్దని ఉచిత సలహా పారేసినారు. దీన్ని టూరిజం కోసమో, చేపల పెంపకానికో వాడుకోవాలని కూడా సూచిస్తున్నారు. వ్యవసాయ ఆర్థికవేత్త అయిన జానయ్య గారికి తెలంగాణపై ప్రేమ ఉంటే ఇటువంటి అపహాస్యపు మాటలు అనేవారు కాదు. ప్రాజెక్టు కింద 18.25 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, 18.82 లక్షల ఎకరాల స్థిరీకరణ ఉన్నది. ఈ రకమైన ఇరిగేషన్ ప్లానింగ్‌కే కేంద్ర జల సంఘం అనుమతిని జారీ చేసింది. అందుకు అనుగుణంగానే జలాశయాల నిల్వ సామర్థ్యాన్ని 16 టిఎంసిల నుంచి 141 టిఎంసిలకు పెంచుకోవడం జరిగింది. ఇప్పటివరకు ప్రస్తుత ప్రభుత్వ లెక్కల ప్రకారమే ప్రాజెక్టు ద్వారా 98 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు, శ్రీరాంసాగర్, నిజాంసాగర్, వేలాది చెరువులు, చెక్ డ్యాంల కింద 19 లక్షల ఎకరాల స్థిరీకరణ సాధ్యం అయ్యింది. అంటే మొత్తం సుమారు 20 లక్షల ఎకరాలకు నికరంగా రెండు పంటలకు ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందింది. వాస్తవం ఇట్లా ఉంటే జానయ్య లాంటి మేధావులు ఏ ప్రయోజనాలను ఆశించో తప్పుడు నిర్ధారణలతో వ్యాసాలు రాయడం విచారకరం.

అసలు తెలంగాణ ఎత్తిపోతల పథకాలను 'ఖర్చులు — ప్రయోజనాలు' అన్న కోణంలో విశ్లేషించడం సమంజసమా? తెలంగాణలో నదులు తక్కువ ఎత్తులో (80మీ. — 150మీ.) ప్రవహిస్తాయి. సాగు యోగ్యమైన భూములు 200మీ. నుంచి 650మీ. వద్ద ఉంటాయి. ఈ భూములకు సాగునీరు అందించాలంటే ఎత్తిపోతలు తప్ప మరో మార్గం లేదని అందరు అంగీకరిస్తున్నదే. ప్రాణహిత చేవెళ్ళను అంగీకరిస్తున్న వారు కరెంటు ఖర్చులు ఎక్కువ అన్న కారణంతో కాళేశ్వరం ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నారు. ప్రాణహిత ప్రాజెక్టులో కూడా కరెంటు ఖర్చు దాదాపు ఇంతే ఉంటుంది. ఎత్తిపోతల పథకాలు తెలంగాణకు ఒక సామాజిక అవసరం. ఏ ప్రభుత్వమైనా ఎత్తు గడ్డ మీద ఉన్న భూములకు సాగునీరు అందించాలంటే భారీ ఎత్తిపోతలు నిర్మించవలసిందే తప్ప 'ఖర్చులు — ప్రయోజనాలు' అన్న కోణంలో విశ్లేషిస్తూ చేతులు ముడుచుకొని కూర్చుంటే తెలంగాణ కూడా విదర్భ లాగా రైతుల ఆత్మహత్యలకు నిలయంగా మిగిలిపోయి ఉండేది. కాళేశ్వరం కాలం చెల్లిన ప్రాజెక్టు కాదు జానయ్యగారూ... తెలంగాణ కరువుపై జలాస్త్రం!

● వి. ప్రకాష్

తెలంగాణ జల వనరుల అభివృద్ధి సంస్థ

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
బుధవారం 13 మార్చి 2024

మంగళవారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 38.5° C | కనిష్ఠం : 22.0° C



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : బుధవారం సా : 6.31 గం..
సహర్ : గురువారం ఉ : 5.03 గం..


హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, చిత్రంలో మంత్రులు సురేఖ, సీతక్క

చేతల్లో చూపిస్తాం..

- నగరంలో పెండింగ్ పనులను పూర్తిచేస్తాం
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- రూ.60కోట్లు స్మార్ట్ మార్జిన్ నిధులు ఇచ్చేందుకు అంగీకారం
- హైదరాబాద్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు
- పాల్గొన్న మంత్రులు సురేఖ, సీతక్క ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం మాదిరిగా మాటల్లో కాకుండా చేతల్లో చూపుతామని, నగరంలోని పెండింగ్ పనులను పూర్తి చేసి అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. వరంగల్ నగరం, ముఖ్యంగా పశ్చిమ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనుల సత్వర పూర్తి, అందుకు అవసరమైన, అదనపు నిధులు మంజూరు, విడుదల తదితర అంశాలపై మంగళవారం ఆయన హైదరాబాద్ సచివాలయంలో సమావేశం నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చొరవతో జరిగిన ఈ సమావేశానికి దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్, స్త్రీ సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయతోపాటు రెవెన్యూ, దేవాదాయశాఖ, మున్సిపాలిటీ, ఆర్‌అండ్‌బీ శాఖల ప్రిన్సిపల్ సెక్రెటరీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశం మూ డు గంటల పాటు సుదీర్ఘంగా సాగగా.. వరంగల్ నగరాభివృద్ధి కోసం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

త్వరలో భద్రకాళి ఆలయ మాడవీధుల పనులు

భద్రకాళి దేవాలయం చుట్టూ మాడవీధుల నిర్మాణం లో జరుగుతున్న జాప్యంపై ప్రధాన చర్చ జరిగింది. మాడవీధుల నిర్మాణానికి గతంలోనే కుడా రూ.10కోట్లు ఇవ్వగా.. గత ప్రభుత్వం రూ.20కోట్లు మంజూరు చేసిం ది. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వమిచ్చిన రూ.20కోట్లు విడుదలవలేదు. దీనికితోడు మాడవీధుల్లో 60శాతం భూమిపై నిర్మాణం జరుగుతుండగా, మిగతా 40 శాతం చెరువు మీది నుంచి జరుగుతోందంటూ నీటిపారుదల శాఖ అనుమతులు నిరాకరిస్తోంది. అనుమతి కోసం గ్రీన్ ట్రిబ్యునల్‌కు రాశామని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నా.. ఆ దిశగా సత్వర అనుమతికి ఎలాంటి చొరవ తీసుకోవడం లేదు. దీంతో మాడవీధుల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. దీనిపై మంత్రి పొంగులేటి స్పందిస్తూ.. త్వరలో మాడవీ ధుల పనులు పూర్తయ్యేలా చూడాలని కుడా అధికారులను, సమావేశం నుంచే నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి వెంటనే అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. మిగిలిన రూ.20కోట్లు వెంటనే విడుదలయ్యేట్టు చూస్తానని హామీ ఇచ్చారు. భద్రకాళి దేవస్థానం అభివృద్ధి పనులను ఆగమ శాస్త్రం ప్రకారం చేపట్టాలని, ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మాడవీధుల్లో భాగంగా తొమ్మిది అంతస్తుల రాజగోపురాన్ని, చుట్టూ రాతి బేస్‌మెంట్‌ను నిర్మిస్తామన్నారు. దీనితో పాటు ఆలయ అభివృద్ధికి అదనంగా మరికొన్ని నిధులు ఇవ్వాలని

మిగతా 8వ పేజీలో..

కరుణాపురం వద్ద రూ.60కోట్లతో వంతెన ఆమోదం

హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారి కరుణాపురం జంక్షన్ వద్ద రూ.60కోట్లతో వంతెన నిర్మాణానికి సమావేశం ఆమోదం తెలిపింది. ఈ జంక్షన్ వద్ద నిర్మించిన అండర్ బ్రిడ్జి వల్ల హైదరాబాద్ నుంచి నగరానికి వచ్చేపోయే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని నేరుగా రావడానికి వీలుగా ఇక్కడ బైపాస్ వంతెన నిర్మించాలన్న ప్రతిపాదన సమావేశంలో చర్చకు వచ్చింది. ఇందుకోసం నిట్ రూపొందించిన డిజైన్‌ను సమావేశంలో ఆమోదించారు. దీని నిర్మాణానికి అవసరమైన నిధులను వెంటనే విడుదలయ్యేట్టు చూడాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈసమావేశానికి మున్సిపల్ శాఖ సెక్రెటరీ దాన కిశోర్, దేవాదాయ శాఖ కమిషనర్ వి.అనిల్‌కుమార్, హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కమలం గూటికి అరూరి



కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ

- నేడు ఢిల్లీలో చేరికకు ఏర్పాట్లు
- అనుచరులతో సమావేశం తర్వాత రాజధానికి పయనం
- రమేష్ రాకతో బలం పెరుగుతుందని భావిస్తున్న బీజేపీ
- కడియం శ్రీహరితో టచ్‌లోకి కాంగ్రెస్?
- మారుతున్న ఓరుగల్లు రాజకీయం
- లోక్‌సభ ఎన్నికల వేళ 'గులాబీ'దళంలో అయోమయం

(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రెండు సార్లు ఎమ్మెల్యేగా, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన అరూరి రమేష్ కమలం గూటికి చేరడం ఖాయమైంది. ఈ క్రమంలోనే సీనియర్‌నేత, మాజీ డిప్యూటీసీఎం, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని చేర్చుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నట్టు వార్తలు రావడం.. ఇప్పటికే వరుస వలసలతో కుదేలవుతున్న బీఆర్ఎస్‌ను మరింత కలవరపెడుతోంది. అరూరి చేరికతో బలపడొచ్చన్న భావనలో బీజేపీ ఉండగా.. బీఆర్ఎస్‌కు ఎలాగైనా చెక్‌పెట్టాలన్న యోచనతో కాంగ్రెస్ పావులు కదుపుతుండటంతో ఓరుగల్లు రాజకీయాలు రోజురోజుకు మారుతున్నాయి. చివరగా ఏ పార్టీ నుంచి ఎవరు పోటీచేస్తారన్న దానిపై అందరిలోనూ ఉత్కంఠ కనిపిస్తోంది.

నేడు బీజేపీలోకి అరూరి

బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ బుధవారం బీజేపీలో చేరనున్నారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో పాటు పలువురు పార్టీ పెద్దలతో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో వరంగల్ ఎంపీ టికెట్‌పై బీజేపీ పెద్దల నుంచి హామీ పొందిన అరూరి రమేష్ బుధవారం వరంగల్‌లో అనుచరులతో సమావేశం నిర్వహించి, బీఆర్ఎస్‌కు రాజీనామా ప్రకటించి ఆ తర్వాత సాయంత్రానికి ఢిల్లీ వెళ్లి కాషాయ కండువా కప్పుకోబోతున్నారు. అయితే పది రోజుల కిందటే బీజేపీలో చేరేందుకు ఏర్పాట్లు చేసు కున్న రమేష్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు హైదరాబాద్ పిలిచి బుజ్జగించడంతో మెత్తబడిన రమేష్ తాను పార్టీ మారేది లేదని చెబుతూ వచ్చారు. కానీ అనూహ్యంగా ఆయన మంగళవారం బీజేపీ నేత అమిత్‌షాను కలవడం చర్చనీయాంశమైంది. ఇక రమేష్‌ను బీజేపీలోకి సాదరంగా ఆహ్వానించిన అమిత్‌షా వరంగల్‌లో బీజేపీ జెండా ఎగురవేయాలని, పార్టీలో మంచి భవిష్యత్తు ఉంటుందని భరోసా ఇచ్చినట్టు సమాచారం. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాతో పాటు పార్టీ పెద్దలను మర్యాదపూర్వకంగా కలిసే అవకాశం ఉంది. మొత్తానికి పార్లమెంట్ ఎన్నికలకు ముందు అరూరి తన 'కారు' ప్రయాణానికి ఫుల్ స్టాప్ పెట్టడం బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తుండగా.. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన అరూరి రమేష్ రాకతో తమ బలం పెరుగుతుందని బీజేపీ శ్రేణులు భావిస్తున్నాయి.

కడియం శ్రీహరికి కాంగ్రెస్‌కు ఆఫర్!



మాజీ డిప్యూటీసీఎం, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని చేర్చుకుని, వరంగల్ నుంచి పోటీకి దించాలని కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. 2014లో వరంగల్ ఎంపీగా గెలిచిన శ్రీహరికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సత్సంబంధాలున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన్ను కాంగ్రెస్‌లోకి రప్పించేందుకు సీఎం రేవంత్‌కు అత్యంత సన్నిహితుడైన ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ నేత ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. వరంగల్ ఎంపీగా కడియం పోటీ చేస్తే, ఫలితాల అనంతరం ఆయనతో స్టేషన్‌ఘనపూర్‌కు రాజీనామా చేయించి.. ఉప ఎన్నికల్లో ఆయన కుమార్తె కావ్యకు టికెట్ ఇస్తామని ఆఫర్ ఇచ్చినట్టు తెలిసింది. దీనిపై శ్రీహరితో నేరుగా చర్చలు జరపాలని కాంగ్రెస్ నేతలు నిర్ణయించినట్టు సమాచారం. కాంగ్రెస్ రెండో జాబితా బుధవారం రాత్రి లేదంటే గురువారం వెలువడే అవకాశం ఉండగా.. కడియం నుంచి అనుకూల స్పందన వస్తే వరంగల్ సీటుపై పెండింగ్ పెట్టాలని కాంగ్రెస్ యోచిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అయితే నిత్యం కాంగ్రెస్‌పై నిప్పులు చెరుగుతున్న కడియం శ్రీహరి పార్టీ మారుతారా? అనే చర్చ కూడా జరుగుతోంది.

హస్తం వైపు మేయర్ చూపు

ఇప్పటికే బల్దియాకు చెందిన కార్పొరేటర్లు పలువురు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అయితే వీరితో పాటే హస్తం గూటికి చేరేందుకు ప్రయత్నించి మేయర్ గుండు సుధారాణి రాకను జిల్లాకు చెందిన ఓ మంత్రితో పాటు పలువురు కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు అడ్డుకున్నట్లుగా ప్రచారం జరిగింది. అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేయర్ చేరికపై అభ్యంతరం చెప్పుతున్న నేతలతో మాట్లాడి ఒప్పించినట్లుగా తెలిసింది. దీంతో త్వరలోనే మేయర్ గుండు సుధారాణి కాంగ్రెస్ గూటికి చేరుతారనే ప్రచారం జరుగుతోంది. మొత్తానికి బీఆర్ఎస్‌లోని కీలక నేతలు పార్టీ మారుతుండటంపై ఓరుగల్లులో హాట్‌హాట్‌గా రాజకీయాలు మారుతున్నాయి.

పెళ్లింట విషాదం

- 16న వివాహం.. అంతలోనే మృత్యు ఒడికి వరుడు
- కెనాల్‌లో మృతదేహం లభ్యం.. ఆత్మహత్యగా అనుమానాలు


కృష్ణతేజ(ఫైల్)

వరంగల్ క్రైం, మార్చి 12: పెళ్లి బాజా మోగాల్సి ఆ ఇంట విషాదం నెలకొంది. ఈనెల 16న పెళ్లిపీటలు ఎక్కాల్సిన వరుడు కెనాల్‌లో శవమై కనిపించాడు. హనుమకొండ గోకుల్‌నగర్‌కు చెందిన భూక్యా కృష్ణతేజ(29) ఆదివారం సాయంత్రం తన పెళ్లి కార్డులు స్నేహితులకు ఇచ్చేందుకు బైకుపై వెళ్లి.. రాత్రయినా రాలేదు. ఈ క్రమంలో సోమవారం ఉదయం కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలువేల్పుల సమీపంలోని కెనాల్ వద్ద కృష్ణతేజ బైక్ ఉన్నట్లు తెలిసింది. వెళ్లిచూసిన కుటుంబ సభ్యులు ఆ బైకు కృష్ణతేజదని గుర్తించి యువకుడి తల్లి శకుంతల కేయూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ నిర్వహిస్తుండగా.. మంగళవారం కృష్ణతేజ మృతదేహం వర్ధన్నపేట సమీపంలోని కెనాల్‌లో లభించింది. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు యువకుడి మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివాహం ఇష్టంలేక కృష్ణతేజ కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రవాహం ఎక్కువగా ఉండటంతో కృష్ణతేజ మృతదేహం వర్ధన్నపేటలో తేలిందని కేయూ ఎస్ఐ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. కేసు నమోదు చేసి విచారణ నిర్వహిస్తున్నామన్నారు.

వైభవంగా ఫాతిమామాత ఊరేగింపు


ఫాతిమామాత ప్రతిమతో రథయాత్రనిర్వహిస్తున్న దృశ్యం

- జనసంద్రమైన ఫాతిమానగర్
- కొనసాగుతున్న ఉత్సవాలు
- భారీగా హాజరైన క్రైస్తవులు

కాజీపేట, మార్చి 12: కాజీపేట ఫాతిమానగర్ ఫాతిమా కేథడ్రిల్ చర్చిలో మంగళవారం రెండో రోజు ఫాతిమామాత ఉత్సవాలు ఘనంగా జరిగాయి. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన క్రైస్తవులు, మఠకన్యలు, ఫాదర్‌లతో ఫాతిమానగర్ జనసంద్రమైంది. మంగళవారం ఉదయం 10గంటలకు చర్చిలో ఫాదర్ దాసరి జోసఫ్, గోపు కమల్ ప్రత్యేక స్వస్థత ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనలో తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాల నుంచి వచ్చిన క్రైస్తవులు పాల్గొన్నారు. సాయంత్రం వరంగల్ బిషప్ ఉడుముల బాల దివ్యబలి పూజ నిర్వహించారు. ఫాతిమానగర్‌లో చర్చి నిర్మాణం, తదితర అంశాలను గుర్తుచేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఘనంగా ఫాతిమామాత రథయాత్ర

దివ్యబలి పూజ అనంతరం ఫాతిమా కేథడ్రల్ చర్చి ఆవరణ నుంచి అలంకరించిన ప్రత్యేక వాహనంలో ఫాతిమామాత ప్రతిమతో రథయాత్ర నిర్వహించారు. బిషప్ ఉడుముల బాల, చర్చి విచారణ గురువు మర్రెడ్డిలు ప్రత్యేక ప్రార్థనలు చేసి ర్యాలీని ప్రారంభించారు. ఈ యాత్రలో వేలాదిగా క్రైస్తవులు పాల్గొన్నారు. యాత్ర ఫాతిమానగర్, సిద్ధార్థనగర్, ప్రశాంత్‌నగర్, దర్గా పురవీధుల నుంచి తిరిగి ఫాతిమా చర్చికి చేరుకుంది. అనంతరం బిషప్ ఉడుముల బాల ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దివ్యసత్ప్రసాదాన్ని పీఠంపై ప్రతిష్ఠించారు. రాత్రి పునీత అంథోని కళాక్షేత్రం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ చర్చిల నుంచి వచ్చిన కళాకారులు ఆలపించిన గీతాలు, దైవ నాటికలు పలువురిని ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు ఫాతిమామాత గుహవద్ద తలనీలాలు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి మెక్కులు చెల్లించారు. ఈ ప్రత్యేక ప్రార్థనల్లో ఫాదర్‌లు మర్రెడ్డి, అనుకిరణ్, లూర్దురెడ్డి, ప్రశాంత్‌తోపాటు వివిధ జిల్లాల నుంచి ఫాదర్‌లు, మఠకన్యలు పెద్దఎత్తున హాజరయ్యారు. భారీగా హాజరైన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా చర్చి కమిటీ ప్రెసిడెంట్ బొక్క దయాసాగర్ అన్ని చర్యలు తీసుకున్నారు. శాంతి భద్రతలకు భంగం కలగకుండా కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

నేడు ముగింపు

ఫాతిమామాత ఉత్సవాలు మూడోరోజు బుధవారంతో ముగియనున్నాయి. హైదరాబాద్ అగ్రపీఠాధిపతి కార్డినల్ పూల అంథోని సమష్టి కృతాజ్ఞతాబలి నిర్వహిస్తారు. అనంతరం స్వస్థత ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సవాలు ముగియనున్నాయి.


దివ్య బలి పూజ చేస్తున్న బిషప్ ఉడుముల బాల

16మంది ఎస్ఐల బదిలీ

వరంగల్ క్రైం, మార్చి 12: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 16మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
సీహెచ్.ప్రమోద్‌కుమార్	మామునూరు	శాయంపేట
డి.దేవెందర్	శాయంపేట	కేయూసీ
బి.రవిందర్	వీఆర్	కేయూసీ
బి.వెంకన్న	వీఆర్	ఇంతెజార్‌గంజ్
వి.నవీన్‌కుమార్	వీఆర్	కాజీపేట
కె.శ్రావణ్‌కుమార్	వీఆర్	హనుమకొండ
ఎస్‌కె.మహమూద్	వీర్	మిల్స్‌కాలనీ
డి.విజయ్‌కుమార్	వీఆర్	నర్సంపేట
బి.ప్రవీణ్	వీఆర్	నర్సంపేట
టి.శ్రీకాంత్	వీఆర్	మామునూరు
సీహెచ్.పరుశరాములు	వీఆర్	హనుమకొండ
టి.లచ్చయ్య	వీఆర్	మట్టెవాడ
ఎస్.మౌనిక	వీఆర్	మహిళాపీఎస్ (సుబేదారి)
వి.ఉమాకాంత్	వీఆర్	కాజీపేట ట్రాఫిక్
ఇ.నర్సింహరావు	టాస్క్‌ఫోర్స్ వరంగల్	ఏనుమాముల
జె.మొగిళి	కాజీపేట ట్రాఫిక్	సీసీఎస్, వరంగల్

'విశ్వకర్మ యోజన'ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 12: అర్హులైన ప్రతీ ఒక్కరు పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా సూచించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో పీఎం విశ్వకర్మ యోజన పథకంపై వివిధ చేతి వృత్తులు, హస్త కళాకారులకు మంగళవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాధికా గుప్తా జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. వివిధ చేతి వృత్తిదారులు, హస్తకళాకారులు ఆర్థికంగా ఎదగడానికి విశ్వకర్మ యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకుని విశ్వకర్మ పథకంతో ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతోందన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఎం. హరి ప్రసాద్ మాట్లాడుతూ.. పీఎం విశ్వకర్మ యోజన పథకంతో 18 రకాల చేతి వృత్తులు, హస్తకళాకారులు (వడ్రంగి, స్వర్ణకార, కమ్మరి, కుమ్మరి, మేదర, రజక, నాయిబ్రాహ్మణ, తాపీమేస్త్రీలు మొదలైన వారు) ప్రయోజనం పొందవచ్చన్నారు.

అనంతరం చేతివృత్తిదారులు, హస్తకళాకారులు పీఎం విశ్వకర్మ యోజన పథకం ద్వారా ఎలా ప్రయోజనం పొందవచ్చుననే అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ అధికారి శివరాం ప్రసాద్, ఎల్డీఎం శ్రీనివాస్, మెప్మా పీడీ భద్రునాయక్, బీసీ వెల్ఫేర్ డీడీ రాంరెడ్డి, చేతివృత్తిదారుల సంఘాల నాయకులు, చేతివృత్తిదారులు, హస్తకళాకారులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బంది వివరాలు
ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్ రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి వికాస్ రాజ్

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 12: ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి సంయుక్త ఎన్నికల అధికారులతో మంగళవారం సాయంత్రం జిల్లాల కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లతో రానున్న లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ ఏఆర్వో వద్ద ఆ అసెంబ్లీ నియోజకవర్గ మొత్తం ఓటర్ల జాబితా ఉండాలన్నారు. అలాగే ఇతర అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ల సమాచారం ఉండే విధంగా చూసుకోవాని, పోస్టల్ బ్యాలెట్ వివరాలు ఉండేలా చర్యలు చేపట్టా లన్నారు. ఈవీఎంల ర్యాండ మైజేషన్, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల సమాచారం, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది సమా చారం పంపాలన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అడిషనల్ కలెక్టర్లు రాధికా గుప్తా, వెంకట్ రెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, నారాయణ, డీపీఓ లక్ష్మీ రమాకాంత్, డీసీఓ సత్యనారాయణ రెడ్డి, డీఈఓ డాక్టర్ అబ్దుల్‌హై, హనుమకొండ, పరకాల తహశీల్దార్లు విజయ్‌కుమార్, భాస్కర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రసాద రావు పాల్గొన్నారు.









ఎన్‌పీడీసీఎల్ ఈఈలు (సివిల్) బదిలీ

హనుమకొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్లుగా తెలంగాణ రాష్ట్ర నార్తరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ ఎన్‌పీడీసీఎల్) కార్పొరేట్ కార్యాలయానికే పరిమితమైన సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఈఈ)లకు ఎట్టకేలకు విముక్తి లభించింది. వారు తిరిగి క్షేత్రస్థాయికి వెళ్లి విధులు నిర్వహించే అవకాశం ఏర్పడింది. కార్పొరేట్ ఆఫీసులోని ఐదుగురు సివిల్ ఈఈలను సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కార్పొరేట్ ఆఫీసులో సీజీఎం పరిధిలో పనిచేస్తున్న ఈఈ (సివిల్) వెంకటేశ్వర్‌ను హనుమకొండ హెడ్‌క్వార్టర్‌లో ఎస్ఈ ఆపరేషన్‌కు మార్చారు. ఈయన హనుమకొండ, వరంగల్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ సర్కిళ్ల పరిధిలోని సివిల్ పనులను పర్యవేక్షిస్తారు.

ఇదే కార్పొరేట్ ఆఫీసులో సీజీఎం (ఆపరేషన్-1) పరిధిలో పనిచేస్తున్న మరో ఈఈ (సివిల్) కె.శ్రీనివాస్‌ను కరీంనగర్ హెడ్‌క్వార్టర్ ఎస్ఈ ఆపరేషన్ ఆఫీసుకు స్థాన చలనం చేశారు. ఈయన కరీంనగర్, జగిత్యాల, పెద్దపెల్లి ఆపరేషన్ సర్కిళ్ల పరిధిలోని విద్యుత్ సివిల్ పనులను చూస్తారు. కార్పొరేట్ ఆఫీసులో సీజీఎం (ఆపరేషన్-11) కింద పని చేస్తున్న ఈఈ (సివిల్) జి వెంకటేశ్వర్లును ఖమ్మం హెడ్‌క్వార్టర్‌లోని ఎస్‌సీ (ఆపరేషన్) కార్యాలయానికి డైవర్ట్ చేశారు. ఈయన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం ఆపరేషన్ సర్కిళ్లను పర్యవేక్షిస్తారు. కార్పొరేట్ ఆఫీసులో సీఈ కన్‌స్ట్రక్షన్ ఆఫీసులో పని చేస్తున్న ఈఈ (సివిల్) కోమిరెడ్డి స్వామిని నిజామాబాద్ ఎస్ఈ (ఆపరేషన్) ఆఫీసుకు మార్చారు. ఆయన నిజామాబాద్ కామారెడ్డి సర్కిళ్లను, అలాగే కార్పొరేట్ ఆఫీసులో ఎస్ఈ/క్యూసీ అండ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో పని చేస్తున్న ఈఈ (సివిల్) పి.జానార్దన్‌రావును ఆదిలాబాద్ జిల్లా ఎస్ఈ ఆఫీసుకు బదిలీ చేశారు.

ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని ఆయా జిల్లాల్లో క్షేత్రస్థాయిలో సివిల్ పనులను పర్యవేక్షించాల్సిన వీరిని గత సీఎండీ గోపాల్‌రావు ఏడేళ్ల కిందట కార్పొరేట్ ఆఫీసుకు తీసుకువచ్చారు. దీనితో వీరికి పనిలేకుండా పోయింది. కొత్త సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన కర్నాటి వరుణ్ రెడ్డి ప్రక్షాళన చేపట్టారు. కార్పొరేట్ ఆఫీసులోని ఈఈ (సివిల్)లను ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని ఆయా జిల్లాల సర్కిళ్లకు పంపిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.







మండలాధ్యక్షులపై అవిశ్వాసాలు పెట్టొచ్చు

- నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీవోలకు ఉంది
- హైకోర్టు స్పష్టీకరణ .. పలువురి దావాల కొట్టివేత

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు వ్యతిరేకంగా వచ్చిన అవిశ్వాస తీర్మానాలపై సమావేశాలు నిర్వహించే అధికారం ఆర్డీవోలకు ఉందని హైకోర్టు తేల్చిచెప్పింది. పలు మండలాల అధ్యక్షులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. తమకు వ్యతిరేకంగా అవిశ్వాస సమావేశాలు నిర్వహించేలా ఆర్డీవోలు నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ.. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్ ఎంపీపీ ఉమాదేవి, రామన్నపేట్ ఎంపీపీ జ్యోతి, మద్నూర్ ఎంపీపీ లక్ష్మీబాయి, రామారెడ్డి ఎంపీపీ దశరథ్‌రెడ్డి, వరంగల్ జిల్లా గీసుకొండ ఎంపీపీ సౌజన్య, రంగారెడ్డి జిల్లా మర్రిగూడ ఎంపీపీ మోహన్‌రెడ్డి, సరూర్‌నగర్ ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డి, నల్లగొండ జిల్లా చండూర్ ఎంపీపీ పల్లె కల్యాణి, కరీంనగర్ జిల్లా రామడుగు ఎంపీపీ కలగంటి కవిత, ఆదిలాబాద్ జిల్లా ఏలూరు సారంగాపూర్ మండల ఉపాధ్యక్షుడు, జనగాం జిల్లా మల్యాల ఎంపీపీ విమల, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ ఎంపీపీ సువర్ణ, డిచ్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్, నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలానికి చెందిన సుజాత, ప్రభాకర్ తదితరులు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ఆర్డీవోల నుంచి తమకు అవిశ్వాస నోటీసులు అందాయని, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 263 ప్రకారం ఆ నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీవోకు లేదని పేర్కొన్నారు. ఈ నోటీసులను కొట్టివేయాలని కోరారు. విచారణ చేపట్టిన జస్టిస్ కే శరత్ ధర్మాసనం నోటీసులు జారీ చేసే అధికారం ఆర్డీవోలకు ఉందని తెలిపింది. సాంకేతిక కారణాలు చూపించి అవిశ్వాసాన్ని తప్పించుకోలేరని పేర్కొంది.

గుదిబండగా కరెంటు ఒప్పందాలు

ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తును వాడకున్నా.. రూ.వందల కోట్లలో బిల్లుల బకాయిలు.. న్యాయ విచారణకు సర్కారు నిర్ణయం

- జస్టిస్ నర్సింహారెడ్డితో కమిషన్
- యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్లపైనా విచారణ



హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గుదిబండగా మారిన ఛత్తీస్‌గఢ్ కరెంటు ఒప్పందాల దుమ్మును దులపాలని రేవంత్‌రెడ్డి సర్కారు నిర్ణయించింది. ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటును కొనుగోలు చేయకున్నా.. ప్రస్తుతం ఒక్కయూనిట్ సరఫరా లేకున్నా.. వేల కోట్లలో బిల్లులు కట్టాల్సి రావడంపై న్యాయ విచారణకు ఆదేశించింది. ఇందుకోసం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డితో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అంతేకాదు.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్లపైనా ఈ కమిషన్ విచారణ జరుపుతుంది.

ఇదీ ఛత్తీస్‌గఢ్ కరెంటు కథ?

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక.. విద్యుత్తు అవసరాలను తీర్చాలనే ఉద్దేశంతో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం 2015 సెప్టెంబరు 22న ఛత్తీస్‌గఢ్‌లోని 1,000 మెగావాట్ల మార్వా ప్లాంట్ నుంచి 12 ఏళ్ల పాటు విద్యుత్తు కొనుగోలుకు ఒప్పందాలను కుదుర్చుకుంది. ఈ మేరకు పీపీఏ కింద తెలంగాణ డిస్కమ్‌లు, సీఎస్‌పీడీసీఎల్(ఛత్తీస్‌గఢ్) ఒప్పందాలపై సంతకాలు చేశాయి. అప్పట్లోనే విద్యుత్తు ఉద్యోగుల జేఏసీ అభ్యంతరాలు వ్యక్తం చేసినా.. ప్రభుత్వం కౌంటర్ సమర్థనలను చేయిస్తూ.. ముందుకెళ్లింది. ఇక ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటు సరఫరాకు వీలుగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్(పీజీసీఐఎల్)తోనూ ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్ కరెంటును కొనుగోలు చేయకపోవడంతో.. పెనాల్టీ కింద రూ.300 కోట్లను పీజీసీఐఎల్‌కు చెల్లించాలని కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి(సీఈఆర్‌సీ) ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు.. బకాయిల పేరుతో మార్వా ప్లాంట్ నుంచి విద్యుత్తు సరఫరా జరగకున్నా.. పాయింట్ ఆఫ్ కనెక్షన్ చార్జీలు(పీవోసీ) రూపంలో ఏటా రూ.400 కోట్ల నుంచి రూ.450 కోట్లను చెల్లించాల్సి వస్తోంది. స్థిర చార్జీల భారం కూడా తెలంగాణ డిస్కమ్‌లను వీడడం లేదు. 2020-21లో రూ.828.13 కోట్లు, 2021-22లో రూ.394.98 కోట్ల మేర స్థిరచార్జీలను చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం కాస్తా లేట్‌పేమెంట్‌తో కలుపుకొని రూ.3,576.89 కోట్లకు పెరిగినట్లు ఛత్తీస్‌గఢ్ చెబుతుండగా.. అది కేవలం రూ.2,100 కోట్లేనని తెలంగాణ డిస్కమ్‌లు వాదిస్తున్నాయి. కరెంటు బిల్లుల బకాయిలున్నాయంటూ రెండేళ్ల క్రితమే ఛత్తీస్‌గఢ్ కరెంటు సరఫరా నిలిచిపోయింది. నిజానికి తెలంగాణ డిస్కమ్‌లు 2021-22లో 1,631 మిలియన్ యూనిట్లు(కేవలం 19%) కొనుగోలు చేశాయి. 2022-23 ద్వితీయార్థంలో 2,713 మిలియన్ యూనిట్ల(31%) విద్యుత్తును కొనాలని అంచనాలు వేసినా.. ఆ పరిస్థితి లేదని తేలిపోయింది. 2023-24లో 78% విద్యుత్తు కొంటామనే అంచనాలున్నాయి. ఛత్తీస్‌గఢ్ డిస్కమ్‌లు బకాయిల పేరుతో ఆ మేరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేశాయి. రెండేళ్లుగా కరెంటు సరఫరా లేకున్నా.. 12 ఏళ్ల పాటు విద్యుత్తు కొనుగోలు ఒప్పందం బూచీగా ఇప్పుడు తెలంగాణ డిస్కమ్‌లపై భారం పడే ప్రమాదం ఉంది. ఒప్పందంలో ఇంకా ఆరేళ్లు మిగిలే ఉన్నాయి. పీపీఏ ఒప్పందం ప్రకారం విద్యుత్తును కొనకుంటే.. ఛత్తీస్‌గఢ్ డిస్కమ్‌లు ఆ కరెంటును ఓపెన్‌యాక్సెస్‌లో విక్రయించుకోవచ్చు. ఒకవేళ తెలంగాణ ఒప్పందం కంటే.. ఓపెన్‌యాక్సెస్ విక్రయం తక్కువ ధరలో ఉంటే.. ఆ భర్తీని తెలంగాణ డిస్కమ్‌లు పూడ్చాల్సి ఉంటుంది. ఇప్పుడు ఈ బకాయిలన్నీ తెలంగాణ డిస్కమ్‌ల పాలిట గుదిబండగా మారాయి. దీనిపై తెలంగాణ డిస్కమ్‌లు 2018లో విద్యుత్తు అప్పిలేట్ ట్రైబ్యునల్(అప్టెల్)ను ఆశ్రయించినా.. ఆ కేసు తేలేదాకా ఇబ్బందులు తప్పేలా లేవు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన ఈ తొందరపాటు ఒప్పందాలపై ఇప్పుడు రేవంత్ సర్కారు విచారణ జరిపించనుంది. మరోవైపు.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్లను వినియోగించుకోవాలా? వదిలేయాలా? అంటూ ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. భద్రాద్రిలో ఒక్కో ప్లాంట్ 270 మెగావాట్ల సామర్థ్యంతో.. మొత్తం నాలుగు ప్లాంట్లు 1,080 మెగావాట్లను ఉత్పత్తి చేస్తాయి. ఈ ప్లాంట్‌పై అప్పట్లోనే తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. సూపర్ క్రిటికల్ టెక్నాలజీ అందుబాటులో ఉన్నా.. సబ్-క్రిటికల్ టెక్నాలజీతో ప్లాంట్ కట్టడంపై నిపుణులు విమర్శలు చేశారు. 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో యాదాద్రి ప్లాంట్ ఇంకా నిర్మాణంలోనే ఉంది. ఇక్కడ కూడా భూసేకరణ, టౌన్‌షిప్‌ల నిర్మాణం, సబ్-కాంట్రాక్టుల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈ అంశాలపైనా జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ విచారణ జరపనుంది.

ఫలించిన 15 ఏళ్ల నిరీక్షణ

- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల డీఎస్సీ 2008 అభ్యర్థుల హర్షం
- కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరిగిందని ఆనందం

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2008లో అర్హత పొంది, నియామకాలు పొందని అభ్యర్థులకు కనీస వేతనాల పద్ధతిలో ఉద్యోగాలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తాము 15 ఏళ్లుగా పడుతున్న కష్టాల నుంచి ప్రభుత్వ ప్రకటనతో ఉపశమనం కలిగిందన్నారు. మంగళవారం సచివాలయంలోని మీడియా పాయింట్ వద్ద అభ్యర్థులు, అసోసియేషన్ ప్రతినిధులు సంబరాలు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... దశాబ్దంనర కాలంగా ఎదురుచూపులు నేడు ఫలించాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో తమకు న్యాయం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి, తమకు కాంట్రాక్ట్ పద్ధతిలో అయినా ఉద్యోగాలు ఇచ్చేందుకు ముందుకొచ్చినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తమకు సహకరించిన ప్రజాప్రతినిధులకు, విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంతో పాటు ఇతర అధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. త్వరగా విధివిధానాలు ప్రకటించాలని వారు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 'డీఎస్సీ 2008 అసోసియేషన్' అధ్యక్షుడు ఉమామహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మాకు ఉద్యోగాలు ఇవ్వండి

- డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ టీచర్ల మొర
- వేర్వేరు సమస్యలపై 'ప్రజావాణి'కి 1470 అర్జీలు



పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న బాలుడు గౌతమ్

సికింద్రాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తమకు తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలంటూ డీఎస్సీ 1998లో అర్హత సాధించిన ఉపాధ్యాయులు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నారు. 1998 డీఎస్సీలో నియామక ప్రక్రియ లోపభూయిష్టంగా జరిగిందని, ఎన్నికలు రావడంతో 1999లో డీఎస్సీ ప్యానల్‌ను రద్దు చేశారన్నారు. దాంతో డీఎస్సీ-98లో క్వాలిఫై అయిన అభ్యర్థులు ఉద్యోగావకాశాలు కోల్పోయారని తెలిపారు. ఈ మేరకు ప్రజాభవన్‌కు తరలివచ్చిన పలువురు అభ్యర్థులు ప్రజావాణిలో అర్జీ పెట్టుకున్నారు. ఇదే కాదు.. రేషన్ కార్డులు, పెన్షన్లు, ధరణి సమస్యలు, ఉద్యోగాలు, వైద్యంతోపాటు వేర్వేరు సమస్యలపై ప్రజావాణికి మంగళవారం 1,470 అర్జీలు వచ్చాయి. ఇందులో రెవెన్యూ పరమైన సమస్యలు 327, ఇంటి కోసం 251, పంచాయతీరాజ్ విభాగానికి 200, మైనార్టీ వెల్ఫేర్ సంబంధించి 145అర్జీలు ఉన్నాయి. ఆయా దరఖాస్తులను ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జీ.చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య, ఇతర అధికారులు ప్రజలను స్వీకరించారు. సంబంధిత విభాగాల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, పుట్టుకతో అంగవైకల్యంతో బాధపడుతున్న తనకు పెన్షన్ మంజూరు చేయాలని నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన దండు గౌతమ్ (13) దరఖాస్తు చేసుకున్నాడు. ఆరో తరగతి విద్యార్థి అయిన గౌతమ్ లేచి నిలబడాలన్నా, కూర్చోవాలన్నా ఇతరులపై ఆధారపడే స్థితిలో ఉన్నాడు. అలాగే రైలు ప్రమాదంలో తగిలినగాయాల వల్ల తన కాలు, చెయ్యి పని చెయ్యడం లేదని, ఆర్థిక సమస్యల్లో ఉన్న కుటుంబాన్ని పోషించుకునేందుకు తనకు ఉద్యోగం ఇప్పించాలని నాంపల్లి నేతాజీనగర్‌కు చెందిన జి.శశికాంత్ దరఖాస్తు చేసుకున్నారు. ఉప్పల్‌కు చెందిన పలువురు వృద్ధ మహిళలు తమకు పెన్షన్ మంజూరు చేయాలని, అంబర్‌పేటకు చెందిన పలువురు మహిళలు రేషన్ కార్డు కోరుతూ అర్జీలు పెట్టారు. కాగా, తమ ఉద్యోగాన్ని క్రమబద్ధీకరించాలని, వేతనాన్ని రూ.19,500కు పెంచాలని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పార్ట్ టైమ్ స్వీపర్లు అర్జీ చేసుకున్నారు. గత ప్రభుత్వం తీరు వల్ల 1500 మంది అభ్యర్థులు ఉద్యోగాలు లేక అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన జూనియర్ లైన్‌మెన్లు అభ్యర్థించారు. బేగంపేట్‌లోని ఈశ్వరీయ విశ్వ విద్యాలయ కేంద్రంలో నిర్వహించే ఆధ్యాత్మిక తరగతులకు తమ ను రానివ్వడం లేదంటూ పలువురు మహిళలు ఫిర్యాదు చేశారు.



అంటువ్యాధుల నివారణ కోసం నిర్మించబోయే ప్రయోగశాల భూమిపూజలో పాల్గొన్న వివిధ రంగాల ప్రముఖులు

అంటువ్యాధుల నివారణకు ప్రయోగశాల

- 25 కోట్లతో ఐఐపీహెచ్ ఆవరణలో ఏర్పాటు
- హిమాయత్‌సాగర్‌లో భూమిపూజ
- భవిష్యత్‌లో పలు పరిశోధనలు

రాజేంద్రనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అంటువ్యాధుల నుంచి ప్రజలను కాపాడేందుకు హిమాయత్‌సాగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఐఐపీహెచ్) ఆవరణలో రూ.25 కోట్లతో ప్రయోగశాల(సైరస్ పూనావాలా సెంటర్ ఫర్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ అండ్ పాండమిక్ ప్రిపేర్డ్‌నెస్) నిర్మించనున్నట్లు ఐఐపీహెచ్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ మధుబాల రెంటల తెలిపారు. ఈ సెంటర్‌కు భూమిపూజను విల్లో పూనావాలా ఫౌండేషన్ సీఈవో జస్వీందర్ నారంగ్, ఇంటర్నేషనల్ పబ్లిక్ హెల్త్ సొసైటీ ఛైర్మన్ సి. శ్రీనివాస రాజు, ఐఐపీహెచ్ చీఫ్ మెంటార్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సంజయ్ జొడెపె, యూఎస్‌ఏకు చెందిన డాక్టర్ అనిల్ కౌల్‌తో కలిసి మంగళవారం నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ సెంటర్ అంటువ్యాధులను ఎదుర్కోవడానికి అంకితమైన మార్గదర్శక కేంద్రంగా పనిచేస్తుందన్నారు. దేశంలో, రాష్ట్రంలో అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలను సూచించడంలో ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్ వారు క్యాన్సర్ స్క్రీనింగ్ ఎక్స్‌ప్రెస్ పేరుతో సుమారు రూ.10 కోట్ల విలువ చేసే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే బస్సును ఐఐపీహెచ్‌కు బహూకరించారు. ఈ బస్సులో ఇక మీదట గ్రామాల్లో తిరుగుతూ మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

మూడు బోర్లు వేసి అప్పుల పాలై రైతు ఆత్మహత్య

- మెదక్ జిల్లాలో కిష్టాపూర్‌లో ఘటన
- విద్యుదాఘాతంతో మహిళా రైతు, ఎలక్ట్రీషియన్ మృతి

చేగుంట, అడ్డగూడూరు, కోదాడ రూరల్, మార్చి 12: చేతికొచ్చే సమయంలో పంట ఎండిపోకూడదని మూడు బోర్లు వేయించినా చుక్క నీరు రాకపోగా.. అప్పుల పాలవ్వడంతో కలత చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా చేగుంట మండల పరిధి కిష్టాపూర్‌కు చెందిన కుర్మ స్వామి(30) అనే రైతు తన పొలంలోని చెట్టుకు మంగళవారం ఉరి వేసుకుని మరణించాడు. కుర్మ స్వామి తనకున్న నాలుగు ఎకరాలలో వరిసాగు చేస్తున్నారు. పంటను కాపాడుకునేందుకు మూడు బోర్లు వేశారు. బోర్లు వేసేందుకు, పంట సాగుకు సుమారు నాలుగు లక్షల అప్పు చేశారు. నీళ్లు రాక పొలం ఎండిపోగా, అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుర్మ స్వామికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, పొలంలో కింద పడి ఉన్న 11కేవీ త్రీఫేజ్ మెయిన్ వైరును తొక్కి, విద్యుదాఘాతానికి గురై యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం జానకీపురం గ్రామానికి చెందిన బోనాల లక్ష్మి(40) అనే మహిళా రైతు ప్రాణాలు కోల్పోయారు. లక్ష్మి రోజు మాదిరిగా మంగళవారం సాయంత్రం పొలంకు వెళ్తున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. ఇక, సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన షేక్ జానీమియా(35) అనే ఎలక్ట్రీషియన్ తన ఇంట్లో తెగిన విద్యుత్ తీగకు మర్మమతుల చేస్తూ విద్యుదాఘాతానికి గురై మరణించాడు.

రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో 4,356 అధ్యాపక పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకం
- నోటిఫికేషన్ జారీ.. 16న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు
- నాణ్యమైన విద్యే లక్ష్యం: మంత్రి దామోదర

పోస్టులు	ఖాళీల సంఖ్య	వేతనం (రూ.లలో)
ప్రొఫెసర్	498	1,90,000
అసోసియేట్ ప్రొఫెసర్	786	1,50,000
అసిస్టెంట్ ప్రొఫెసర్	1459	1,25,000
సీనియర్ రెసిడెంట్స్	1201	92,575
ట్యూటర్స్	412	55,000

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 26 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అధ్యాపకుల కొరత తీర్చేందుకు రేవంత్ రెడ్డి సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. 2021 అక్టోబరు నుంచి ఖాళీగా ఉన్న 4,356 టీచింగ్ పోస్టులను కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ప్రతిపాదికన భర్తీ చేయాలన్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ జీవో ఎంఎస్ నం.98 విడుదల చేసింది. ఇందులో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్, సీనియర్ రెసిడెంట్ పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీతో ఏటా సర్కారుపై అదనంగా రూ.634 కోట్ల భారం పడుతుందని మంత్రి తెలిపారు. మెడికల్ కాలేజీల్లోని అధ్యాపకుల నియామకాలన్నీ జిల్లా కలెక్టర్ల నేతృత్వంలోని డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీల ద్వారా సత్వరమే చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో వైద్య కళాశాలల బలోపేతం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. జాతీయ వైద్య కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన విద్య అందించడానికి పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. కాగా, కాలేజీల వారీగా పోస్టుల వివరాలను ఆయా కాలేజీల వెబ్‌సైట్లలో పొందుపర్చారు. కాలేజీల వెబ్‌సైట్ల వివరాలు డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లో (htpps://dme.telangana.gov.in) ఉన్నాయి. అన్ని కాలేజీల్లో ఈ నెల 16న వాక్-ఇన్-ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అర్హతలున్న అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

లోక్‌సభ ఎన్నికలకు ఖర్గే దూరం!

- ఒక నియోజకవర్గానికే పరిమితం కాదలుచుకోలేదు: ఏఐసీసీ చీఫ్
- దేశవ్యాప్తంగా దృష్టి పెడతానని వెల్లడి
- గుల్బర్గా నుంచి అల్లుడిని దింపే చాన్స్

న్యూఢిల్లీ, మార్చి 12: ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మల్లికార్జున ఖర్గే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. ఈ ఎన్నికలు అత్యంత కీలకమని, పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. తాను కూడా పోటీ చేస్తే ఒక నియోజకవర్గంపైనే దృష్టి పెట్టి, అక్కడే పరిమితం కావాల్సి ఉంటుందని ఖర్గే అభిప్రాయపడ్డారు. అయితే, పార్టీ వర్గాలు మాత్రం ఆయన పోటీ చేయాలని కోరుకుంటున్నాయి. ఈ ఎన్నికలను వదులుకోకూడదని, పోటీలో ఉండే పార్టీని ముందుండి నడిపించాలని వారు చెబుతున్నారు. కానీ, వీరి వాదనను ఖర్గే తోసిపుచ్చుతున్నారు. "రానున్న ఎన్నికలు అత్యంత కీలకం. పార్టీ చీఫ్‌గా ఒకే నియోజకవర్గానికి పరిమితం కాలేను. దేశవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలపైనా దృష్టిపెట్టాల్సి ఉంది" అని ఖర్గే తెలిపారు. కర్ణాటకలోని గుల్బర్గా నియోజకవర్గం నుంచి ఖర్గేని రంగంలోకి దింపాలని గత వారం జరిగిన సమావేశంలో నేతలు ఏకగ్రీవంగా భావించారు. ఈ నేపథ్యంలో ఆయన పేరును జాబితాలోనూ చేర్చారు. అయితే, ఖర్గే పోటీకి దూరంగా ఉండి, ఈసారి తన అల్లుడు రాధాకృష్ణన్ దొడ్డమానిని బరిలో నిలపాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. గుల్బర్గా నియోజకవర్గం నుంచి వరుసగా రెండుసార్లు విజయం సాధించిన ఖర్గే 2019 ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. అప్పటి నుంచి ఆయన రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పెద్దల సభలో విపక్ష నాయకుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. మరో నాలుగేళ్లు ఆయన పదవీ కాలం ఉంది. ప్రస్తుతం ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే సిద్దరామయ్య మంత్రి వర్గంలో కేబినెట్ మంత్రిగా ఉన్నారు. తొలుత ప్రియాంక్‌ను పార్లమెంటు బరిలో నిలపాలని అనుకున్నా.. తర్వాత ఈ నిర్ణయాన్ని పార్టీ వెనక్కి తీసుకుంది. ఇదిలా వుంటే, ఖర్గే కనుక పోటీ చేయకపోతే, ఏఐసీసీ అధ్యక్షులుగా ఉండి ఎన్నికలకు దూరంగా ఉన్న వారిలో ఈయనే తొలి నాయకుడు అవుతారు.

నాటకాలతో సామాజిక చైతన్యం

వడ్డెపల్లి, మార్చి 12: నాటకాలు సామాజిక చైతన్యాన్ని కలిగిస్తాయని కో ఆపరేటీవ్ ట్రిబ్యునల్ గౌరవ చైర్మన్ వై.సత్యేంద్ర అన్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణు మాధవ్ కళాప్రాంగణంలో సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ - వరంగల్, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర, రంగస్థల అభివృద్ధి సంస్థల సౌజన్యంతో నాలుగు రోజుల పాటు నయనానందకరంగా నిర్వహించిన ఆహ్వాన నాటక పోటీలు మంగళవారంతో ముగిశాయి. నాటకాలను ముఖ్య అతిథిగా హాజరైన సత్యేంద్ర జ్యోతి చేసి నాటకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యేంద్ర మాట్లాడుతూ సమాజానికి నాటకాలు దర్పణం వంటివని అన్నారు. కార్యక్రమంలో సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ప్రతినిధులు డాక్టర్ ఎస్‌వీఎస్ చారి, కుందావర్జుల కృష్ణ మూర్తి, బన్న సుధాకర్, రామోజు గిరిబాబు, జూలూరి నాగరాజు, గిరిజా మనోహర్‌బాబు, మల్యాల మనోహర్, వనం లక్ష్మి కాంత రావు, కళా రాజేశ్వర్‌రావు, ఆకుల సదానందం, రాధా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రదర్శించిన రైతే రాజు, హక్కు నాటకాలు ఆహూతులను అలరించాయి.

ఎంపీ వ్యాఖ్యలపై నిరసన

కాజీపేట, మార్చి 12: భారత రాజ్యాంగాన్ని మార్చేస్తామన్న బీజేపీ ఎంపీ అనంత హెగ్డే చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం కాజీపేట చౌరస్తాలో తేజోమయి మాల కుల సంక్షేమ సంఘం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మర్యాల కృష్ణ, కార్యదర్శి బండి విజయ్ మాట్లాడుతూ.. రాజ్యాంగంపై, లౌకిక వాదంపై అవగాహన లేకుండా మాట్లాడిన ఎంపీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పప్పుల గోవర్ధన్, కోండ్ర నర్సింగరావు, తండమల్ల వేణు, మైలారం శంకర్, కాశేశ్వరపు వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

కేయూలో నిరుద్యోగ యువత ఆందోళన

కేయూ క్యాంపస్, మార్చి 12: రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యాలయాల్లో డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ పోస్టులను క్రమపద్ధతిలో భర్తీ చేయకపోవడంతో బ్లాక్‌లాగ్ పోస్టులు మిగిలిపోయి మెరిట్ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జి, స్కాలర్ కల్లెపల్లి ప్రశాంత్ అన్నారు. మంగళవారం కేయూ లైబ్రరీ ఎదుట నిరుద్యోగ యువత గురుకులాల్లో బ్లాక్‌లాగ్ పోస్టుల్లేకుండా చూడాలని, డీఎస్సీ పోస్టుల పెంచాలని, జీవో నెంబరు 46ను రద్దు చేయాలని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కల్లెపల్లి ప్రశాంత్ మాట్లాడారు. గురుకుల పోస్టులను అవరోహన క్రమంలో భర్తీచేస్తే బ్లాక్ లాగ్‌పోస్టుల్లేకుండా అందరికీ న్యాయం జరుగుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 6వేల పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిందని, దాన్ని 25 వేల పోస్టులకు పెంచాలని అన్నారు. జీవో 46తో కానిస్టేబుల్ అభ్యర్థులకు నష్టం జరిగిందన్నారు. గ్రూప్ 2, 3 పోస్టులను పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు శివకుమార్, స్కాలర్స్ గాజుల వెంకన్న, రాజేందర్, శివ, నవీన్, రమేశ్, విష్ణు, రాజేశ్, రమేశ్, సందీప్ పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం

ఐనవోలు, మార్చి 12: పున్నేలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాల బోధించి ప్రశంసలు అందుకున్నారు. ఎంఈఓగా కోట కావ్య, హెచ్‌ఎంగా నల్ల స్వప్నికతోపాట 23 మంది విద్యార్థులు విధులు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా హెచ్‌ఎం రాయరాకుల పరమేశ్వర్ మాట్లాడుతూ.. స్వయం పాలనతో విద్యార్థుల్లో నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వసంత, యాకయ్య, కొమురయ్య, ఇందిరా, స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, సుభద్ర, విమల పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు కాంగ్రెస్‌కే సాధ్యం

▶▶ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు



కాంగ్రెస్‌లో చేరిన వారికి పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు

వడ్డెపల్లి, మార్చి 12: సంక్షేమ పథకాలు కాంగ్రెస్‌కే సాధ్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. హనుమకొండ సుబేదారిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన జిల్లా నాయకులు, సింగిల్ విండో మాజీ చైర్మన్ బేతి సమ్మిరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు బొమ్మగాని శ్యామ్‌గౌడ్, బేతి చొక్కారెడ్డితో పాటు 50 మంది బీఆర్ఎస్ శ్రేణులు ఎమ్మెల్యే నాగరాజు సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ తీర్థాన్ని పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువా కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బుచ్చిరెడ్డి, జున్ను ఐలయ్య, మహ్మద్ మొహినొద్దీన్, దేవేందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ విగ్రహం ఏర్పాటుకు సహకరించాలి..

హనుమకొండలోని అంబేద్కర్ సర్కిల్‌లో ప్రజా యుద్ధ నౌక గద్దర్ విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని గద్దర్ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ నాయకులు వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును కోరారు. మంగళవారం సుబేదారిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కేఆర్. నాగరాజును మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో గద్దర్ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ అధ్యక్షుడు కోండ్ర నర్సింగరావు, జిల్లా నాయకులు బన్న ఐలయ్య, మన్నె బాబురావు, మండలోజు కృష్ణమూర్తి, గాజాల గోవర్ధన్, మేడ రంజిత్, అంకేశ్వరపు రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవాహానికి ఎదురీదిన 'రణధీర' సీతక్క



రణధీర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

హనుమకొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆధునిక చరిత్ర నిర్మాణం కోసం జరిగిన విప్లవ ప్రజాస్వామిక పోరాటాలలో భాగస్వామిగా ఉండే అరుదైన అవకాశం సీతక్కకు దక్కిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో సచివాలయంలో ప్రముఖ రచయిత, టీజీవో నాయకుడు అస్నాల శ్రీనివాస్ రచించిన సీతక్క జీవిత చరిత్ర రణధీర పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, మహిళాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), రచయిత అస్నాల శ్రీనివాస్, సీతక్క ఉద్యమ మిత్రులు సూరపనేని నాగేశ్వర్ రావు, తీగెల జీవన్ గౌడ్, సుధాకర్, పీసీసీ అధికార ప్రతినిధులు డాక్టర్ రియాజ్, ఆవెలి దామోదర్ రావు, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్, శ్యామ్, రామరావు, సామంతుల శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

కిట్స్‌లో మోడల్ యునైటెడ్ నేషన్స్ పోస్టర్ ఆవిష్కరణ

హసన్‌పర్తి, మార్చి 12: ఎర్రగట్టుగుట్ట వద్ద గల కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం మోడల్ యునైటెడ్ నేషన్స్-24 మన్ వర్షన్ 6.0 పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. స్టూడెంట్ ఆక్టివిటి సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమం ఈ నెల 22 నుంచి 24 వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు తమకు కేటాయించిన దేశాల ప్రతినిధుల పాత్రను పోషిస్తారన్నారు. ప్రపంచంలోని సమస్యలను పరిష్కరించే ప్రయత్నం ఈ కార్యక్రమంలో జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో రమేశ్‌రెడ్డి, సీఎస్ఈడీ హెడ్ పి.నిరంజన్‌రెడ్డి, డీన్లు వి.శంకర్, ఎం.నర్సింహారావు, సి.రమేశ్, పీఆర్వో దాసరోజు ప్రభాకరాచారి, విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు.

ముస్లింలపై రేవంత్ సర్కారుకు పట్టింపులేదు..

రాంనగర్, మార్చి 12: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కారుకు ముస్లింలపై పట్టింపు లేదని ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు నయీమొద్దీన్ ఆరోపించారు. మంగళవారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నయీమొద్దీన్ మాట్లాడారు. రంజాన్ మాసం ప్రారంభమైనప్పటికీ మసీద్, ఈద్గాల వద్ద కనీస సౌకర్యాలు కరువయ్యాయన్నారు. రంజాన్ పండుగకు ప్రత్యేక నిధులు కేటాయించలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో రంజాన్ మాసంలో ప్రత్యేక నిధులు కేటాయించి సౌకర్యాలు కల్పించామన్నారు. ప్రభుత్వం వెంటనే మసీదుల వద్ద క్లీనింగ్, లైటింగ్, నీటి వసతి కల్పించాలని ఆయన డిమాండ్ చేసారు. విలేకర్ల ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు అఫ్జల్, హాజీద్, పులి రజనీకాంత్, పులి సారంగపాణి, రవిందర్‌రావు, శ్రీధర్, ఉపేందర్, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో మహిళల సేవలు వెలకట్టలేనివి

నయీంనగర్, మార్చి 12: విద్యుత్ శాఖలో మహిళల సేవలు వెలకట్టలేనివని టీఎస్ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యుత్ శాఖలో ఆపరేషన్ విభాగంలో పనిచేస్తున్న మహిళల సేవలు అద్వితీయమని, మహిళలకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు. మహిళలు కుటుంబాన్ని, ఉద్యోగాన్ని చేస్తూ ద్విపాత్రాభినయం చేస్తున్నారని, భూదేవికి ఉన్న ఓర్పు మహిళలలో మాత్రమే ఉంటుందని ఆయన తెలిపారు. పోరాటాలు చేసిన వీరవనితలు ఝాన్సీ లక్ష్మీబాయి, రాణి రుద్రమదేవిలు పుట్టిన పురిటిగడ్డపై మహిళలు పుట్టారని, వారి పోరాటాల ప్రతిమ ప్రతీ ఒక్కరిలో ఉండాలన్నారు. ఉన్నత ఆలోచనలు ఆరోగ్యవంతమైన సమాజం మహిళ ద్వారానే సాధ్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, జీఎంలు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు గాంధీభవన్‌లో సమావేశం

హనుమకొండ సిటీ, మార్చి 12: లోక్‌సభ ఎన్నికలు, టికెట్ ఆశావహులు తదితర అంశాలపై బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సమీక్ష జరుగనుంది. ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు, ముఖ్య నేతలు సమావేశంలో పాల్గొననున్నారు. ఈ క్రమంలో జిల్లా మంత్రులు కొండా సురేఖ, సీతక్క, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు హాజరు కానున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షీతో పాటు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో భట్టి విక్రమార్క, మహేశ్‌కుమార్‌గౌడ్ తదితర దిగ్గజ నేతలు పాల్గొననున్నారు.

ఎస్సార్ యూనివర్సిటీలో ఎడ్యుకేషన్ ఫెయిర్

హసన్‌పర్తి, మార్చి 12: మండలంలోని అనంతసాగర్ వద్ద గల ఎస్సార్ యూనివర్సిటీలో మంగళవారం ఆస్ట్రేలియాకు చెందిన ఐడీపీ సంస్థ సహకారంతో ఇంటర్నేషనల్ హైయర్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ దీపక్‌గార్గ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఐడీపీ సంస్థ 50 యేళ్లుగా విద్యార్థులకు విదేశీ ఉన్నత విద్యకు తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. ఈ సంస్థ 50 దేశాల్లో 800లకు పైగా యూనివర్సిటీల్లోని విద్యార్థులకు సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సంస్థతో ఎస్సార్ యూనివర్సిటీ భాగస్వామ్యాన్ని ఏర్పరుచుకోవడం అభినందనీయమన్నారు. ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్ విద్యార్థుల భవిష్యత్ రూపకల్పనకు తోడ్పడుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు బీఎస్, ఎంఎస్, పీహెచ్‌డీ, పోస్ట్ డీవోసీ కోర్సులను వివరించి, విద్యావకాశాలను తెలియజేశారు. అకాడమిక్ విధానాలు, విభిన్న కోర్సుల ప్రాధాన్యత, స్టూడెంట్స్ వీసా విధి విధానాలు, లోన్స్, ఇన్సూరెన్స్‌ల గురించి ఐడీపీ సంస్థ ప్రతినిధులు వివరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ ప్రీతా చక్రవర్తి, డీన్లు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న వీసీ దీపక్‌గార్గ్

తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం

కాళోజీ జంక్షన్, మార్చి 12: తలసేమియా బాధిత పిల్లల కోసం మంగళవారం 59వ డివిజన్ కనకదుర్గా కాలనీలోని కమ్యూనిటీ హాలులో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. తలసేమియా బాధితుల కోసం రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. 90వ సారి రక్తదానం చేసిన జనార్ధన్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కనకదుర్గా కాలనీ కమిటీ సభ్యుడు నారాయణరెడ్డి, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ లావణ్య వైస్ ప్రెసిడెంట్ లలిత, క్లబ్ సభ్యులు స్రవంతి, లావణ్య, ఇందిరాకాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యుడు ధనరాజ్, రాఘవేంద్ర రెసిడెన్సీ సభ్యులు దిలీప్‌రెడ్డి, సురేశ్, రవితేజ, వివిధ కాలనీల వాసులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జూలైవాడ, మార్చి 12: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ రీజియన్ ప్రాంతీయ సమన్వయ అధికారి ఎస్.విద్యారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు www.tswreis.ac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో ఆమె సూచించారు. మరిన్ని వివరాలకు 0870- 2931190 సెల్ నెంబరులో సంప్రదించాలన్నారు.

ఎంజీఎం రిటైర్డ్ ఆర్ఎంవో డాక్టర్ రాజారెడ్డి మృతి

వరంగల్ మెడికల్, మార్చి 12: పేదల ఆస్పత్రిలో ఆర్ఎంవోగా గుర్తింపు పొందిన రిటైర్డ్ డాక్టర్ రాజారెడ్డి మంగళవారం మృతి చెందారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రితోపాటు హనుమకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించి అనేక సంచలనాలకు కేంద్ర బిందువు అయ్యారు. సేవాభావం, గొప్ప విలువలతో నిర్భయమైన విధులు నిర్వర్తించిన అధికారిగా పేరు ప్రఖ్యాతలు గడించారు. హనుమకొండ కిషన్‌పురాలోని శ్రీలక్ష్మీ నర్సింగ్ హోం వ్యవస్థాపక సభ్యుడిగా కూడా కొనసాగారు. ఆ రోజుల్లో అనస్తీషియా వైద్యుడిగా కూడా సేవలు అందించారు. బుధవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు రేడియాలజిస్టు డాక్టర్ పవన్‌రెడ్డి తెలిపారు. రాజారెడ్డి మృతి పట్ల పలువురు ఐఎంఏ వైద్యులు సంతాపం ప్రకటించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 12: జిల్లా విద్యాశిక్షణ సంస్థలో 2003-05 విద్యా సంవత్సరంలో డీఎడ్ శిక్షణ పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆనాడు పాఠాలు బోధించిన అధ్యాపకులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. అనంతరం హనుమకొండ, నిర్మల్ జిల్లాల విద్యాశాఖ అధికారులు డాక్టర్ ఎండి.అబ్దుల్ హై, రవీందర్‌రెడ్డిలు మాట్లాడుతూ.. విలువలతో కూడిన సమాజ నిర్మాణం జరగాలంటే అది ఉపాధ్యాయుల ద్వారానే సాధ్యపడుతుందని తెలిపారు. చిన్న చిన్న విషయాలకు నిరాశ, నిస్పృహలకు లోనుకాకుండా ముందుకెళ్లాలని సూచించారు. తమ శిష్యులు వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడటం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ ఎం.సోమయ్య, జయధీర్‌రెడ్డి, మల్లారెడ్డి, దేవనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణమూర్తి, రవికుమార్, సురేందర్, నీరజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట రైల్వేస్టేషన్‌లో హ్యాండ్లూమ్ స్టాల్ ప్రారంభం

కాజీపేట, మార్చి 12: దేశవ్యాప్తంగా పలు రైల్వే స్టేషన్‌లలో 1500 స్టాల్స్‌ను ప్రధాని మోదీ మంగళవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా కాజీపేట జంక్షన్‌లో 'వన్ స్టేషన్ - వన్ ప్రొడక్ట్'లో భాగంగా హ్యాండ్లూమ్ స్టాల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యేక స్క్రీన్‌ల ద్వారా రైల్వే అధికారులు తిలకించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీఈఈ ప్రశాంత్ కృష్ణసాయి, స్టేషన్ మేనేజర్ సత్యనారాయణ, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సజన్‌లాల్, రైల్వే డీఎస్పీ తాళ్లపల్లి కృపాకర్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎం.సంజీవరావు రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్‌తోపాటు రైల్వే అధికారులు పాల్గొన్నారు.

కుటుంబసభ్యులే హంతకులా?

పోశాలు మృతిపై అనుమానాలు... పోలీసుల అదుపులో నిందితులు

వరంగల్ క్రైం, మార్చి 12: అనుమానాస్పద స్థితిలో గజవెల్లి పోశాలు అనే వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. కుమార్‌పల్లికి చెందిన పోశాలు మృతి వెనుక అతడి బంధువుల హస్తం ఉన్నట్లు సమాచారం. సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి అయిన పోశాలు.. ఆస్తులు అమ్ముతున్నాడనే అక్కసుతో కుటుంబ సభ్యులు ఓ పథకం పన్నారు. పోశాలును బెదిరించమని 9మందికి సుపారీ ఇచ్చినట్లు తెలిసింది. స్థలం కొనుగోలు విషయమై మాట్లాడుదామని నమ్మించి సోమవారం కోమటిపల్లి మధుతండా వద్దకు తీసుకువెళ్లి తీవ్రంగా గాయపరిచినట్లు సమాచారం. విచ్చలవిడిగా కొట్టడంతో పోశాలు అక్కడికక్కడే మరణించడంతో సుపారీ తీసుకున్నవారు అక్కడి నుంచి తప్పించుకుని వెళ్లినట్లు తెలిసింది. ఈ విషయం పోలీసుల విచారణలో బహిర్గతం కాగా, 9మందిని మంగళవారం అరెస్టు చేసి విచారిస్తున్నట్లు సమాచారం. వీరిలో ఏడుగురు మైనర్లు ఉన్నట్లు తెలిసింది. పోశాలు మృతి వెనుక కుటుంబ సభ్యుల ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం కావడంతో రహస్యంగా విచారణ చేస్తున్నట్లు సమాచారం. పోలీసులు బుధవారం వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

పోషణ పక్వాడ గోడపత్రికల ఆవిష్కరణ

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 12: హనుమకొండలోని జిల్లా కలెక్టరేట్‌లో పోషణ పక్వాడ గోడ పత్రికలను మంగళవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్త ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధికా గుప్త మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరికి విద్య యొక్క ప్రాముఖ్యత, పోషకాహార ఆవశ్యకత గురించి అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ముఖ్యంగా హనుమకొండ అర్బన్ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె.మధురిమ, సూపరింటెండెంట్ లక్ష్మీకాంత్ రెడ్డి, ఎక్స్‌టెన్షన్ అధికారి వి.సిందూరాణి, పోషణ అభియాన్ జిల్లా కో-ఆర్డినేటర్ టి. సుమలత తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన ఇన్‌స్పెక్టర్లు

వరంగల్ క్రైం, మార్చి 12: కేయూ పోలీస్ స్టేషన్, హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించిన సంజీవ్, షుకూర్‌లు.. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూను మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో అంబర్ కిషోర్ ఝూను కలిశారు.

గంజాయి పట్టివేత.. ముగ్గురి అరెస్టు

వరంగల్ క్రైం, మార్చి 12: హనుమకొండ పెట్రోల్ పంపు వద్ద సోమవారం 1,680 గ్రాముల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. హనుమకొండ ఎస్ఐ సతీష్ వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన జన్ను మనోహర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. కారును తనిఖీ చేయగా లభించింది. గంజాయిని స్వాధీనం చేసుకుని విచారించగా తనతో పాటు మరో నలుగురు వ్యక్తులు గంజాయి సేవిస్తున్నట్లు తెలిపారు. మనోహర్ గంజాయి విక్రయించడంతో పాటు సేవించనున్నట్లు పోలీసులకు తెలిపాడు. మనోహర్ ఇచ్చిన సమాచారంతో అతడితో పాటు చిన్నల సాయిచరణ్, కత్తుల శివశంకర్‌లను అదుపులోకి తీసుకున్నారు. మిగతా ఇద్దరు కశ్యప్, పవన్‌లు పరారీలో ఉన్నారు. గంజాయి పట్టుకుని, ముగ్గురిని అరెస్టు చేసిన విషయాన్ని హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, హనుమకొండ సీఐ వై.సతీష్, ఎస్ఐ కె.సతీష్‌తో కలిసి మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మిగతా ఇద్దరిని త్వర లోనే పట్టుకుంటామని ఆయన తెలిపారు.

చేతల్లో చూపిస్తాం..

5వ పేజీ తరువాయి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరగా.. రెండు మూడు రోజుల్లో భద్రకాళిగుడిని సందర్శించి, పరిశీలించిన తర్వాత నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటానని పొంగులేటి హామీ ఇచ్చారు.

రెండు నెలల్లో కాళోజీ కళాక్షేత్రం పనులు పూర్తికి ఆదేశం

హనుమకొండ హయగ్రీవాచారి గ్రౌండ్‌లో కాళోజీ కళాక్షేత్రం నిర్మాణంలో తీవ్ర జాప్యం జరగడంపై మంత్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ నిర్వాకంవల్ల పదేళ్ల నుంచి పనులు సాగుతూనే ఉన్నాయని, కళాక్షేత్రం అంచనా వ్యయం అడ్డగోలుగా పెంచుతూ పోవడాన్ని వారు తీవ్రంగా ఆక్షేపించారు. గత ప్రభుత్వం హయాంలో రూ.19కోట్లు మాత్రమే వచ్చాయని, అడ్డగోలుగా అంచనా వ్యయం పెంచుతూ పోతుండడంతో పనులు నత్తనడకగా సాగుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరపాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు.

ఎట్టిపరిస్థితుల్లో కాళోజీ కళాక్షేత్రం పూర్తిచేయాలని కుడా అధికారులను ఆదేశించారు. పెండింగ్ బిల్లులను చెల్లించేలా చూస్తానని నాయిని రాజేందర్‌రెడ్డి హామీ ఇస్తూ రెండునెలల్లో కళాక్షేత్రం పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

స్మార్ట్‌కు మార్జిన్ నిధులు

స్మార్ట్‌సిటీ నిధుల వినియోగంపై సమావేశంలో లోతుగా సమీక్ష జరిగింది. స్మార్ట్ నిధులతో చేపట్టిన చాలా పనులు నత్తనడకగా, ముఖ్యంగా నాసిరకంగా జరుగుతుండడం పట్ల మంత్రులు, ఎమ్మెల్యే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో నిధులు ఖర్చు చేయకపోతే నిధులు వృథాఅయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తన వంతుగా ఇవ్వాల్సిన నిధులను విడుదల చేయకపోవడంవల్ల రావలసిన మిగతా స్మార్ట్ నిధులు ఆగిపోయాయని ఎమ్మెల్యే నాయిని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం తనవాటాగా రూ.60కోట్ల మార్జిన్ నిధులను విడుదల చేస్తే రూ.107 కోట్ల వరకు వస్తాయని తెలిపారు. ఇందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువచ్చి రూ.60కోట్లు విడుదలయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

డీసీసీబీ నిర్వహణ, లక్ష్యాలపై సమావేశం

హనుమకొండ సిటీ, మార్చి 12: వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నిర్వహణ, లక్ష్యాలు, మార్గదర్శకాలు తదితర అంశాలపై హనుమకొండలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో అవగాహన సమావేశం జరిగింది. మంగళవారం జరిగిన సమావేశానికి బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అధ్యక్షత వహించారు. కో-ఆపరేటివ్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ అధ్యాపకులు విజయశంకర్, విజయ్ కుమార్‌రెడ్డి పాలకవర్గం, బ్యాంకు సిబ్బందికి అవగాహన కల్పించారు. సహకారం, ముఖ్య ఉద్దేశం, సూత్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, తెలంగాణ రాష్ట్ర సహకార సంఘ చట్టం తదితర అంశాలపై సొసైటీ సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో బ్యాంక్ సీఈవో ఎం.డి. వజీర్ సుల్తాన్, డీజీఎం రోహిణి, సెక్షన్ మేనేజర్ నిహారిక తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సమావేశంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 12: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ(ఎస్‌జీటీ) పోటీ పరీక్షకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 జిల్లాల స్టడీసర్కిళ్లలో ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ తీసుకునే అభ్యర్థులు ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 0870-2571192, 040-24071178 నెంబర్లలో సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు.

విజయసంకల్ప సమ్మేళన సభకు తరలిన శ్రేణులు

మడికొండ, మార్చి 12: హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో మంగళవారం జరిగిన భారతీయ జనతా పార్టీ విజయ సంకల్ప సమ్మేళన సభకు మడికొండ, కడిపికొండ గ్రామాల నుంచి పార్టీ శ్రేణుల భారీగా తరలి వెళ్లారు. బస్సులకు మడికొండలో పార్టీ జిల్లా నాయకులు పొనగోటి వెంకట్రావు, నాయిని కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, 45వ డివిజన్ అధ్యక్షులు చెన్నబోయిన శివ, బీజేవైఎం జిల్లా నాయకులు నిఖిల్‌రావు, మడికొండ పోలింగ్ బూత్ అధ్యక్షులు భైరపాక వెంకటేష్, ధరావత్ సునీల్, మాచర్ల రంజిత్, గడ్డం కిరణ్, పల్లకొండ రాజేందర్, చట్ల అజయ్, రాజ్‌కుమార్, దుప్పెల్లి అరవింద్, దార ధనుంజయ్, ప్రభాకర్, నాగరాజు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ

• కాళోజీ జంక్షన్: హైదరాబాద్‌లోని ఎల్‌బీ గ్రౌండ్స్‌లో జరుగుతున్న బీజేపీ బూత్ సంకల్ప్ సమ్మేళనానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి బీజేపీ శ్రేణులు అధిక సంఖ్యలో మంగళవారం తరలివెళ్లారు. హైదరాబాద్ వెళ్లే బస్సులను హంటర్‌రోడ్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొలను సంతోష్‌రెడ్డి, గాదె రాంబాబు, ఆకుల శ్రీకాంత్, అరణ్యరెడ్డి, కడవేరు శ్రీనివాస్, గందసిరి శ్రీకాంత్, రఘు, హరీష్, రోకుల సతీష్, కురిమండ్ల సది, సంపత్‌రెడ్డి, ఆకాశ్‌సింగ్, నిఖిల్‌చోప్రా తదితరులు పాల్గొన్నారు.





ముంబయిలోని జియో వరల్డ్ కన్వెన్షన్‌లో నిర్వహించిన 71వ ప్రపంచ సుందరి పోటీల వేడుకకు హాజరై, హ్యుమానిటేరియన్ అవార్డు అందుకున్న రిలయన్స్ ఫౌండేషన్ అండ్ ఛైర్‌పర్సన్ నీతా అంబానీ ధరించిన చేతి వంకీ వెల అక్షరాలా 200 కోట్లు. పురుషులు తలపాగాకు అలంకరించుకునే సర్‌పేంచ్ ఆభరణాన్ని నీతా అంబానీ బాజూబంద్‌గా మలుచుకుని ధరించడం మరో విశేషం. ఆ బాజూబంద్ వెనకున్న కథతో పాటు వంకీల జ్యువెలరీ ఫ్యాషన్ గురించి తెలుసుకుందాం!

భలే బాజూబంద్

ఫ్యాషన్



మొఘల్ ధగధగలు

నీతా అంబానీ ధరించిన బాజూబంద్ మొఘల్ సామ్రాజ్యానికి చెందినది. 1592 నుంచి 1666 వరకూ పరిపాలించిన ఐదవ మొఘల్ చక్రవర్తి, జహంగీర్ పుత్రుడు, షాజహాన్‌గా పేరు పొందిన మీర్జా షాహబ్ ఉద్దీన్ మొహమ్మద్ ఖుర్రమ్ ఆ నగను తన తలపాగాకు సర్‌పేంచ్(కల్గీ)గా అలంకరించుకునేవాడు. 'షాజహాన్ ఇబ్న్ జహంగీర్ షా/1049 అని ఉర్దూలో చెక్కిన అక్షరాలు ఆ నగకు వేలాడే రెండు ఎరుపు రంగు స్పైనల్ జాతిరాళ్ల మీద కనిపిస్తాయి. 2019లో నిర్వహించిన ఒక వేలంపాటలో చివరిసారిగా ఆ సర్‌పేంచ్ కనిపించింది. వజ్రాలు, కెంపులు, స్పైనల్ జాతి రాళ్లు కలిగి ఉన్న ఈ నగను పచ్చికాకామ్ టెక్నిక్‌ను ఉపయోగించి తయారుచేశారు. సర్‌పేంచ్‌ను చేతి వంకీగా మలుచుకునే ఈ ఆధునిక ఆభరణాలంకరణ స్టైల్ తాజా ట్రెండ్‌గా మారింది. అలాంటి కొన్ని ఆకర్షణీయమైన వంకీలెన్నో ఇప్పుడు మార్కెట్లో దొరుకుతున్నాయి.



జ్యువెలరీ ట్రెండ్‌గా...

పెళ్లి నగల్లో చేతి వంకీలు తప్పనిసరిగా ఉండాల్సిందే! కానీ ఇప్పుడు వంకీలు ఫ్యాషన్ జ్యువెలరీగా మారిపోయాయి. రెండు చేతులకు బదులుగా కుడి చేతికి మాత్రమే వంకీ ధరించే ట్రెండ్ తాజాగా కొనసాగుతోంది. అచ్చంగా బంగారంతో తయారైనవీ, లేదంటే వజ్రాలు, కెంపులు, ముత్యాలు పొదిగిన వంకీలను అమ్మాయిలు ఇష్టంగా ధరిస్తున్నారు. డోరీతో కట్టుకునే వీలుండే వంకీలతో పాటు, కొక్కేలు కలిగి ఉన్న చేతి వంకీలు మార్కెట్లో దొరుకుతున్నాయి. అయితే ధరించేది ఎలాంటి వంకీ అయినా రెట్టింపు ఆకర్షణీయంగా కనిపించాలంటే వంకీని హైలైట్ చేసే దుస్తులు ఎంచుకోవాలి. అందుకోసం స్లీవ్‌లెస్ బ్లౌజ్‌లు, లాంగ్ గౌన్స్ ఎంచుకోవచ్చు.









మన సమాజంలో మహిళల హక్కుల కోసం పోరాడుతున్న కార్యకర్తలు అనేక మంది. రకరకాల సిద్ధాంతాల ప్రాతిపదికన పనిచేస్తున్నా వారందరి లక్ష్యం మహిళల అభ్యున్నతే! అలాంటి వారిలో ఒకరు **సాయని విజయభారతి**. ఆమె ఇటీవలే జాతీయ మానవహక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సభ్యురాలిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తన పోరాటాలను, మహిళా న్యాయవాదిగా తన అనుభవాలను 'నవ్య'తో పంచుకున్నారు.

భావజాలం కాదు... బాధలపై స్పందించడం ప్రధానం

"40 ఏళ్లుగా సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నా. ఈ ప్రస్థానంలో నాకు ఎదురయిన అనుభవాలెన్నో! ఉదాహరణకు ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు, ఆసుపత్రుల్లో ఇబ్బందులు ఎదురయినప్పుడు- నిజ నిర్ధారణకు వెళ్లేవాళ్లం. మమ్మల్ని గేటు దాటి లోపలికి వెళ్లనిచ్చేవారు కాదు. బాధితులను కలవాలని ఎంత ప్రయత్నించినా కుదిరేది కాదు. అదే ఇప్పుడు... జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యురాలుగా అన్యాయానికి ఆస్కారమున్న ప్రతిచోటును సందర్శిస్తున్నాను. కొద్ది రోజుల కిందట నింబోలి అడ్డాలోని జువెనైల్ హోమ్‌కు వెళ్లడమే కాదు, లోపలి పరిస్థితిని కళ్లారా చూశాను. చట్టంతో విభేదించిన పిల్లలతో కొంత సమయం గడిపాను. అలాగే నల్గొండ జిల్లాలోని కస్తూర్బా బాలికల వసతి గృహాన్ని సందర్శించాను. అక్కడ అమ్మాయిల పరిస్థితి చూసి నాకు కన్నీళ్లు ఆగలేదు. దాదాపు 200మందికి పైగా విద్యార్థినులకు కేవలం ఆరు మరుగుదొడ్లు. వాళ్ల గదుల్లో పాములు, ఎలుకలు తిరుగాడుతున్నాయి. మరొక ఎస్టీ హాస్టల్‌లో గదులన్నీ బూజుపట్టి భయానకస్థితిని తలపిస్తున్నాయి. మలమూత్ర వ్యర్థాలతో బ్లాక్ అయిన లెట్రిన్లు, పెచ్చులూడిన గోడలతో బాత్రూమ్‌లు... వీటన్నిటిని గమనించాక 'ప్రభుత్వ వసతిగృహాల్లో ఉండే వారిని సాటి మనుషులుగా చూస్తున్నామా?' అనిపించింది. అదే వసతి గృహంలో రోజుకు 800మంది పిల్లల కోసం 180కేజీల బియ్యం వండుతున్నట్టు లెక్కల్లో చూపిస్తున్నారు, పిల్లాడికి పిడికెడు బువ్వకు మించి వడ్డించడంలేదు. కోడిగుడ్లు రిజిస్టర్‌లో ఉంటాయి కానీ చిన్నారుల కంచాలలో కనిపించవు. 'ఇంత అన్యాయాన్ని చూడకుండా ఇన్నాళ్లు కళ్లుమూసుకొన్నానా?' అనిపించింది. నా పరిశీలనలో గమనించిన విషయాలన్నిటితో నివేదిక తయారుచేసి, దాన్ని మా ఛైర్‌పర్సన్‌కు ఇచ్చాను. ఇలా సమాజానికి నా వంతుగా సేవ చేసే సదావకాశం ఈ పదవి ద్వారా లభించిందని సంతోషిస్తున్నాను. నాకు ఇదొక బాధ్యత అంతే! అంతకుమించి దీన్ని ఒక హోదాగానో, లేదంటే అధికారంగా మాత్రం నేను భావించడం లేదు.

సందేశ్‌ఖాలీలో రాక్షసలీలలు

జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యులం ఒక బృందంగా పశ్చిమబెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో ప్రతి ఇంటికి వెళ్లి తలుపు తట్టాం. బాధితురాళ్లను కలిసి విచారిస్తే, "మీరు ఇవాళ వచ్చి మాట్లాడి వెళతారు. తర్వాత గూండాలు పోలీసు వేషాల్లోవచ్చి మమ్మల్ని చావబాదుతారు" అంటూ మాతో మాట్లాడటానికి నిరాకరించారు. సాటి మహిళగా వారికి ధైర్యం నూరిపోసి, 'ఏమీ కాదు' అని భరోసా ఇచ్చాం. ఒక్కొక్కరు బాధను బయటకు చెబుతుంటే... నా గుండె తరుక్కుపోయింది. ప్రతి ఇంటా అత్యాచార బాధితురాళ్లున్నారు. సాగు భూమిని కోల్పోయినవారున్నారు. అక్కడి ప్రజలకు ఓటు అంటే తెలియదు. ఎన్నికల సమయంలో వారితో స్థానిక అధికార పార్టీ నాయకుడు ఒట్టు పెట్టించుకొని పంపుతారట. ఇలా ఒకటా, రెండా... బాధితుల నోట షేక్ షాజహాన్ అరాచకాలు వింటుంటే... కంసుడు, రావణాసురుడు చాలా మంచివాళ్లు అనిపించారు. సందేశ్‌ఖాలీలోని రాక్షస లీలలు అన్నీ ఇన్నీకావు మరి. మేము డైరెక్షన్ ఇచ్చాక పోలీసులు బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకోవడం మొదలు పెట్టారు. అక్కడి వారందరికీ మా ఫోన్‌నెంబరు ఇచ్చాం. అధికారులు స్పందించకుంటే మాకు తెలియజేయండని ధైర్యాన్ని ఇచ్చి వెనుతిరిగాం. సాధ్యమైనంత వరకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ అధికారాల పరిధికి లోబడి... సంబంధిత అధికారులకు తగిన మార్గదర్శకాలు ఇచ్చాం.

సామాజిక కార్యకర్తగా...

మా సొంతూరు నెల్లూరు జిల్లా కోవూరు. ఆచార వ్యవహారాలకు ప్రాధాన్యత ఇచ్చే అతి సాధారణ కుటుంబం మాది. మా నాయనమ్మ ఆదెమ్మ ప్రకాశం జిల్లా దేవరంపాడులోని ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. జాతీయ నాయకులు ఆమెను అభినందించారు. నాకు 17ఏట పెళ్లి అయింది. నా భర్త నరహరి మాధవరావు. ఆయన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త. ఆయన శాఖ నుంచి ఇంటికి కొన్ని పుస్తకాలు వెంట తెచ్చేవారు. వాటిని నేను కూడా బాగా చదివేదాన్ని. ముఖ్యంగా భారతదేశ చరిత్ర, సంస్కృతి సంబంధిత విషయాలు నన్ను అమితంగా ప్రభావితం చేశాయి. నేను కూడా సంఘ్ కార్యక్రమాల్లో పాల్గొనేదాన్ని. నా భర్త ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగి కావడంతో బదిలీల వల్ల కొంతకాలం అనకాపల్లి, ఎలమంచిలి ప్రాంతాల్లో ఉన్నాం. అదే సమయంలో పార్వతీపురం చుట్టుపక్కల ఆదివాసీ గూడేలలో నాలుగుకుపైగా బాల సంస్కార కేంద్రాలు నిర్వహించాను. తర్వాత 1987లో హైదరాబాద్‌కు వచ్చాం. ఇక్కడా వినాయక్ నగర్ లాంటి బస్తీలలో సేవా శిబిరాలు నిర్వహించాను. 'లా' చదివిన తర్వాత 1995లో హైకోర్టు న్యాయవాదిగా ప్రాక్టీసు మొదలుపెట్టా. అంజనీ మాతా సేవాట్రస్ట్ ద్వారా ఎంతోమంది పేదబాలికల చదువుకు సహాయం అందించాను. కొన్నివందల ఫ్యామిలీ కేసులు ఉచితంగా వాదించాను. విడాకుల కోసం వచ్చిన ఎన్నో జంటలను కౌన్సెలింగ్ ద్వారా తిరిగి ఒక్కటిచేయగలిగాను.



> 'ఆడవాళ్లను ఇంటికే పరిమితం చేయడం ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతం. వారు స్త్రీ స్వేచ్ఛ, స్వాతంత్ర్యానికి వ్యతిరేకం' లాంటి దుష్ప్రచారాలు బయట బోలెడు వింటుంటాం. అవన్నీ పచ్చి అబద్ధాలు. మహిళాభ్యున్నతికి సంఘ్ వ్యతిరేకం అయితే, నేను ఇంతవరకు వచ్చేదాన్నా?

అవన్నీ అవాస్తవాలు...

'ఆడవాళ్లను ఇంటికే పరిమితం చేయడం ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతం. వారు స్త్రీ స్వేచ్ఛ, స్వాతంత్ర్యానికి వ్యతిరేకం' లాంటి దుష్ప్రచారాలు బయట బోలెడు వింటుంటాం. అవన్నీ పచ్చి అబద్ధాలు. మహిళాభ్యున్నతికి సంఘ్ వ్యతిరేకం అయితే, నేను ఇంతవరకు వచ్చేదాన్నా? కన్నవారిని, ఇంటిని వదిలి ఆర్‌ఎస్‌ఎస్ కోసం ఎంతోమంది అమ్మాయిలు ప్రచారికలుగా మారారు. అనేక రంగాలలో సమితి మహిళలు రాణిస్తున్నారు. అసలు సంఘ్ భావనలు స్త్రీ స్వేచ్ఛకు విరుద్ధమైతే, కర్ర పట్టుకొని వీధుల్లో తిరగం కదా! శాఖలు నిర్వహించం కదా! ధర్మపరిరక్షణ కోసం బయటకొచ్చి నిరసనలు, ధర్నాలు చేపట్టం కదా! స్త్రీలలోని నైపుణ్యాలు వెలికితీసి, తద్వారా సమాజ ప్రయోజనానికి ఉపయోగించాలన్నదే రాష్ట్ర సేవికా సమితి సంకల్పం. నేను ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలిని అయ్యాక... సంఘ్ బాధ్యతల నుంచి పూర్తిగా బయటకు వచ్చాను. ఈ దేశంలో భావజాలాలు ఎన్ని ఉన్నా దేశం విషయంలో పౌరులంతా సమానమే. పైగా ఇలాంటి బాధ్యతాయుతమైన పదవిని నిర్వర్తించేప్పుడు భావజాలం ప్రధానం కాదు. ఎవరికి బాధ కలిగినా మేము స్పందిస్తాం. అంతకుమించి మతాలకు, సిద్ధాంతాలతో సంబంధంలేదు. సంస్కారవంతమైన సమాజం నిర్మాణం కావాలి. అందరికి సమన్యాయం జరగాలి. మానవులంతా సంతోషంగా ఉండాలన్నదే నా కోరిక. ఆ లక్ష్యంతోనే పనిచేస్తున్నాను."

• స్వాంతన్

న్యూస్‌మేకర్

అభినయం ఆమె సర్వస్వం

"జీవితంలో ఒక్కసారైనా ఆస్కార్ చేతపట్టాలనేది నటుల కోరిక. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఈ ఆస్కార్ వేదికపై నన్ను సగర్వంగా నిలబెట్టింది 'పూర్ థింగ్స్'"... ఉత్తమ నటిగా 'ఆస్కార్' అందుకున్న సందర్భంగా **ఎమ్మా స్టోన్** భావోద్వేగ ప్రసంగం ఇది. 35 ఏళ్ల ఈ అమెరికన్ నటికి 'ఆస్కార్' అందుకోవడం రెండోసారి. పాత్ర ఏదైనా పరకాయ ప్రవేశం చేసే ఆమె... 'సహజ నటి'గా ప్రపంచ ప్రఖ్యాతి పొందారు. సంగీతంతో మొదలై... డ్యాన్సర్‌గా... థియేటర్ ఆర్టిస్ట్‌గా అలరించి... వెండితెరపై తిరుగులేని అభినేత్రిగా 'ఆస్కార్' స్థాయికి చేరిన ఎమ్మాస్టోన్ ప్రస్థానం ఇది...




'ఆస్కార్ అవార్డుతో ఇవాళ మన ముందు నిలుచున్న ఎమిలి జీన్ ఎమ్మా స్టోన్‌లో అచంచలమైన ఆత్మవిశ్వాసం ప్రతిబింబించవచ్చు. ప్రపంచాన్ని జయించిన ఆనందం కనిపించవచ్చు. కానీ ఈ స్థాయికి రావడానికి ఆమె ఎన్నో నిద్ర లేని రాత్రులు గడిపింది. తీవ్ర మనోవేదనకు గురయింది. వీటన్నిటినీ అధిగమించడానికి తన అభిరుచి ఏమిటో గుర్తించి, తనలోని ప్రతిభకు పట్టం కట్టింది. ఆటుపోట్లు... ఒడుదొడుకులు... అన్నిటినీ తట్టుకుని... ప్రపంచం ముందు సగర్వంగా తనను తాను ఆవిష్కరించుకుంది. అమెరికా ఆరిజోనాలో పుట్టిన ఎమ్మా పసి వయసులోనే బేబీ కాలిక్ (తరచూ ఏడవడం)తో బాధపడ్డారు. దానివల్ల చిన్నప్పుడే ఆమె స్వర పేటిక దెబ్బతింది. ఎమ్మా తండ్రి జెఫ్రీ చార్లెస్ స్టోన్ ఓ కంపెనీ యజమాని. తల్లి క్రిస్టా జీన్ గృహిణి.

వెంటాడిన భయం: స్కూల్లో చదివే రోజుల్లో ఎమ్మా తీవ్ర మానసిక సమస్యతో సతమతమైంది. దాని నుంచి బయటపడడానికి ఆమెకు నటనే ఒక చికిత్సలా పని చేసింది. "మొట్టమొదటిసారి నేను భయాందోళనలకు (పానిక్ ఎటాక్) గురైంది... మా స్నేహితుల ఇంట్లో కూర్చున్నప్పుడు. నాకు ఇల్లు కాలిపోతున్న అనుభూతి కలిగింది. భయంతో అమ్మకు కాల్ చేస్తే... తను వచ్చి ఇంటికి తీసుకువెళ్లింది. మూడేళ్లు ఇదే సమస్యతో బాధపడ్డాను. చికిత్స ప్రారంభమైంది. మధ్యాహ్న భోజనానికి కూడా నర్సు చేయి పట్టుకుని భయంగా వెళ్లే దాన్ని. 'బయట వాతావరణం ఎలా ఉంది' అని అమ్మను పదే పదే అడిగే దాన్ని. ఎందుకంటే ఎవరూ చావబోవడంలేదని, అమాంతం పరిస్థితులు మారబోవడంలేదని తెలుసుకోవడానికి. ఆ మానసిక సమస్య నుంచి నన్ను బయట పడేసింది నటన" అంటూ ఓ సందర్భంలో చిన్ననాటి రోజులు గుర్తు చేసుకుంది ఎమ్మా.

సంగీతంతో మొదలై: ఊహ తెలిసినప్పటి నుంచి నటనపై మక్కువ పెంచుకుంది ఎమ్మా. మొదట యూట్యూబ్‌లో చిన్న చిన్న సరదా వీడియోలు చేద్దామనుకుంది. కానీ తరువాత ఆమె మనసు సంగీత నాటకాల వైపు మళ్లింది. దాని కోసం కొన్నేళ్లు సంగీత శిక్షణ తీసుకుంది. "ఇంట్లో మా అమ్మ 'లెస్ మిజరబుల్స్' పాట వినిపిస్తుండేది. అందులోని కథ నాకు వివరించి చెప్పేది. తరువాత ఎనిమిదేళ్లప్పుడు అనుకొంటా... అదే కథను నేను రంగస్థలంపై చూశాను. నాకు ఎంతో నచ్చేసింది. ఆ ఇష్టం నా ఆలోచనలను సంపూర్ణంగా మార్చేసింది. ఇక అప్పటి నుంచి మాటల్లో చెప్పలేని భావాలను పలికించడానికి పాట ఒక పెద్ద మాధ్యమం అయింది. సంగీత సాధన చేస్తూనే... నాకు మరింత ఇష్టమైన నాట్యం మీద దృష్టి పెట్టాను. పదేళ్లపాటు అభ్యాసం చేశాను. క్రమంగా నటన వైపు మళ్లాను. పదకొండేళ్లప్పుడు మొదటిసారి ఆరిజోనాలోని థియేటర్‌లో నాటకం వేశాను. 2005లో 'ది న్యూ పాట్రిడ్జ్ ఫ్యామిలీ' రియాలిటీ షో ద్వారా తొలిసారి టెలివిజన్‌లో కనిపించాను. రెండేళ్లు టీవీల్లోనే సాగింది నా కెరీర్. ఆ సమయంలోనే 'సూపర్‌బ్యాడ్' (2007) చిత్రంలో అవకాశం వచ్చింది. అందులో నాది జూలెస్ పాత్ర" అంటూ గతాన్ని గుర్తు చేసుకున్న ఎమ్మా కెరీర్ అక్కడి నుంచి రాకెట్ స్పీడ్‌తో దూసుకుపోయింది.

అకాడమీ అవార్డు: బాల్యంలో ఇబ్బంది పెట్టిన భయాందోళనలను దూరం చేయడానికి అభినయం ఒక చికిత్సలా ఉపయోగపడిందన్న ఎమ్మా... తన జీవితం నుంచే ఎన్నో పాఠాలు నేర్చుకుంది. వైద్యం ప్రభావం చూపని చోట... తన అభిరుచిని ఆస్వాదిస్తూ మానసికంగా తనను తాను దృఢంగా మలచుకుంది. పాత్రల్లో లీనమై అశేష జనాభిమానం సంపాదించుకుంది. విమర్శకులను సైతం మెప్పించి... సహజ నటిగా ఎన్నో అవార్డులు గెలుచుకుంది. 2009లో విడుదలైన హర్రర్ కామెడీ చిత్రం 'జాంబీలాండ్'తో తొలి కమర్షియల్ హిట్ అందుకున్న ఎమ్మా... పలు మ్యూజిక్ ఆల్బమ్స్ కూడా చేసింది. 2016లో వచ్చిన 'లా లా ల్యాండ్'లో అద్భుతమైన అభినయానికి గానూ ఉత్తమ నటిగా తొలిసారి 'ఆస్కార్'ను ముద్దాడింది. ఇప్పటికి దాదాపు ముప్పై చిత్రాల్లో నటించిన ఎమ్మా... హాలీవుడ్‌లోని బిజీ నటీమణుల్లో ఒకరు.

ప్రేమ... పెళ్లి: అంతర్జాతీయ స్టార్‌గా ఎదిగినా సాధారణ జీవితం గడపడానికే ఎమ్మా ఇష్టపడుతుంది. వ్యక్తిగత విషయాలు గోప్యంగా ఉంచుతుంది. ఖాళీ దొరికితే తన కుటుంబానికే సమయం కేటాయించే ఎమ్మా... 'పేపర్‌మ్యాన్' సహనటుడు కీరన్ కల్కిన్‌తో సహజీవనం చేసింది. రెండేళ్ల తరువాత అతడికి బ్రేకప్ చెప్పి... 'అమేజింగ్ స్పైడర్‌మ్యాన్'లో తనతో నటించిన ఆండ్రూ గార్‌ఫీల్డ్‌తో ప్రేమలో పడింది. నాలుగేళ్లు సాగిన ఈ ప్రేమాయణం 2015లో ముగిసింది. రెండేళ్లు ఒంటరిగా జీవించిన ఎమ్మా స్టోన్... దర్శకుడు డేవ్ మెక్‌కారీని ప్రేమించి, 2020లో అతడిని పెళ్లి చేసుకుంది. మరుసటి ఏడాది వారికి కూతురు పుట్టింది. బిడ్డ తల్లి అయ్యాక కూడా ఎమ్మా సినిమాలు వదల్లేదు. ఆమెలో ఉత్సాహం, తపన తగ్గలేదు.



మళ్లీ మెరుపులు: ఒక పక్క నటిస్తూనే నిర్మాతగా మారిన ఎమ్మా... గత ఏడాది 'పూర్ థింగ్స్' చిత్రంలో నటించి, నిర్మించింది. ఇప్పుడు అదే చిత్రానికి ఎమ్మా స్టోన్ మరోసారి ఉత్తమ నటిగా 'ఆస్కార్ అవార్డు' అందుకుంది. విక్టోరియన్ లండన్‌లోని ఓ యువతి మరణించిన తరువాత ఒక శాస్త్రవేత్త ద్వారా తిరిగి ప్రాణం పోసుకోవడం 'పూర్ థింగ్స్' కథాంశం. ఇందులో బెల్లా బాక్సర్‌గా ఎమ్మా అసమాన నటనతో ఆకట్టుకుంది. 'ఈ పురస్కారానికి అర్హురాలిననని ఇప్పటికీ నేను నమ్మలేకపోతున్నా' అంటూ 'ఆస్కార్ అవార్డు' స్వీకరిస్తున్న సందర్భంగా ఎమ్మాస్టోన్ తన సంతోషాన్ని పంచుకుంది. ప్రస్తుతం ఆమె మరో విభిన్న కథాచిత్రం 'కైండ్స్ ఆఫ్ కైండ్‌నెస్' నటిస్తోంది.

నారింజతో నవయవ్వనం

నారింజ పండు తిని తొక్కను తీసి పడేయకండి. తొక్కే కదా... అని అనుకోకుండా... ఎండబెట్టి పొడి చేసుకుంటేమంచిది. చర్మం అందంగా ఉండటానికి నారింజతో పాటుర తొక్క పొడితోనూ ఎంతో ఉపయోగపడుతుంది.

- బౌల్‌లో టేబుల్ స్పూన్ నారింజ తొక్క పొడిని తీసుకోవాలి. ఇందులోకి రెండు టేబుల్ స్పూన్ల పెరుగు కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఇరవై నిముషా తర్వాత శుభ్రం చేయాలి. ఇలా తరచూ చేస్తుంటే ముఖం కాంతివంతంగా ఉంటుంది.
- టేబుల్ స్పూన్ ఆరెంజ్ పీల్ పౌడర్, టేబుల్ స్పూన్ తేనె, కొద్దిగా పసుపు కలిపి మిక్స్ చేయాలి. ఈ చూర్ణాన్ని ముఖానికి పట్టించి ఆరిన తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తుంటే ముఖం మీద ఉండే నొప్పులు తొలగిపోతాయి.



- బౌల్‌లో టేబుల్ స్పూన్ నారింజ తొక్క పొడి, టేబుల్ స్పూన్ ముల్తాని మట్టి వేసి కలపాలి. ఈ మిశ్రమానికి రోజ్ వాటర్ కలిపి చూర్ణం చేయాలి. దీన్ని పట్టించి అరగంట తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా చేస్తుంటే ముఖం మీద ఉండే మచ్చలు పోతాయి.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల జ్యూస్, టేబుల్ స్పూన్ శనగపిండి, టీస్పూన్ రోజ్ వాటర్ కలిపి మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖచర్మం, మెడ వెనుక పట్టిస్తే చర్మంలో మెరుపు వస్తుంది.
- రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, రెండు టేబుల్ స్పూన్ల ఆరెంజ్ పీల్ పౌడర్, సగం నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఆరిన తర్వాత కడిగేస్తే చర్మం మీద రెడ్‌నెస్ తగ్గిపోతుంది.
- బౌల్‌లో టేబుల్ స్పూన్ ఆరెంజ్ పీల్ పౌడర్, టేబుల్ స్పూన్ బొప్పాయి గుజ్జు వేసి రోజ్‌వాటర్ కలపాలి. ఈ చూర్ణాన్ని పట్టించి అరగంట తర్వాత శుభ్రపరచాలి. ఇలా చేస్తుంటే ముఖం మీద ఉండే పుండ్లు, మొటిమలు తగ్గిపోతాయి. ఫ్రెష్‌గా ఉంటుంది.

కథనార్ కోసం కొత్త లుక్‌లో

అనుష్క శెట్టి కథానాయికగా నటిస్తున్న తొలి మలయాళ చిత్రం 'కథనార్'. సోమవారం ఆమె సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఈ చిత్రానికి రోజిన్ థామస్ దర్శకత్వం వహిస్తున్నారు. అనుష్క చిత్రీకరణలో పాల్గొన్న ఫొటోలను దర్శకుడు సోషల్ మీడియాలో షేర్ చేయగా వైరల్ అయ్యాయి. చాలా రోజుల తర్వాత అనుష్క కొత్త లుక్ చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. బరువు తగ్గి నాజూగ్గా ఉన్న అనుష్కను చూసి అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కేరళలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రెండు భాగాలుగా తెరకెక్కుతోంది.



రావు రమేష్ హీరోగా 'మారుతి నగర్ సుబ్రమణ్యం'

విలక్షణ నటుడు రావు రమేష్ టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం 'మారుతి నగర్ సుబ్రమణ్యం'. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించారు. రావు రమేష్ సరసన ఇంద్రజ నటించారు. అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి, హర్షవర్ధన్ కీలక పాత్రధారులు. బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మాతలు. ప్రేక్షకులే ముఖ్య అతిథులుగా సరికొత్త రీతిలో మంగళవారం ఈ సినిమా ఫస్ట్ లుక్ విడుదల చేశారు. దర్శక, నిర్మాతలు మాట్లాడుతూ "ఇప్పటి వరకు రావు రమేష్ చేసిన పాత్రలకు పూర్తి భిన్నమైన పాత్రలో ఈ సినిమాలో



కనిపిస్తారు. సినిమా స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకు ఎంటర్టైన్ చేస్తారు. పూర్తి స్థాయి వినోదంతో పాటూ ప్రేక్షకులని కదిలించే భావోద్వేగాలు కూడా ఈ సినిమాలో ఉన్నాయి. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా 'మారుతి నగర్ సుబ్రమణ్యం' ఉంటుంది" అని చెప్పారు. రావు రమేష్ మాట్లాడుతూ " ఫస్ట్ లుక్ పోస్టర్ ఎవరు ఆవిష్కరిస్తే బావుంటుందని అనుకున్నా. నటుడిగా నాకు ఈ స్థాయిని, స్థానాన్ని ఇచ్చిన తెలుగు ప్రేక్షకులే ఆవిష్కరిస్తే బాగుంటుందని మేమంతా మనస్ఫూర్తిగా నమ్మాం. మీరు చూపించిన అభిమానానికి సదా కృతజ్ఞుడిని" అని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: బొంతల నాగేశ్వర్ రెడ్డి, సినిమాటోగ్రఫీ: ఎంఎన్ బాల రెడ్డి, లైన్ ప్రొడ్యూసర్: శ్రీహరి ఉదయగిరి, సహ నిర్మాతలు: రుషి మర్ల, శివ ప్రసాద్ మర, ఆర్ట్ డైరెక్షన్: సురేష్ భీమంగని.



రీ రిలీజ్‌కు రెడీ...

ప్రభుదేవా కథానాయకుడిగా శంకర్ దర్శకత్వం వహించిన 'ప్రేమికుడు' చిత్రం అప్పట్లో సంచలన విజయం అందుకున్న సంగతి తెలిసిందే. 1994లో విడుదలైన ఈ చిత్రం అప్పట్లో కుర్రకారును ఓ ఊపు ఊపింది. తమిళంలో క్లాసిక్‌గా నిలిచి, తెలుగులోనూ సూపర్‌హిట్‌గా నిలిచింది. ముఖ్యంగా, యువతీయువకులను ఈ చిత్రం విపరీతంగా ఆకట్టుకుంది. ఏ. ఆర్. రెహమాన్ స్వరపరిచిన 'అందమైన ప్రేమ రాణి, 'ఊర్వశీ ఊర్వశీ', 'ఓ చెలియా నా ప్రియ సఖియా', 'ముక్కాల ముక్కాబులా' గీతాలు మ్యూజికల్ సెన్సేషన్ సృష్టించాయి. అప్పటి కుర్రకారు మదిని దోచేసిన 'ప్రేమికుడు', ఈ తరాన్ని కూడా అంతలానే అలరిస్తుందన్న నమ్మకంతో రీ రిలీజ్‌కు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రం రీ రిలీజ్ రైట్స్‌ను మురళీధర్ రెడ్డి, రమణ దక్కించుకున్నారు. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని వారు తెలిపారు. దాదాపు 30 ఏళ్ల తర్వాత రీ రిలీజ్ కానున్న ఈ చిత్రం ఒకే సారి ఆ తరాన్ని. ఈ తరాన్ని థియేటర్లలో ఆకట్టుకోనుంది.

కల్యాణీ వచ్చా వచ్చా

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న కుటుంబ కథా చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. మృణాల్ ఠాకూర్ కథానాయిక. 'కల్యాణి వచ్చా వచ్చా...' అంటూ సాగే యుగళ గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, గోపీసుందర్ స్వరాలు సమకూర్చారు. మంగ్లీ, కార్తీక్ ఆలపించారు. శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ బేనర్‌పై దిల్‌రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పరుశురామ్ పెట్ల దర్శకుడు. ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కేయూ మోహనన్.





కథానాయిక మీరా చోప్రా వివాహబంధంలోకి అడుగుపెట్టారు. వ్యాపారవేత్త రక్షిత్ కేజ్రీవాల్‌ను ఆమె పెళ్లాడారు. మంగళవారం జైపూర్‌లో కుటుంబ సభ్యులు, కొద్ది మంది సినీ ప్రముఖులు నడుమ ఈ ప్రేమజంట ఒక్కటయ్యారు. తెలుగులో 'బంగారం' 'వాన' చిత్రాలు కథానాయికగా మీరాచోప్రాకు గుర్తింపు తెచ్చాయి.

క్రేజీ కాంబో కుదిరింది



'గజిని' చిత్రం లాంటి సంచలన విజయాలతో ట్రెండ్ సెట్ చేశారు తమిళ దర్శకుడు మురుగదాస్. కొన్నాళ్ల విరామం తర్వాత ఆయన భారీ ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. బాలీవుడ్ అగ్రహీరో సల్మాన్‌ఖాన్, మురుగదాస్ కాంబినేషన్‌లో క్రేజీ ప్రాజెక్ట్ సెట్టయింది. మంగళవారం ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. సాజిద్ నడియాడ్‌వాలా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది రంజాన్‌కు ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని సల్మాన్‌ఖాన్ తెలిపారు. భారీ బడ్జెట్‌తో యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కనుంది.

వింటేజ్ నరేశ్‌ని మళ్లీ చూస్తారు



అల్లరి నరేశ్, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన 'ఆ ఒక్కటీ అడక్కు' చిత్రం టీజర్‌ను మంగళవారం జరిగిన కార్యక్రమంలో విడుదల చేశారు. మల్లి అంకం దర్శకత్వంలో రాజీవ్ చిలక ఈ సినిమా నిర్మిస్తున్నారు. వేసవిలో విడుదల కానుంది. టీజర్‌ను విడుదల చేసిన అనంతరం నరేశ్ మాట్లాడుతూ 'నాన్నగారు తీసిన 'ఆ ఒక్కటీ అడక్కు' చిత్రానికీ, మా సినిమాకూ పోలిక లేదు. జీవితంలో సెటిల్ కాకుండా పెళ్లి చేసుకొనే హీరో కథతో నాన్నగారి సినిమా ఉంటుంది. లైఫ్‌లో సెటిల్ అయినా పెళ్లికాని వాడి కథ మాది. చాలా హిలేరియస్‌గా ఉంటుంది. వింటేజ్ నరేశ్ రావాలని చాలా మంది అడుగుతున్నారు. నా బలం కామెడీ. అందుకే ఈసారి మరింత నవ్వించాలని ఈ సినిమా చేశాం. ఫరియా మంచి కామెడీ టైమింగ్ ఉన్న నటి. అద్భుతంగా నటించింది. హిందీ నటుడు జానీ లివర్ తొలిసారిగా తెలుగులో నటిస్తున్నారు. నిర్మాణానికి కొత్త అయినా రాజీవ్‌గారు మంచి ప్యాషన్‌తో ఈ సినిమా తీశారు. అందరికీ మంచి పేరు తెచ్చే చిత్రమిది' అన్నారు. 'మా బేనర్ చిలకా ప్రొడక్షన్స్‌లో వస్తున్న తొలి సినిమా ఇది. నిర్మాత కావాలనే నా ఇరవై ఏళ్ల కల ఈ సినిమాతో తీరింది. నరేశ్ మంచి నటుడు. ఆయనతో మరిన్ని సినిమాలు చేయాలని ఉంది' అన్నారు నిర్మాత రాజీవ్ చిలక. 'టీజర్ చూసి ఎలా నవ్వుకుంటున్నారో సినిమా కూడా అంతే వినోదభరితంగా ఉంటుంది. ఫ్యామిలీతో కలసి ఆనందంగా నవ్వుకుంటూ చూసే సినిమా ఇది' అని చెప్పారు దర్శకుడు. నరేశ్‌తో ఇది నాలుగో సినిమా, డైలాగులు రాస్తున్నప్పుడు కిక్ వచ్చిందని రచయిత అబ్బూరి రవి తెలిపారు.



చరిత్రలో నిలిచేలా...

ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ భగవద్గీత తను నేటి యువతకు అందించడానికి ఆడియో రూపంలో తీసుకొస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా 'భగవద్గీత విశ్వరూప దర్శనం' అధ్యాయాన్ని హీరో విష్వక్‌సేన్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా విష్వక్‌సేన్ మాట్లాడుతూ 'అందరికీ అర్థమయ్యేలా సంపూర్ణ భగవద్గీత తాత్పర్యం చాలా అద్భుతంగా రికార్డ్ చేసిన ఆర్పీ పట్నాయక్‌కు ధన్యవాదాలు. ఇది చాలా గొప్ప కార్యం. చరిత్రలో నిలిచిపోతుంది' అని ప్రశంసించారు. ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ 'స్వామి ముకుందానంద రాసిన భగవద్గీత అర్థం చేసుకోవడానికి సులువుగా ఉంటుంది. వారి అనుమతితో రికార్డ్ చేశాను. ఇది నాకు దక్కిన అదృష్టం అన్నారు. పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వినోదం పంచే ఓం భీమ్ బుష్



శ్రీహర్ష

శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ప్రధాన పాత్రలు పోషించిన 'ఓం భీమ్ బుష్' చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. 'హుషారు' చిత్రానికి దర్శకత్వం వహించిన శ్రీహర్ష కొనుగంటి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ' యూనివర్సిటీలో చదువుకున్న ముగ్గురు యువకులు ఓ గ్రామంలో గుప్త నిధుల కోసం చేసే అన్వేషణని వినోదభరితంగా ఇందులో చూపించాం. 'ఓం భీమ్ బుష్' అనేది ఓ మ్యాజికల్ ఫ్రేజ్. చిన్న పిల్లలు ఆడుకునేటప్పుడు సరదాగా ఈ మాట అంటుంటారు. అదే మా సినిమాకు టైటిల్‌గా నిర్ణయించాం. కథకు యాప్ట్ టైటిల్ ఇది' అన్నారు. 'ఈ కథలో ప్రతి సన్నివేశం లాజిక్‌తో ముడిపడి ఉంటుంది. ఇందులో బలమైన కథ ఉంది. మంచి ఎమోషన్ కూడా ఉంది. ఇండియన్ స్ర్కీన్ మీద ఇప్పటివరకూ రాని పాయింట్ మా సినిమాలో ఉంది. శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ కథ రాశాను' అన్నారు. ఈ చిత్రంలో శ్రీవిష్ణు విశ్వరూపం చూస్తారని చెబుతూ 'ఇందులో కామెడీ టైమింగ్ నెక్స్ట్ లెవల్‌లో ఉంటుంది. శ్రీవిష్ణు ఇంత ఫుల్ లెంగ్త్ కామెడీ ఇప్పటివరకూ చేయలేదు. ఫస్ట్ షాట్ నుంచి చివరి వరకూ ఓ లాఫ్ రైడ్‌లో ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు' అని చెప్పారు శ్రీహర్ష. చిత్ర నిర్మాతలు గురించి చెబుతూ 'వంశీ, విక్రమ్, సునీల్ ఈ సినిమా నిర్మించారు. నాకు పూర్తి స్వేచ్ఛ నిచ్చారు. ఇలాంటి నిర్మాతలు దొరకడం నా అదృష్టం. బిజినెస్ కూడా పెద్ద రేంజ్‌లో జరిగింది. తప్పకుండా మ్యాజిక్ క్రియేట్ చేస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు శ్రీహర్ష.

నా దేశం కోసం 'రజాకార్' తీశా

గూడూరు నారాయణరెడ్డి

'నా శేషజీవితంలో ఏదో ఒక మంచి పని చేయాలి. చరిత్రలో నిలిచిపోవాలి. చరిత్రను సినిమాగా తీసి ఈ సమాజానికి తెలియజేయాలని అనుకున్నా. అందుకే హై క్వాలిటీతో రూ. 50 కోట్ల బడ్జెట్‌తో 'రజాకార్' సినిమా తీశా. నా దేశం కోసం, దేశప్రజల కోసం ఈ సినిమా తీశా' అన్నారు గూడూరు నారాయణరెడ్డి. ఆయన నిర్మించిన 'రజాకార్' చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, మరాఠి భాషల్లో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నారాయణ రెడ్డి మీడియాకు చిత్ర విశేషాలు వెల్లడిస్తూ ' రెండేళ్ల క్రితం నేను తిరుపతిలో ఉన్నప్పుడు నాకు ఈ సినిమా చేయాలనే ఆలోచన వచ్చింది. నా ఇష్ట దైవం వేంకటేశ్వరుడు ఈ సినిమా తీయమని నాతో చెప్పాడనిపించింది. వెంటనే దర్శకుడు యాటా సత్యనారాయణకు ఫోన్ చేశా. రజాకార్లు మళ్లీ పుట్టొద్దు అనే కారణంతోనే ఈ సినిమా నిర్మించాను. నాకు ఏ మతం మీద వ్యతిరేకత లేదు. ముస్లింలకు వ్యతిరేకిని కాను. ఏడవ నిజాంను మాత్రం వ్యతిరేకిస్తా. నా ఆలోచనకు దర్శకుడు సత్యనారాయణ న్యాయం చేశాడు. బడ్జెట్ పెరగడం వల్ల ఇబ్బంది ఎదురైంది కానీ సినిమా బాగా వచ్చింది. తెలంగాణలో పుట్టిన వ్యక్తి తీసిన బెస్ట్ సినిమా ఇదని గట్టిగా చెప్పగలను' అన్నారు నారాయణరెడ్డి. సినిమాకు హిందీలో కూడా రెస్పాన్స్ బాగుందని ఆయన తెలిపారు.

చాణక్యుడు, చంద్రగుప్తుడిని కలిపితే చిరంజీవి



చైతన్య రావు, భూమి శెట్టి జంటగా నటించిన చిత్రం "షరతులు వర్తిస్తాయి". కుమారస్వామి(అక్షర) దర్శకత్వం వహించారు. నాగార్జున సామల, శ్రీష్ కుమార్ గుండా, డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు నిర్మించారు. "షరతులు వర్తిస్తాయి" సినిమా ఈ నెల 15న థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. హీరో ప్రియదర్శి ముఖ్య అతిథిగా హైదరాబాద్‌లో మంగళవారం ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియదర్శి మాట్లాడుతూ "మనం ఇవాళ తెరపై చాలా సూపర్ హీరోస్‌ను చూస్తున్నాం. ఈ సినిమాలో ఓ మిడిల్ క్లాస్ వారియర్ పోరాటాన్ని చూపిస్తున్నారు" అని అన్నారు. దర్శక నిర్మాత మధుర శ్రీధర్ మాట్లాడుతూ "ఇప్పటివరకు రిలీజైన టీజర్, ట్రైలర్, సాంగ్స్ చూస్తుంటే ఈ సినిమాను నిజాయితీగా తెరకెక్కించారని తెలుస్తోంది" అని చెప్పారు. దర్శకుడు వేణు ఊడుగుల మాట్లాడుతూ "ప్రపంచంలో తెలుగువాళ్లు ఎక్కడ ఉన్నా వారి జీవితంలో జరిగిన సందర్భాలను ఈ కథతో రిలేట్ చేసుకుంటారు" అని అన్నారు. హీరో చైతన్య రావు మాట్లాడుతూ " ఇది మా అందరి కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమా అవుతుంది. నా క్యారెక్టర్‌కు చిరంజీవి అనే పేరు పెట్టినప్పటి నుంచి భయమూ, భక్తితో నటించాను" అని అన్నారు. ఈ చిత్ర దర్శకుడు కుమారస్వామి మాట్లాడుతూ "నన్ను నమ్మే నలుగురు వ్యక్తులు చెప్పిన మాటలను పాటిస్తూ ఈ సినిమాను రూపొందించాను. థియేటర్స్‌కు వెళ్లి సినిమా చూడండి, మీ డబ్బులు, టైమ్ వృథా కావు" అని అన్నారు. నిర్మాత డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు మాట్లాడుతూ "ఈ సినిమాలో హీరో క్యారెక్టర్ చాణక్యుడిని, చంద్రగుప్తుడిని కలిపితే ఎలా ఉంటుందో అలా ఉంటుంది" అని అన్నారు. హీరోయిన్ భూమి శెట్టి మాట్లాడుతూ "ఈ సినిమా మన జీవితాలకు అద్దం పట్టేలా ఉంటుంది" అని చెప్పారు.

సందీప్ కొత్త చిత్రం షురూ



యంగ్ హీరో సందీప్ కిషన్ ప్రస్తుతం "ఊరి పేరు భైరవకోన" సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. తన 30వ చిత్రానికి మంగళవారం ప్రకటించారు. 'ధమాకా' ఫేమ్ త్రినాధరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్నారు. ఏకే ఎంటర్టైన్‌మెంట్స్, హాస్య మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి ప్రసన్న కుమార్ బెజవాడ కథ, స్ర్కీన్ ప్లే, మాటలు అందిస్తున్నారు. రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: బాలాజీ గుత్తా

అన్ని వర్గాలను మెప్పించే కథ



పార్వతీశం, ప్రణీకాన్వికా జంటగా నటించిన చిత్రం 'మార్కెట్ మహాలక్ష్మి'. వీ ఎస్ ముఖేశ్ యువ దర్శకత్వంలో అఖిలేశ్ కలారు నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం ట్రైలర్‌ను యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా పార్వతీశం మాట్లాడుతూ ' 'కేరింత' చిత్రంలానే 'మార్కెట్ మహాలక్ష్మి' నాకు మరో హిట్ చిత్రమవుతుంది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే అంశాలతో దర్శకుడు సినిమాను తెరకెక్కించాడు' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'కథలో మలుపులు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి అని దర్శకుడు చెప్పారు. కంటెంట్‌పైన నమ్మకంతో ఈ సినిమాను నిర్మించాను, అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది అని నిర్మాత చెప్పారు.



స్నేహితుల కథతో...

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా హీరోలుగా నటించిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. తాజాగా 'ఓ మై ఫ్రెండ్' అనే లిరికల్ వీడియోను మంగళవారం విడుదల చేశారు. నటుడు శివాజీ, దర్శకుడు త్రినాధరావు నక్కిన, రచయిత ప్రసన్న కుమార్ ఈ సాంగ్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ 'నేటి యువతకు నచ్చే సినిమా ఇది. పాటలు బాగున్నాయి. దర్శకుడు విక్రమ్‌రెడ్డి బాగా తీశాడు. పరిశ్రమకు మరో మంచి దర్శకుడు దొరికాడు' అని ప్రశంసించారు. ఈ సినిమా పోస్టర్ చూస్తుంటే 'మేం వయసుకు వచ్చాం' నాటి రోజులు గుర్తుకు వస్తున్నాయని త్రినాధరావు అన్నారు. చిత్ర నిర్మాణం మీద, కథ మీద నాలెడ్జ్, గ్రిప్ ఉన్న నిర్మాత బెక్కం వేణుగోపాల్ అని ప్రసన్నకుమార్ అన్నారు. 'కొత్తవాళ్లతో ఈ రోజుల్లో సినిమా తీయడానికి గట్స్ కావాలి. కంటెంట్ మీద నమ్మకం ఉండాలి. ఇది మ్యాటర్ ఉన్న సినిమాలా అనిపిస్తోంది' అన్నారు.

ఉత్కంఠ భరితంగా శివం భజే



యువ నటుడు అశ్విన్ బాబు, దిగంగనా సూర్యవంశీ హీరో హీరోయిన్లుగా ఓ చిత్రంలో నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు అర్బాజ్ ఖాన్, తమిళ విలన్ సాయి దీనా, హైపర్ ఆది ఈ చిత్రంలో ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. అప్సర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. మహేశ్వర్ రెడ్డి నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ చిత్రానికి 'శివం భజే' అనే టైటిల్‌ను మంగళవారం ఖరారు చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ "అశ్విన్ హీరోగా ఒక వైవిధ్యమైన కథతో గంగా ఎంటర్టైన్మెంట్స్ మొదటి నిర్మాణంగా 'శివం భజే' తెరకెక్కుతోంది. కొత్త కథ, కథనాలతో రూపొందుతున్న న్యూ ఏజ్ సినిమా ఇది. కామెడీ, డ్రామా, యాక్షన్ ఎలిమెంట్స్‌తో ఆద్యంతం ఉత్కంఠ భరితంగా ఉంటుంది. ఇప్పటికే 80 శాతం షూటింగ్ పూర్తయింది" అని అన్నారు. దర్శకుడు అప్సర్ మాట్లాడుతూ "సాంకేతికంగా ఉన్నతంగా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. అన్ని వర్గాల ప్రేక్షకులకి తప్పకుండా నచ్చుతుంది" అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్ : ఛోటా కె ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్ : సాహి సురేష్, మ్యూజిక్ డైరెక్టర్ : వికాస్ బడిస, డీఓపీ : దాశరథి శివేంద్ర.

రిటైల్ ద్రవ్యోల్బణం నాలుగు నెలల కనిష్ఠం



న్యూఢిల్లీ: దేశంలో రిటైల్ ధరల్లో చెప్పుకోదగ్గ మార్పు ఏదీ చోటు చేసుకోలేదు. ఫిబ్రవరి నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం నాలుగు నెలల కనిష్ఠ స్థాయి 5.09 శాతంగా నమోదైంది. ఇది వరుసగా ఆరో నెల కూడా ప్రభుత్వం ఆర్‌బీఐకి నిర్దేశించిన గరిష్ఠ కట్టడి స్థాయి 6 శాతం కన్నా దిగువనే ఉండడం విశేషం. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం వినియోగ ధరల సూచీ ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం (సీపీఐ) జనవరి నెలలో 5.1 శాతం, గత ఏడాది ఫిబ్రవరిలో 6.44 శాతం ఉంది. అయితే ఆహార వస్తువుల ధరల్లో స్వల్ప వృద్ధి నమోదైంది. జనవరితో పోల్చితే ఈ విభాగంలో ద్రవ్యోల్బణం 8.3 శాతం నుంచి 8.66 శాతానికి పెరిగింది. కూరగాయలు, పళ్లు, ఆయిల్స్ అండ్ ఫ్యాట్స్, పప్పులు, అనుబంధ ఉత్పత్తుల విభాగంలో ధరలు తగ్గినా చిరుధాన్యాలు, మాంసం, చేపలు, పాలు, పాల ఉత్పత్తుల విభాగంలో మాత్రం ధరలు పెరిగాయి. సీపీఐలో ఆహార వస్తువుల వాటా సుమారు 50 శాతం ఉంటుంది. ప్రాంతాలవారీగా చూసినట్టయితే పట్టణ ప్రాంతాల (4.78 శాతం) కన్నా గ్రామీణ ప్రాంతాల్లో (5.34 శాతం) ద్రవ్యోల్బణం అధికంగా ఉంది.

నీరసించిన పారిశ్రామికం

భారత పారిశ్రామిక వృద్ధి రేటు జనవరి నెలలో మందగించింది. తయారీ, మైనింగ్, విద్యుత్ రంగాల నిరాశావహమైన పనితీరు కారణంగా పారిశ్రామిక వృద్ధి రేటు 3.8 శాతానికి పరిమితం అయింది. పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) ఆధారితంగా మదింపు చేసే పరిశ్రమల వృద్ధి గత ఏడాది జనవరిలో 5.8 శాతం ఉండగా డిసెంబరులో 4.2 శాతం ఉంది. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జనవరి నెలల మధ్య కాలంలో అంతకు ముందు ఏడాదితో పోల్చితే 5.5 శాతం నుంచి 5.9 శాతానికి పెరిగింది. విభాగాల వారీగా చూసినట్టయితే తయారీ రంగం వృద్ధి 4.5 శాతం నుంచి 3.2 శాతానికి తగ్గింది. విద్యుత్ ఉత్పత్తి 12.7 శాతం నుంచి 5.6 శాతానికి, గనుల ఉత్పత్తి 9 శాతం నుంచి 5.9 శాతానికి క్షీణించింది. యంత్రపరికరాల విభాగంలో వృద్ధి రేటు 10.5 శాతం నుంచి 4.1 శాతానికి దిగజారింది.

భారత వాస్తవ వృద్ధి 8 శాతం

వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత వాస్తవిక జీడీపీ వృద్ధి రేటు 8 శాతానికి చేరువలో ఉంటుందని ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ అన్నారు. మంగళవారం ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ.. వృద్ధి రేటు గణాంకాల మంత్రిత్వ శాఖ అంచనా 7.6 శాతాన్ని మించి ఉంటుందని పేర్కొన్నారు. జీడీపీ వృద్ధి రేటులో మూడు త్రైమాసికాల్లో ఏర్పడిన వేగం నాలుగో త్రైమాసికంలో గణనీయంగా తగ్గితే తప్ప అది 8 శాతానికి చేరువలో ఉండడం తథ్యమని ఆయన వ్యాఖ్యానించారు. రుతుపవనాలు అస్తవ్యస్తంగా ఉన్న కారణంగా వేసవి పంట దిగుబడులు తగ్గి వ్యవసాయ రంగం వెనుకబడి ఉన్నదని ఆయన అన్నారు. అలాగే ప్రపంచ వృద్ధి మందగించినందువల్ల ఎగుమతుల్లో తొలి దశాబ్దిలో ఏర్పడిన వేగం ఉండకపోవచ్చని వ్యాఖ్యానించారు.

ఈ నెల 18 నుంచి ఫ్లై91 విమాన సేవలు

గోవా నుంచి హైదరాబాద్‌కు విమాన సర్వీసు

మోపా (గోవా): ఈ నెల 18 నుంచి విమానయాన సేవలను ప్రారంభించనున్నట్లు ఈ మధ్యనే ఎయిర్‌లైన్ పర్మిట్‌ను దక్కించుకున్న దేశీయ ఎయిర్‌లైన్స్ ఫ్లై91 తెలిపింది. తొలుత గోవా నుంచి బెంగళూరు, హైదరాబాద్ మార్గాల్లో విమానయాన సేవలందించనున్నట్లు ఎయిర్‌లైన్స్ ఎండీ, సీఈఓ మనోజ్ చాకో తెలిపారు. అలాగే, హైదరాబాద్, బెంగళూరు నుంచి సింధుదుర్గ్‌కు సైతం సర్వీసులు నడపనుంది. ఏప్రిల్‌లో లక్ష్యద్వీప్‌లోని అగట్టికి సైతం సర్వీసును ప్రారంభించనున్నట్లు చాకో వెల్లడించారు. గోవాకు చెందిన ఫ్లై91 వద్ద ప్రస్తుతం రెండు ఏటీఆర్ 72-600 విమానాలున్నాయి. ఆరు నెలల్లో విమానాల సంఖ్యను ఆరుకు పెంచుకోనున్నట్లు సంస్థ తెలిపింది.

హైదరాబాద్‌లో ఆక్స్‌ట్రియా ఇన్నోవేషన్ సెంటర్

హైదరాబాద్: అమెరికాలోని న్యూజెర్సీ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఐటీ సంస్థ ఆక్స్‌ట్రియా ఇంక్ తన తొమ్మిదో గ్లోబల్ ఇన్నోవేషన్ అండ్ కేపబిలిటీ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది. ఈ కేంద్రం ద్వారా లైఫ్ సైన్సెస్ రంగ కంపెనీలకు కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సేవలందించనున్నట్లు తెలిపింది. అంతర్జాతీయ ఫార్మా, లైఫ్ సైన్సెస్ కంపెనీలకు డేటా అనలిటిక్స్ అండ్ ఇన్‌సైట్స్ సేవలను ఆఫర్ చేయనుంది. ఇప్పటికే నోయిడా, పుణెలో కార్యకలాపాలు సాగిస్తున్న ఈ కంపెనీ తాజాగా హైదరాబాద్‌కూ విస్తరించింది. మన దేశంలో కంపెనీకి హైదరాబాద్ కార్యాలయమే అతిపెద్దది.

నియామకాల జోరు..



హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్‌లో మరిన్ని ఉద్యోగాలు
మ్యాన్‌పవర్ గ్రూప్

న్యూఢిల్లీ: ఈ ఏడాది జూన్ త్రైమాసికంలో భారత కంపెనీలు నియామకాల జోరు పెంచనున్నాయి. మంగళవారం విడుదలైన 'మ్యాన్‌పవర్ గ్రూప్ ఎంప్లాయ్‌మెంట్ ఔట్‌లుక్ సర్వే' ఈ విషయం తెలిపింది. ఈ త్రైమాసికంలో 36 శాతం భారత కంపెనీలు నియామకాలకు సిద్ధమవుతున్నాయి. ఇదే సమయంలో అమెరికాలో 34 శాతం కంపెనీలు, చైనాలో 34 శాతం కంపెనీలు నియామకాలకు సిద్ధమవుతున్నాయి. అంతర్జాతీయంగా చూస్తే ఇది 22 శాతం మాత్రమే. మొత్తం 42 దేశాలకు చెందిన 3,150 కంపెనీలను సర్వే చేసి మ్యాన్‌పవర్ గ్రూప్ ఎంప్లాయ్‌మెంట్ ఔట్‌లుక్ ఈ విషయం తెలిపింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఈ జూన్ త్రైమాసికంలో నియామకాలు ఆరు శాతం పెరగనున్నాయి. అయితే 2024 మార్చి త్రైమాసికంతో పోలిస్తే మాత్రం ఇది ఒక శాతం తక్కువ.

ఈ రంగాల్లోనే ఎక్కువ: వచ్చే జూన్ త్రైమాసికంలో హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ కంపెనీల్లో 44 శాతం, కమ్యూనికేషన్స్ సర్వీసెస్ కంపెనీలు 43 శాతం, ఐటీ కంపెనీల్లో 41 శాతం నియామకాల జోరు పెంచనున్నాయి. ఈ రంగాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు ఇందుకు కలిసి రానున్నాయి. ఎనర్జీ, యుటిలిటీ రంగాలకు చెందిన కంపెనీల్లో 20 శాతం కంపెనీలు మాత్రమే జూన్ త్రైమాసికంలో నియామకాలు పెంచుతామని తెలిపాయి.

కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కు భారీ ఆర్డర్

హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కి మరో భారీ ఆర్డర్ లభించింది. తెలంగాణ ప్రభుత్వ పురపాలక, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు చెందిన ప్రజారోగ్యం, మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ నుంచి రూ.1,163.03 కోట్ల విలువైన ఈ ఆర్డర్ లభించినట్లు వెల్లడించింది. ఈ కాంట్రాక్టులో భాగంగా కంపెనీ 'అమృత్ 2.0' పథకం కింద ఖమ్మం, నల్లగొండ జిల్లాలోని 26 పట్టణ ప్రాంతాల్లో నీటి సరఫరా ప్రాజెక్టులు, నాలుగు పట్టణ ప్రాంతాల్లో మురుగు నీటి ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తి చేయాలి.

హెచ్ఐఎల్ చేతికి టాప్‌లైన్ ఇండస్ట్రీస్

సీకే బిర్లా గ్రూప్ కంపెనీ హెచ్ఐఎల్.. పైప్స్ అండ్ ఫిట్టింగ్స్ మార్కెట్‌లో తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటోంది. ఇందుకోసం దేశ తూర్పు ప్రాంత పైప్స్ అండ్ ఫిట్టింగ్స్ మార్కెట్లో మంచి పట్టున్న క్రిస్టియా గ్రూప్‌నకు చెందిన నాలుగు అనుబంధ సంస్థలను రూ.265 కోట్లకు కొనుగోలు చేస్తోంది. దీంతో క్రిస్టియా నిర్వహణలోని టాప్‌లైన్ ఇండస్ట్రీస్, ఆదిత్య పాలిటెక్నిక్, ఆదిత్య ఇండస్ట్రీస్, సాయినాథ్ పాలిమర్స్ కంపెనీలు హెచ్ఐఎల్ చేతికి వస్తాయి.

డాక్టర్ రెడ్డీస్‌కు రూ.74 కోట్ల పన్ను నోటీసు

హైదరాబాద్: డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌కు జీఎస్‌టీ అధికారుల నుంచి రూ.74.22 కోట్ల పన్ను డిమాండ్ నోటీసు అందింది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ను తప్పుగా ఉపయోగించుకున్నారనే పేరుతో హైదరాబాద్‌లోని అడిషనల్ కమిషనర్ (సెంట్రల్ టాక్స్) ఈ డిమాండ్ నోటీసు జారీ చేసినట్టు కంపెనీ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. వడ్డీ, పెనాల్టీతో కలిసి జీఎస్‌టీ అధికారులు ఈ నోటీసు జారీ చేశారు. త్వరలోనే దీనిపై అప్పీల్ ఫైల్ చేస్తామని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది.

లిఖితా ఇన్‌ఫ్రాకు రూ.106 కోట్ల ఆర్డర్

లిఖిత ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కు ప్రభుత్వ రంగంలోని హెచ్‌పీసీఎల్ నుంచి రూ.106.12 కోట్ల విలువైన ఆర్డర్ లభించింది. ఈ ఆర్డర్ కింద హెచ్‌పీసీఎల్‌కు చెందిన హల్దియా-పనాగర్ పైప్‌లైన్ ప్రాజెక్టు కోసం స్టీల్ పైప్‌లైన్, దానికి సంబంధించిన పనులు 15 నెలల్లో పూర్తి చేయాలి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	66,260 ▼	60,740 ▼	79,500 ▲
ముంబై	65,566 ▼	60,059 ▼	72,675 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ		విజయవాడ	433
హైదరాబాద్	410	విశాఖపట్నం	450
13వ తేదీ		వరంగల్	412
చిత్తూరు	483		
గోదావరి	433		

డజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	114	గోదావరి	106
వరంగల్	114	విజయవాడ	106
కరీంనగర్	114	గుంటూరు	111
మహబూబ్‌నగర్	114	ఒంగోలు	111
కర్నూలు	114	చిత్తూరు	125
విశాఖపట్నం	103		

స్వల్ప లాభాలతో సరి

సెన్సెక్స్ 165 పాయింట్లు అప్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం తీవ్ర ఒడుదుడుకులకు లోనైనప్పటికీ, స్వల్ప లాభాలతో ముగింపు పలికాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి దిగ్గజ షేర్ల కొనుగోళ్లు సూచీలను ముందుకు నడిపించాయి. సెన్సెక్స్ ఒక దశలో 501 పాయింట్లు ఎగబాకి 74,000 ఎగువకు చేరుకున్నప్పటికీ, చివర్లో 165.32 పాయింట్ల లాభంతో 73,667.96 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కేవలం 3.05 పాయింట్ల వృద్ధితో 22,335.70 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 22 నష్టపోగా.. ఎస్‌బీఐ 1.82 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది.

చిన్న షేర్లలో పోటెత్తిన అమ్మకాలు: చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లలో మాత్రం అమ్మకాలు పోటెత్తాయి. దాంతో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 2.11 శాతం పతనమవగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.31 శాతం నష్టపోయింది. అంతేకాదు, బీఎస్ఈలోని ఎస్ఎంఈ ఐపీఓ ఇండెక్స్ మరో 4.67 శాతం క్షీణించింది. చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లలో బుడగ ఏర్పడుతోందని, ఈ విభాగ షేర్ల ధరల్లో అవకతవకలు సైతం చోటు చేసుకుంటున్నాయన్న సంకేతాలున్నాయని సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ మంగళవారం ఓ సదస్సులో హెచ్చరించడం ఇందుకు కారణమైంది. రంగాలవారీ సూచీల్లోనూ ఐటీ మినహా అన్నీ నేలచూపులు చూశాయి. రియల్టీ ఏకంగా 3.53 శాతం నష్టపోగా.. ఇండస్ట్రియల్స్, కమోడిటీస్, సర్వీసెస్, యుటిలిటీస్, మెటల్ ఇండెక్స్‌లు ఒక శాతానికి పైగా తగ్గాయి. ఈ కారణంగా ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ మరో రూ.4.02 లక్షల కోట్లు తగ్గి రూ.385.64 లక్షల కోట్లకు (4.70 లక్షల కోట్ల డాలర్లు) పరిమితమైంది.



నిరాశపరిచిన ఆర్‌కే స్వామి షేర్ల లిస్టింగ్

ఇంటిగ్రేటెడ్ మార్కెటింగ్ సేవలందించే ఆర్‌కే స్వామి లిమిటెడ్ మంగళవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.288తో పోలిస్తే, ఎన్ఎస్ఈలో కంపెనీ షేరు 13.19 శాతం డిస్కౌంట్‌తో రూ.250 వద్ద లిస్టయింది. ఒక దశలో రూ.243 వద్దకు పతనమైన షేరు ధర.. తొలి రోజు ట్రేడింగ్ ముగిసేసరికి 8.79 శాతం నష్టంతో రూ.261 వద్ద స్థిరపడింది. గత వారం ముగిసిన ఆర్‌కే స్వామి ఐపీఓకు 25.78 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

కేఫిన్ టెక్‌లో వాటా తగ్గించుకున్న కోటక్ బ్యాంక్

మ్యూచువల్ ఫండ్లు, ఇతర ఆర్థిక సేవల సంస్థలకు బ్యాక్ ఎండ్ సేవలందించే కేఫిన్ టెక్నాలజీస్‌లో 2.03 శాతం వాటాను కోటక్ మహీంద్రా బ్యాంక్ రూ.208 కోట్లకు విక్రయించింది. దాంతో కంపెనీలో కోటక్ బ్యాంక్ వాటా 9.80 శాతం నుంచి 7.77 శాతానికి తగ్గింది.

ఐటీసీలో 3.5 % వాటా విక్రయించనున్న బీఏటీ

దేశీయ వ్యాపార దిగ్గజం ఐటీసీ లిమిటెడ్‌లో 3.5 శాతం వాటాను విక్రయించాలనుకుంటున్నట్లు బ్రిటన్‌కు చెందిన బహుళజాతి సంస్థ బ్రిటిష్ అమెరికన్ టొబాకో (బీఏటీ) పీఎల్‌సీ తెలిపింది. ఈ వాటాను సంస్థాగత ఇన్వెస్టర్లకు ఓపెన్ మార్కెట్లో బ్లాక్ డీల్స్ ద్వారా విక్రయించనుంది. ఐటీసీలో బీఏటీ అతిపెద్ద వాటాదారు. మంగళవారం ఐటీసీ షేరు రూ.404.25 వద్ద ముగిసింది. ఈ లెక్కన కంపెనీలో బీఏటీ విక్రయించాలనుకుంటున్న వాటా విలువ సుమారు రూ.17,659 కోట్లు. ప్రస్తుతం ఐటీసీలో బీఏటీ 29 శాతం వాటా కలిగి ఉంది. ప్రతిపాదిత వాటా విక్రయం తర్వాత 25.5 శాతానికి తగ్గనుంది.

ప్రీమియర్ ఎనర్జీస్ రూ.2,000 కోట్ల ఐపీఓ

హైదరాబాద్‌కు చెందిన సోలార్ మాడ్యూళ్ల తయారీ కంపెనీ ప్రీమియర్ ఎనర్జీస్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది. తద్వారా రూ.2,000 కోట్ల వరకు సమీకరించాలని భావిస్తోంది. క్రిసిల్ రేటింగ్ రిపోర్టు ప్రకారం.. గత ఏడాది డిసెంబరు 31 నాటికి ప్రీమియర్ ఎనర్జీస్ తన నిర్వహణ సామర్థ్యాన్ని 2.7 గిగావాట్ల మాడ్యూళ్లు, 2 గిగావాట్ల సోలార్ సెల్స్ స్థాయికి విస్తరించింది. 2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ సామర్థ్యాన్ని 3 గిగావాట్ల సోలార్ సెల్స్, 3.7 గిగావాట్ల మాడ్యూళ్లకు పెంచుకోవాలనుకుంటోంది.



ఆర్‌సీబీ ప్లేఆఫ్స్‌కు..

ముంబైపై ఘన విజయం

ఎలిస్ పెర్రీకి ఆరు వికెట్లు
మహిళల ప్రీమియర్ లీగ్

నేటి మ్యాచ్
ఢిల్లీ x గుజరాత్
రాత్రి 7.30 గం. నుంచి

న్యూఢిల్లీ: డబ్ల్యూపీఎల్ చరిత్రలోనే పేసర్ ఎలిస్ పెర్రీ (6/15) బెస్ట్ బౌలింగ్‌ను నమోదు చేయడంతో పాటు బ్యాటింగ్ (40 నాటౌట్)లోనూ చెలరేగింది. దీంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు సగర్వంగా ప్లేఆఫ్స్‌లో ప్రవేశించింది. మంగళవారం ముంబై ఇండియన్స్‌తో చావోరేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో నెగ్గిన ఆర్‌సీబీ.. 8 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఓవర్‌కు రెండేసి వికెట్లతో చెలరేగిన పెర్రీ ధాటికి ముంబై బ్యాటర్లు చకచకా పెవిలియన్‌కు క్యూ కట్టారు. దీంతో 19 ఓవర్లలో ఆ జట్టు 113 పరుగులకే కుప్పకూలింది. సజన (30), హేలీ మాథ్యూస్ (26) మాత్రమే రాణించారు. ఏడుగురు బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఆ తర్వాత స్వల్ప ఛేదనలో ఆర్‌సీబీ 15 ఓవర్లలో 3 వికెట్లకు 115 పరుగులు చేసి నెగ్గింది. ఓపెనర్లు మంధాన (11), మోలినెక్స్ (9), డివైన్ (4) విఫలమైనా.. ఎలిస్ పెర్రీ (40 నాటౌట్) బ్యాట్‌తోనూ అదరగొట్టింది. రిచా ఘోష్ (36 నాటౌట్)తో కలిసి నాలుగో వికెట్‌కు 76 పరుగులు జోడించడం విశేషం.

ఎలిస్ అదుర్స్: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ముంబైని పేసర్ ఎలిస్ ఓ ఆటాడుకుంది. ఇన్నింగ్స్ ఆరంభంలో ఓపెనర్లు సజన, మాథ్యూస్ మెరుగ్గానే రాణించారు. ఆరో ఓవర్‌లో మాథ్యూస్‌ను డివైన్ అవుట్ చేసినా, పవర్‌ప్లేలో జట్టు 43 పరుగులతో పటిష్ఠంగానే కనిపించింది. కానీ ఆ తర్వాతే పెర్రీ షో ఆరంభమైంది. తన తొలి ఓవర్‌లో రెండు పరుగులే ఇవ్వగా.. అనంతరం వరుసగా వేసిన మూడు ఓవర్లలో సజన, హర్మన్ (0), కెర్ (2), అమన్‌జోత్ (4), వస్త్రాకర్ (6), సివర్ (10)ల పనిబట్టడంతో ముంబై చిగురుటాకులా వణికింది. ఇందులో నాలుగు బౌల్డ్, రెండు ఎల్బీలుండడం విశేషం. చివర్లో ప్రియాంక (19 నాటౌట్) ఆటతో స్కోరు వంద దాటింది.

సంక్షిప్త స్కోర్లు:
ముంబై: 19 ఓవర్లలో 113 ఆలౌట్ (సజన 30, మాథ్యూస్ 26; పెర్రీ 6/15) ;
బెంగళూరు: 15 ఓవర్లలో 115/3 (పెర్రీ 40 నాటౌట్, రిచా 36 నాటౌట్; మాథ్యూస్ 1/11)

సింధు ముందంజ

ప్రణయ్, శ్రీకాంత్, గాయత్రి జోడీకి నిరాశ

ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్స్





బర్మింగ్‌హామ్: భారత ఏస్ షట్లర్ పీవీ సింధు.. ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్స్ ప్రీక్వార్టర్స్‌కు చేరుకొంది. అయితే, వరల్డ్ నెం:8 హెచ్ఎస్ ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్, ఆకర్షి కశ్యప్‌తోపాటు గాయత్రి జోడీ తొలి రౌండ్‌లోనే ఓడి ఇంటిముఖం పట్టింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో వరల్డ్ నెం:11 సింధు 21-10తో మొదటి గేమ్ నెగ్గి ఆధిక్యంలో ఉన్నప్పుడు.. ప్రత్యర్థి యొవన్నీ లీ (జర్మనీ) మ్యాచ్ మధ్యలో రిటైరైంది. రెండో రౌండ్‌లో చిరకాల ప్రత్యర్థి, టాప్ సీడ్ అన్ సి యంగ్ (కొరియా)తో సింధు తలపడే అవకాశాలున్నాయి. గతంలో సింధు..అన్ సి యంగ్‌తో ఆడిన ఆరుసార్లలో ఒక్కసారి కూడా గెలవలేకపోవడం ఆందోళన కలిగించే అంశం. ఇక ఆకర్షి కశ్యప్ 16-21, 11-21తో పై యు పొ (చైనీస్ తైపీ) చేతిలో ఓడింది. డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి పుల్లెల 18-21, 12-21తో ఇండోనేసియా జంట అప్రియాని రహాను-సిటి ఫాడియా సిల్వ రమధంతి చేతిలో పరాజయం పాలైంది. తొలి గేమ్ ఆరంభంలో గాయత్రి ద్వయం 7-12తో వెనుకబడినా.. వరుసగా 5 పాయింట్లు సాధించి.. 12-12తో స్కోరు సమం చేసింది. ఆ తర్వాత ఆధిక్యం చేతులు మారుతూ 18-18తో మరోసారి సమమైంది. అయితే, వరుసగా మూడు పాయింట్లు స్కోరు చేసిన ఇండోనేసియా జోడీ గేమ్‌ను తమ ఖాతాలో వేసుకొంది. రెండో గేమ్‌లో ప్రత్యర్థి జోరు ముందు భారత ద్వయం నిలవలేక పోయింది.



పోరాటమే లేకుండా..

పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్ 21-14, 13-21, 13-21తో సు లి యంగ్ (చైనీస్ తైపీ) చేతిలో కంగుతిన్నాడు. తొలి గేమ్‌ను ప్రణయ్ సునాయాసంగా నెగ్గినా.. అదే జోరును కొనసాగించలేక పోయాడు. ఫ్రెంచ్ ఓపెన్ తర్వాత తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టడం ఇది వరుసగా రెండోసారి. మరో మ్యాచ్‌లో శ్రీకాంత్ 9-21, 9-21తో వరల్డ్ నెం:1 విక్టర్ అక్సెల్‌సెన్ (డెన్మార్క్) చేతిలో వరుస గేముల్లో చిత్తయ్యాడు. మొదటి గేమ్ ఆరంభంలో శ్రీకాంత్ పోటీ ఇచ్చే విధంగా కనిపించినా.. 5-7 స్కోరు వద్ద వరుసగా నాలుగు పాయింట్లు సాధించిన అక్సెల్‌సెన్ 11-5తో బ్రేక్‌కు వెళ్లారు. తిరిగి వచ్చిన తర్వాత మరింత దూకుడుగా ఆడి గేమ్‌ను సొంతం చేసుకొన్నాడు. రెండో గేమ్‌లో 4-11తో వెనుకబడిన శ్రీకాంత్.. ఏ దశలోనూ ప్రత్యర్థికి పోటీ ఇచ్చే విధంగా కనిపించలేదు. వీరిద్దరి ఓటమితో పురుషుల సింగిల్స్‌లో 2022 రన్నరప్ లక్ష్య సేన్, ప్రియాంశు రజావత్ మాత్రమే మిగిలారు. బుధవారం జరిగే తొలి రౌండ్ పోరులో మాగ్నస్ జొహాన్నెసెన్‌తో లక్ష్య తలపడనున్నాడు.

కోహ్లీకి చోటు కష్టమేనా?



టీ20 వరల్డ్‌కప్

న్యూఢిల్లీ: స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (36) లేకుండానే భారత జట్టు టీ20 ప్రపంచకప్‌లో పోటీ పడనుందా? జాతీయ సెలెక్టర్ల తీరు చూస్తుంటే..అవుననే అనిపిస్తోంది. మే మొదటి వారంలో అన్ని జట్లు తమ ప్రాథమిక ఆటగాళ్ల జాబితాలను ఐసీసీకి పంపాల్సి ఉంటుంది. జూన్ 2 నుంచి 29 వరకు కరీబియన్ దీవులు, అమెరికాలో జరిగే ఈ మెగా టోర్నీలో భారత జట్టు రోహిత్ నేతృత్వంలోనే ఆడనుందని బీసీసీఐ కార్యదర్శి జైషా ఇప్పటికే స్పష్టం చేశాడు. కానీ ఈ టీమ్‌లో విరాట్ కోహ్లీ ఉంటాడా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది. 2013లో చాంపియన్స్ ట్రోఫీ తర్వాత టీమిండియా ఒక్క ఐసీసీ ట్రోఫీ కూడా గెలవలేకపోయింది. ఈ నేపథ్యంలో సెలెక్టర్లు కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. కోహ్లీకి ఉద్వాసన కూడా ఇందులో భాగమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. టీ20 ఫార్మాట్‌లో విరాట్ ప్రదర్శనపై సెలెక్టర్లు సంతృప్తిగా లేరు. అలాగే విండీస్‌లో స్లో వికెట్ కోహ్లీ ఆటతీరుకు సరిపోదని, యువ ఆటగాళ్లకు అవకాశం ఇచ్చేందుకు స్వచ్ఛందంగా తప్పుకొనేలా అతడికి సర్దిచెప్పే బాధ్యతలను చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌కు అప్పజెప్పినట్టు సమాచారం. విరాట్ లేకుంటే మిడిలార్డర్‌లో సూర్యకుమార్, రింకూ సింగ్, తిలక్ వర్మ, దేవ్‌దత్ పడిక్కళ్‌లలో ఒకరిని బరిలోకి దించవచ్చు. కానీ ఐపీఎల్‌లో కోహ్లీ అంచనాలకు మించి రాణిస్తే మాత్రం సెలెక్టర్ల వైఖరిలో మార్పు వచ్చే అవకాశం లేకపోలేదు. ఏదేమైనా కోహ్లీపై వేటు అనేది చాలా సున్నితమైన వ్యవహారమని, తుది నిర్ణయాన్ని అజిత్ అగార్కర్‌కే వదిలేసినట్టు బోర్డు అధికారి ఒకరు పేర్కొన్నాడు. కాగా కోహ్లీ అంతర్జాతీయ టీ20 కెరీర్‌లో 117 మ్యాచ్‌లాడి 51.75 సగటుతో 4037 పరుగులు చేశాడు. వీటిలో ఒక సెంచరీ, 37 అర్ధ సెంచరీలున్నాయి. టీ20ల్లో అత్యధిక పరుగుల వీరులలో కోహ్లీ, రోహిత్ శర్మ (151 మ్యాచ్‌ల్లో 3974), బాబర్ ఆజమ్ (109 మ్యాచ్‌ల్లో 3698) తొలి మూడు స్థానాల్లో ఉన్నారు.

విదర్భ లక్ష్యం 538


ముషీర్ ఖాన్ (136)

• ప్రస్తుతం 10/0 • ముంబై 418 ఆలౌట్
• ముషీర్ సెంచరీ.. రాణించిన అయ్యర్

ముంబై: ముషీర్ ఖాన్ (136) శతకంతో.. విదర్భతో రంజీ ఫైనల్లో ముంబై ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. ఆటకు మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 141/2తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ముంబై 418 పరుగులకు ఆలౌటైంది. శ్రేయాస్ అయ్యర్ (95), రహానె (73), ములాని (50 నాటౌట్) రాణించారు. హర్ష్ దూబే 5 వికెట్లు పడగొట్టాడు. 119 రన్స్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలిపి ముంబై మొత్తం 538 పరుగుల భారీ లక్ష్యాన్ని విదర్భ ముందుంచింది. ఛేదన కోసం దిగిన విదర్భ ఆట చివరికి వికెట్ నష్టపోకుండా 10 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ముంబై 224 రన్స్ చేయగా.. విదర్భ 105 పరుగులకే కుప్పకూలింది. కాగా రంజీ ఫైనల్లో సెంచరీ చేసిన పిన్నవయసు ముంబై బ్యాటర్‌గా సచిన్ టెండూల్కర్ 29 ఏళ్ల రికార్డును 19 ఏళ్ల ముషీర్ అధిగమించాడు.

● భారత హాకీ ర్యాంకు కిందికి...

న్యూఢిల్లీ: ఎఫ్ఐహెచ్ తాజా వరల్డ్ ర్యాంకింగ్స్‌లో భారత హాకీ జట్టు (2,761 పాయింట్లు) మూడు నుంచి నాలుగో స్థానానికి దిగజారింది. ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో అద్భుతంగా రాణించిన జర్మనీ జట్టు (2,786) మూడో స్థానానికి ఎగబాకింది. నెదర్లాండ్స్ (3,060) టాప్‌లో, బెల్జియం (2,848) రెండోస్థానంలో కొనసాగుతున్నాయి. మహిళల ర్యాంకింగ్స్‌లో భారత్ తొమ్మిదో స్థానంలో నిలిచింది. నెదర్లాండ్స్ అగ్రస్థానంలో నిలవగా, అర్జెంటీనా, జర్మనీ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

ఐపీఎల్‌కు పంత్ ఫిట్

పేసర్ ప్రసిద్ధ్ దూరం



న్యూఢిల్లీ: వికెట్ కీపర్ రిషభ్ పంత్ అభిమానులకు బీసీసీఐ శుభవార్త తెలిపింది. 14 నెలలుగా ఆటకు దూరంగా ఉన్న అతడు తిరిగి క్రికెట్ మైదానంలోకి అడుగు పెట్టనున్నాడు. 2022, డిసెంబరులో కారు ప్రమాదానికి గురైన పంత్ పూర్తిగా కోలుకున్నాడు. ఈమేరకు అతడికి బీసీసీఐ మెడికల్ టీమ్ క్లియరెన్స్ సర్టిఫికెట్ కూడా ఇచ్చింది. ప్రమాదంలో శరీరానికి అనేక చోట్ల గాయాలుకాగా.. పంత్ సుదీర్ఘ కాలంగా ఎన్‌సీఏ పునరావాస శిబిరంలో ఉండి కోలుకున్నాడు. 'రానున్న ఐపీఎల్‌లో పంత్ బ్యాటర్‌గానే కాకుండా వికెట్ కీపర్‌గానూ సేవలందించేందుకు ఫిట్‌గా ఉన్నాడు' అని బోర్డు పేర్కొంది. కాగా పేసర్లు ప్రసిద్ధ్ క్రిష్ణ (రాజస్థాన్), షమి (గుజరాత్) తమ గాయాలకు శస్త్ర చికిత్స చేయించుకుని కోలుకుంటుండడంతో ఐపీఎల్‌కు దూరం కానున్నారని బోర్డు తెలిపింది.

ఫెడరేషన్ చాంపియన్‌షిప్‌లో వినోద్‌కు స్వర్ణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ జూనియర్ ఫెడరేషన్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ అథ్లెట్ బి.వినోద్ కుమార్ స్వర్ణం సాధించాడు. లఖ్‌నవూలో జరిగిన ఈ పోటీల్లోని 800 మీటర్ల పరుగును వినోద్ ఒక నిమిషం 51 సెకన్లలో రేసును పూర్తి చేశాడు. గచ్చిబౌలి స్టేడియంలోని శాట్స్ అథ్లెటిక్ కేంద్రంలో వినోద్ శిక్షణ తీసుకుంటున్నాడు. గచ్చిబౌలి స్టేడియం అడ్మినిస్ట్రేటర్ వెంకటేశ్వరరావు, కోచ్ శ్రీనివాస్, వినోద్‌ను అభినందించారు.

అహ్మదాబాద్‌పై బెంగుళూరు గెలుపు



చెన్నై: ప్రైమ్ వాలీబాల్ లీగ్ సూపర్-5లో అహ్మదాబాద్ డిఫెండర్స్‌కు బెంగుళూరు టోర్పెడోస్ షాకిచ్చింది. మంగళవారం ఇక్కడ జరిగిన పోటీల్లో బెంగుళూరు 3-2తో అహ్మదాబాద్‌పై గెలిచింది. తొలి రెండు సెట్లలో 14-16, 7-15తో ఓడిన బెంగుళూరు, ఆ తర్వాత పుంజుకొని అహ్మదాబాద్‌కు చుక్కలు చూపించింది. అనంతరం 16-14, 15-9, 15-13తో వరుసగా మూడు సెట్లు గెలిచి, మ్యాచ్‌లో విజయం సాధించింది.

కారు దిగేస్తున్నారు!

(మొదటి పేజీ తరువాయి)



సమాచారం. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డిని మళ్లీ పోటీ చేయించాలని బీఆర్‌ఎస్ అధిష్ఠానం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆయన దానిని సున్నితంగా తిరస్కరించారు. తాను ఈసారి లోక్‌సభకు పోటీ చేయబోనని ప్రకటించారు. సిటింగ్ ఎంపీనే పార్టీ టికెట్ వద్దనడం ఏమిటి? ఎందుకు వద్దన్నారు? ఆయన బీఆర్‌ఎస్‌ను వీడనున్నారా? అనే ప్రశ్నలతో ఆ పార్టీ నేతలు జుత్తు పీక్కుంటున్నారు. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కుమారుడు గుత్తా అమిత్ రెడ్డి తీరూ సందేహాలకు తావిస్తోంది. తనకు బీఆర్‌ఎస్ నల్లగొండ లోక్‌సభ టికెట్ ఇస్తే పోటీ చేస్తానంటూ ఇది వరకే ఆయన ప్రకటించారు. ఆయనే ఇటీవల ఆశ్చర్యంగా తాను పోటీ చేయలేనంటూ చెప్పేశారు. ఈ క్రమంలో ఆయన, సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో భేటీ అయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి నుంచి అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. అమిత్, మంత్రి కోమటిరెడ్డినీ కలిశారు. పైగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సోమవారం నిర్వహించిన సమావేశానికి అమిత్ గైర్హాజరయ్యారు. ఈ పరిణామాలు నల్లగొండ బీఆర్‌ఎస్ శిబిరంలో చర్చనీయాంశంగా మారాయి.

కొత్తగా కడియం, దానం?

బీఆర్‌ఎస్‌కు చెందిన కీలక నేత, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్‌ఎస్‌ను వీడి, కాంగ్రెస్‌లో చేరే అవకాశాలున్నాయంటూ వార్తలొస్తున్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో బీఆర్‌ఎస్‌కు కడియం ఎంతో కావాల్సిన నేత. అసెంబ్లీలో ఆ పార్టీ తరఫున కేటీఆర్, హరీశ్‌రావు మాట్లాడినా... వారంతా కుటుంబ నేతలని కాంగ్రెస్, బీజేపీ విమర్శిస్తున్నాయి. ఈ విమర్శలను తిప్పికొడుతున్నట్లుగా సభలో అనుభవజ్ఞుడైన కడియం శ్రీహరిని ముందుకు తెచ్చి మాట్లాడిస్తోంది. మరి ఆయన పార్టీని వీడితే పరిస్థితి ఏమిటన్న ఆందోళన ఆ పార్టీలో ఉంది. కడియంతో ఇప్పటికే కాంగ్రెస్ నేతలు టచ్‌లోకి వచ్చారని తెలిసింది. వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి ఆయన్ను పోటీ చేయించాలని కాంగ్రెస్ భావిస్తోంది. 2016లో వరంగల్ ఎంపీగా గెలిచిన శ్రీహరికి జిల్లా వ్యాప్తంగా సత్సంబంధాలుండటంతో ఆయన్ను పార్టీలోకి చేర్చుకొని, పోటీ చేయిస్తే మంచి ఫలితం ఉంటుందని కాంగ్రెస్ భావిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ నుంచి కడియం గెలిస్తే.. ఆయనతో స్టేషన్‌ఘన్‌పూర్ అసెంబ్లీ స్థానానికి రాజీనామా చేయించి, ఉప ఎన్నికలో ఆయన కుమార్తె కడియం కావ్యకు టికెట్ ఇస్తామని ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. అయితే తన కుమార్తె కావ్యకే వరంగల్ లోక్‌సభ టికెట్ ఇవ్వాలంటూ కడియం ప్రతిపాదన పెట్టినట్లుగా తెలుస్తోంది. తాజాగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తీరూ అనుమానాలకు తావిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి దానం కితాబిచ్చారు. ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం రోజుకో శుభవార్త చెబుతోందంటూ మాట్లాడారు. ఆర్టీసీ ఉంటుందా? ప్రైవేటు పరం అవుతుందా? అనే ఆందోళనలో ఉన్న ఉద్యోగులపై కాంగ్రెస్ ప్రభుత్వం వరాల జల్లు కురిపిస్తోందని ప్రశంసించారు. ఆర్టీసీ ఉద్యోగులు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని, దీన్ని గుర్తించే కాంగ్రెస్ ప్రభుత్వం వారి పక్షపాతిగా వ్యవహరిస్తోందనీ వ్యాఖ్యానించారు. మరి.. ఆయన ఈ వ్యాఖ్యలు దేనికి సంకేతం? అన్న చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిజంగానే మెచ్చుకుంటున్నారా? లేదంటే పార్టీ మారే ఆలోచనతోనే పొగిడారా? అని చర్చించుకుంటున్నారు.

లోకం తీరు



డీఎస్సీకి ముందు టెట్ నిర్వహించండి

- లేకుంటే 7 లక్షల మంది అభ్యర్థులు నష్టపోతారు
- సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డీఎస్సీ నిర్వహణకు ముందు టెట్ నిర్వహించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. లేకుంటే 7లక్షల మందికి పైగా అభ్యర్థులు డీఎస్సీకి దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌కు మంగళవారం హరీశ్‌రావు లేఖ రాశారు. గతేడాది సెప్టెంబర్‌లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం టెట్ నిర్వహించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక టెట్ నిర్వహించని కారణంగా ఈ పరీక్ష కోసం 7లక్షల మందికిపైగా అభ్యర్థులు ఎదురు చూస్తున్నారని ఆయన లేఖలో పేర్కొన్నారు. గత డిసెంబర్‌లో డీఎడ్, బీఎడ్ కోర్సులు పూర్తి చేసుకున్న వారు 50వేల మందికి పైగా ఉంటారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకం కోసం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో టెట్‌లో ఉత్తీర్ణత సాధించి, డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవాలన్న ఆశతో అభ్యర్థులు ఉన్నారని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని డీఎస్సీతోపాటు టెట్ నిర్వహించి నిరుద్యోగుల అవకాశాలు దెబ్బతినకుండా చూడాలని హరీశ్‌రావు లేఖలో సీఎంను కోరారు.

పెట్టుబడులు తరలిపోతుంటే బాధగా ఉంది

- కేన్స్ సెమికాన్ కంపెనీ ఇక్కడే ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ఒప్పించాలి: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకొచ్చిన కంపెనీల పెట్టుబడులు మరోచోటకు తరలిపోతుంటే బాధగా ఉందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు అన్నారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకొచ్చేందుకు చేసిన కృషి వృధా అవుతోందన్నారు. సెమీ కండక్టర్ రంగంలో కీలకంగా భావిస్తున్న కేన్స్ సెమికాన్ సంస్థ తన పెట్టుబడులను తెలంగాణ నుంచి గుజరాత్‌కు తరలిస్తున్నట్లు వచ్చిన వార్తలపై మంగళవారం 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. ఇదే కంపెనీ గతంలో కర్ణాటక రాష్ట్రానికి వెళ్లేందుకు సిద్ధమైతే ఎన్నో ప్రయత్నాలు చేసి, ఇక్కడే పెట్టుబడులు పెట్టేలా ఒప్పించామన్నారు. ఆ కంపెనీ కొంగరకలాన్‌లో ఫాక్స్‌కాన్ పరిశ్రమకు దగ్గరగా భూమి కావాలని కోరితే కేవలం పది రోజుల్లో కేటాయించి, ఒప్పించామన్నారు. సెమీ కండక్టర్ పరిశ్రమ అత్యంత కీలకమైందని, కేన్స్ సెమికాన్ వస్తే ఈ రంగంలో తెలంగాణ పురోగతి సాధించే అవకాశం ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి తెలంగాణలో ఆ సంస్థ పెట్టుబడులు కొనసాగించేలా సంప్రదింపులు జరిపి ఒప్పించాలని కేటీఆర్ సూచించారు.

జూన్ 24న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్ష

- జూన్ 30న డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ గ్రేడ్-2 పరీక్ష

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమం, ఎస్సీ అభివృద్ధి శాఖ, బీసీ సంక్షేమం, మహిళా శిశు సంక్షేమ శాఖల్లో గ్రేడ్-1, గ్రేడ్-2 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షలకు సంబంధించిన తేదీలను టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. జూన్ 24న సీబీఆర్‌టీ (కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్) విధానంలో ఈ పరీక్ష ఉంటుందని కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. అలాగే వర్క్స్ అకౌంట్స్ శాఖలోని డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ గ్రేడ్-2 పరీక్ష జూన్ 30న సీబీఆర్‌టీ విధానంలో ఉంటుందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు వారం రోజుల ముందు అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

27 మంది ఇంటర్ విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసు

- భూపాలపల్లి జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

భూపాలపల్లి టౌన్/కాటారం, మార్చి 12: భూపాలపల్లి జిల్లాలో 27 మంది ఇంటర్ సెకండియర్ విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్ చేస్తూ మంగళవారం అధికారులకు పట్టుబడ్డారు. కాటారం మండల కేంద్రంలోని రెండు పరీక్షాకేంద్రాల్లో 24 మంది, భూపాలపల్లిలోని మైనారిటీ జూనియర్ కాలేజీలో ఇద్దరు, మహదేవపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఒకరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు దొరికారు. ఇందులో కాటారంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకులంలోని పరీక్ష కేంద్రంలో 15 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో తొమ్మిది మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ చేస్తూ పట్టుబడ్డారు. వీరిలో భౌతిక శాస్త్రం(ఫిజిక్స్) పరీక్ష రాస్తున్న వారు 13 మంది, అర్థశాస్త్రం(ఎకనమిక్స్) 10 మంది, వొకేషనల్ పరీక్ష రాస్తున్న వారు ఒకరున్నారు. మాల్ ప్రాక్టీస్ కింద బుక్కైన విద్యార్థులు చివరి పరీక్ష రాసే అవకాశం కోల్పోయారు. వీరంతా సప్లమెంటరీలో పరీక్షలు రాసుకోవచ్చు. కాగా, తాము ఎలాంటి తప్పు చేయకపోయినా మాల్‌ప్రాక్టీస్ చేశామని అధికారులు అంటున్నారని కొందరు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గణితానికి సంబంధించిన తడిచిన కాగితాలు దుస్తుల్లో దొరకడంతో తమపై అధికారులు చర్యలు తీసుకున్నారని కొందరు విద్యార్థులు వాపోయారు.

యాదాద్రిలో ధ్వజారోహణం, దేవతాహ్వానం

యాదాద్రి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన మంగళవారం ధ్వజారోహణం, దేవతాహ్వానం, భేరీపూజ నిర్వహించారు. స్వామివారి తిరుకల్యాణ వేడుకలకు ముక్కోటి దేవతలను, శ్రీమహావిష్ణువు వాహనమైన గరుత్మంతుడిని ఆవాహన చేసి ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. గరుత్మంతుడి చిత్రపటాన్ని శ్వేత ధ్వజ పతాకంపై చిత్రించి ధ్వజస్తంభంపైకి ఆరోహణ చేశారు. గరుత్మంతుడిని ఆహ్వానించడానికి గరుడ ముద్దలను నివేదించారు. బ్రహ్మోత్సవాలకు అష్ట దిక్పాలకులను, సకల దేవతలను ఆహ్వానించే భేరీపూజ, దేవతాహ్వానం కార్యక్రమాలను మంగళవారం సాయంత్రం నిర్వహించారు.వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈవో రామకృష్ణారావు పాల్గొన్నారు.

రూ.2000 కోట్ల అప్పు తీసుకున్న రాష్ట్రం

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2000 కోట్ల అప్పు తీసుకుంది. మంగళవారం భారత రిజర్వ్ బ్యాంక్ నిర్వహించిన ఈ-వేలం ద్వారా సెక్యూరిటీ బాండ్లను తనఖా పెట్టి రుణాన్ని సేకరించింది. రూ.1000 కోట్లను 7.37 శాతం వార్షిక వడ్డీతో 17 ఏళ్ల కాల పరిమితికి తీసుకోగా మిగిలిన రూ.1000 కోట్లను 7.36 శాతం వార్షిక వడ్డీతో 26 ఏళ్ల కాల పరిమితికి రాష్ట్ర ప్రభుత్వం రుణాన్ని సేకరించింది. తెలంగాణతో పాటు 14 రాష్ట్రాలు మొత్తం రూ.35,544 కోట్ల రుణాలు తీసుకున్నాయి.

యాదాద్రి అదనపు కలెక్టర్ సస్పెన్షన్ ఎత్తివేత

యాదాద్రి, హైదరాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు(రెవెన్యూ) కలెక్టర్ ఎ.భాస్కర్‌రావుపై ఉన్న సస్పెన్షన్‌ను ప్రభుత్వం ఎత్తివేసింది. ఈ మేరకు ఆయనను జిల్లా అదనపు కలెక్టర్‌గా పునరుద్ధరిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్లకు మించి ఒకేచోట పనిచేసిన విషయాన్ని పేర్కొనలేదని, బదిలీని తప్పించుకునేందుకు ప్రభుత్వానికి తప్పుడు సమాచారం ఇచ్చారని, ఎన్నికల సంఘం నిబంధనలు ఉల్లంఘించారని ఆయనపై ఈనెల 4న సస్పెన్షన్ పడిన విషయం విదితమే. భాస్కర్‌రావు తన సస్పెన్షన్‌ను వ్యతిరేకిస్తూ ఉద్యోగ కాల పరిమితి వివరాలను ప్రభుత్వానికి పంపారు. తనపై సస్పెన్షన్ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కోరారు. ఆయన అభ్యర్థనను పరిశీలించిన అనంతరం సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్ ఉత్తర్వులిచ్చారు.

రెండు పిల్లర్లు కుంగితే పెడబొబ్బలా!

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తామని.. ఇలా 420 హామీలు ఇచ్చారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి పండబెట్టి తొక్కుతా.. చీరుతా.. చంపుతా.. మానవబాంబును అవుతా అంటున్నాడని, ఇది ముఖ్యమంత్రి మాట్లాడే భాషేనా? అని ప్రశ్నించారు. ఉద్యమ సమయంలో సమైక్యాంధ్ర వాదులు తెలంగాణను అడ్డుకున్నప్పుడు చవట, సన్నాసి అని మాత్రమే మాట్లాడానని, ముఖ్యమంత్రిగా పదేళ్లలో ఇలాంటి దురుసు మాటలు మాట్లాడలేదని కేసీఆర్ చెప్పారు. తెలంగాణ వచ్చిన కొత్తలో కరెంటు కోత, నిధుల కొరత, ఆత్మహత్యలు, ఆకలిచావులు ఉండేవని, వాటిని పరిష్కరించకుండా ఆంధ్రావాళ్లు మోసం చేశారని ఎప్పుడైనా అన్నానా? అని కేసీఆర్ ప్రశ్నించారు. రేవంత్ లంకె బిందెల కోసం వచ్చినట్లు మాట్లాడమేంటని అన్నారు. మిషన్ భగీరథ పథకాన్ని అద్భుతంగా తీర్చిదిద్దామని, తండాలు, గూడేలకు నీళ్లు ఇచ్చామని, ఇప్పుడున్న ప్రభుత్వానికి కనీసం దాన్ని నడిపే తెలివి కూడా లేదని కేసీఆర్ తప్పుబట్టారు. 24 గంటల కరెంటు ఇచ్చామని, కరోనాతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కుదేలైనా రైతుబంధు ఇచ్చామని కేసీఆర్ గుర్తు చేశారు. చవటలు, దద్దమ్మలు కరెంటు సరిగా ఇవ్వలేక పోతున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు అన్నింటికీ ఎగనామం పెడతారని జోస్యం చెప్పారు. బండి సంజయ్ కానీ, ఇతర బీజేపీ ఎంపీలు కానీ రాష్ట్రానికి ఏమైనా తీసుకువచ్చారా? అని నిలదీశారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఒక ఎకరం పొలం ఎండిందా? అని రాష్ట్ర ప్రజలను ప్రశ్నించారు. దేశంలోనే ఎవరూ ఇవ్వని విధంగా రైతుబంధును రైతు బీమా పథకాన్ని అమలు చేశామని ప్రస్తావించారు. తమ హయాంలో పరిశ్రమలు, ఐటీ అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. స్థూల రాష్ట్ర ఉత్పత్తి, తలసరి ఆదాయం పెరిగాయని, ఓటేసే సమయంలో ఇవన్నీ ఆలోచించాలని కేసీఆర్ సూచించారు. కాంగ్రెస్ నాయకులు అబద్ధాలు ఆడుతూ తనపై ఏడుస్తున్నారని చెప్పారు. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగితే ఏమో జరిగినట్టు పెడబొబ్బలు పెడుతున్నారని ధ్వజమెత్తారు. ఒక పన్ను ఊడిపోతే పండ్లు అన్నీ ఊడగొట్టుకుంటామా? అని ప్రశ్నించారు. రెండు మూడు రోజుల్లో టీవీల ముందుకు వచ్చి కాళేశ్వరం ప్రాజెక్టు గురించి మొత్తం వివరిస్తానని కేసీఆర్ ప్రకటించారు. మిడ్ మానేరు, లోయర్ మానేరు డ్యాంలో గత ఏడాది ఈ సమయానికి నీళ్లు ఉన్నాయని, చెరువులు మత్తళ్లు దూకాయిని ప్రస్తావించారు. ఇప్పుడు కరెంటు కోతలతో రైతులు పొలాలను తగలబెట్టడం, పంటలో గొర్లు బర్లతో ఎందుకు మేపుతున్నారో ఆలోచన చేయాలన్నారు. ఎస్ఆర్ఎస్పీలో నీళ్లు లేకుంటే సింగూరు నుంచి నీళ్లు తెచ్చి పంటలు బతికించిన దమ్ము తమదని కేసీఆర్ చెప్పారు. తెలంగాణ బలంగా ఉండాలంటే బీఆర్ఎస్ ఉండాలని చెప్పారు. రాష్ట్రంలో పంటలు ఎండబెట్టే పరిస్థితి రావడం చూస్తుంటే తన కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయని కేసీఆర్ చెప్పారు. సమైక్య పాలన కంటే ప్రస్తుత కాంగ్రెస్ పాలన అధ్వాన్నంగా ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి సూట్ కేసులు పంపడంలో బిజీగా ఉన్నారని, బ్రహ్మాండంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి, మంత్రులు మూడు నెలల్లో తొమ్మిదిసార్లు ఢిల్లీకి పోయారని కేసీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని మరోసారి ఢిల్లీ గద్దల వద్ద తాకట్టు పెట్టి మన ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. ప్రజల పక్షాన బలంగా పార్లమెంటులో నిలబడే బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిములకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



కరీంనగర్‌లో నిర్వహించిన కదనభేరి సభలో ప్రసంగిస్తున్న కేసీఆర్

జాగ్రత్త బిడ్డా... కేసీఆర్ హెచ్చరిక

బీఆర్‌ఎస్ పని ఖతం అయ్యిందని కొన్ని చానళ్లలో దొంగ ప్రచారం చేస్తున్నారని, తాము కొత్తగా అధికారంలోకి వచ్చినప్పుడు కూడా ఇలాగే చేశారని, అప్పుడు ఏమయ్యిందో తెలుసని కేసీఆర్ అన్నారు. జాగ్రత్త బిడ్డా.. బేవర్స్ ప్రచారాలు బంద్ చేయండి అని హెచ్చరించారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వాళ్లను పోలీసులు బెదిరిస్తున్నారని ఆరోపించారు. తమ హయాంలో పోలీసులను ఉపయోగించి ఉంటే ఒక్క కాంగ్రెసోడు కూడా మిగిలే వాడు కాదన్నారు. తాము సంక్షేమం కోసం పని చేశామని చెప్పారు. పోలీసులు రాజకీయాలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు.

ఇది బీఆర్‌ఎస్ అంటగట్టిన కరువు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



హైదరాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ వచ్చింది.. కరువు వచ్చిందంటూ కేటీఆర్, హరీశ్‌రావు చేస్తోన్న వ్యాఖ్యలపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది బీఆర్‌ఎస్ అంటగట్టిన కరువు అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది చలికాలంలో అని, ఆ సమయంలో వర్షాలు పడవని బావ, బావమరుదులకు తెలియదా అని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలోనే కాళేశ్వరం దెబ్బ తిన్నదని, ఆ సమయంలోనే పది టీఎంసీల నీటిని కిందికి వదిలేశారని గుర్తు చేశారు. అవసరమైతే కర్ణాటకతో సంప్రదింపులు జరిపి నీటిని తెచ్చుకోవడానికి సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. కాగా, ముస్లిం మైనార్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వం 2004లో కల్పించిన 4 శాతం రిజర్వేషన్‌ను ఏ శక్తి రద్దు చేయలేదని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. రాష్ట్రంలో ముస్లిం రిజర్వేషన్‌ను రద్దు చేస్తామంటూ కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. బీజేపీ మత రాజకీయాలకు అమిత్ షా వ్యాఖ్యలు నిదర్శనమన్నారు. కాగా, లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని 13 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల ముఖ్యనేతలతో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ గాంధీ భవన్‌లో బుధవారం భేటీ కానున్నారు. మరోపక్క, రాష్ట్రంలోని మూడు ఎస్సీ రిజర్వుడు లోక్‌సభ నియోజకవర్గాల్లో రెండు సీట్లను మాదిగలకు కేటాయించాలని కోరుతూ పలువురు మాదిగల ప్రతినిధులు వినతి పత్రం ఇచ్చారు.

'జయ జయహే..' పాటలో మార్పులు!

- రాష్ట్ర చిహ్నం, విగ్రహం, గీతంలో మార్పులపై కేబినెట్ సబ్‌కమిటీ తొలి సమావేశం

హైదరాబాద్, మార్చి12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి విగ్రహం ఒక సామాన్య మహిళకు ప్రతిరూపంగా ఉండాలని సబ్ కమిటీ అభిప్రాయ పడింది. రాష్ట్ర చిహ్నం, రాష్ట్ర గీతం, తెలంగాణ తల్లి విగ్రహం ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించేలా ఉండాలని, రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టాలని అభిప్రాయపడింది. చిహ్నం, గీతం, విగ్రహంలో మార్పులపై ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ తొలి సమావేశం మంగళవారం సచివాలయంలో జరిగింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీలో మంత్రులు తుమ్మల, కోమటి రెడ్డి వెంకటరెడ్డి, సీతక్క, కొండా సురేఖ సభ్యులుగా ఉన్నారు. రాష్ట్ర గీతానికి సంబంధించి ప్రముఖ కవి అందెశ్రీని ఆహ్వానించి సమకాలీన పరిస్థితులను ప్రతిబింబించేలా 'జయ జయహే తెలంగాణ' పాటలో మార్పులు చేయించాలని కమిటీ అభిప్రాయపడింది. ప్రముఖ కళాకారులు, మేధావులను గుర్తించి రాష్ట్రచిహ్నం, విగ్రహంపై వివిధ నమూనాలతో కూడిన ప్రతిపాదనలు తీసుకోవాలని నిర్ణయించారు. ఫ్యూడలిజం, నిరంకుశత్వం, నియంతృత్వం వంటి వాటికి చిహ్నాల్లో స్థానం ఉండకూడదని భట్టి అన్నారు. రాష్ట్ర చిహ్నం, పాట, విగ్రహంలో రాష్ట్రాన్ని ప్రతిబింబించే అంశాలు ఉండాలని తుమ్మల సూచించారు. చిహ్నంపై నాగార్జున సాగర్ డ్యాం, ఇతర ముఖ్యమైన ఐకానిక్ చిత్రాలు ఉండాలని కోమటి రెడ్డి వెంకటరెడ్డి కోరారు. మెజారిటీ ప్రజల అభిప్రాయాలను స్వీకరించి, ఏ వర్గం ప్రజల మనోభావాలు దెబ్బతినకుండా రాష్ట్ర చిహ్నం రూపొందించాలని కొండా సురేఖ సూచించారు. రాష్ట్ర గీతంలో అన్ని జిల్లాల ప్రాతినిధ్యం ఉండేలా చూడాలని సూచించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు విలువలు ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రీడిజైన్ చేయాలని సీతక్క సూచించారు.

భక్తి శ్రద్ధలతోనే చిన్నపీటపై కూర్చున్నా!

- ఎవరికీ తలవంచేవాడిని కాను: భట్టి

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): 'నన్నెవరూ అవమానించలేదు. ఎవరో పక్కన కూర్చోమంటే కూర్చునేవాణ్ని కాను. ఎవరికీ తలవంచను' అని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క స్పష్టం చేశారు. యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో దళితుడైన భట్టికి అవమానం జరిగిందంటూ సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ట్రోల్స్‌పై ఆయన స్పందించారు. తానెవరికీ తలవంచనని, ఆత్మగౌరవాన్ని చంపుకోనని చెప్పారు. ఉప ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని శాసిస్తున్నానన్నారు. భక్తి శ్రద్ధలతో, లక్ష్మీ నర్సింహస్వామి ఆశీస్సుల కోసం కావాలనే చిన్న పీటపై కూర్చున్నానని తేల్చిచెప్పారు. సీఎల్పీ నేతగా ఆదిలాబాద్ నుంచి ఖమ్మం దాకా చేసిన పాదయాత్రలో యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్నానని, ఇందిరమ్మ రాజ్యం రావాలని ఆ రోజు మొక్కుకున్నానని, ఆ మొక్కులు తీర్చడం కోసమే గుడిలో అలా కూర్చోవాల్సి వచ్చిందని తెలిపారు. కానీ, కొందరు ఆ ఫొటోను తీసుకొని ట్రోల్స్ చేశారన్నారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, మేయర్ గద్వాల విజయలక్ష్మితో కలిసి సింగరేణి అతిథి గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సింగరేణిలో 1352 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. సంస్థలో బీసీ లైజనింగ్ అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. జైపూర్, రామగుండంలో 800 మెగావాట్ల చొప్పున సూపర్ క్రిటికల్ థర్మల్ కేంద్రాలను నిర్మించనున్నట్లు ప్రకటించారు. రామగుండంలో జెన్‌కో ప్లాంట్‌తో పాటు స్థలాన్ని సింగరేణికి అప్పగించే ప్రతిపాదనలపై చర్చించి, నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సంస్థలో ఉద్యోగాలకు ఉమ్మడి జిల్లాల స్థానికతను పరిగణనలోకి తీసుకుంటామని ప్రకటించారు. సింగరేణికి తాడిచర్ల-2 గని కేటాయించాలని కేంద్రాన్ని కోరగా.. సానుకూలంగా స్పందించిందన్నారు. అలాగే ఒడిసాలోని నైనీ బొగ్గు బ్లాకు పర్యావరణ అనుమతులతో పాటు ఇతరత్రా అనుమతులు సత్వరం ఇప్పించాలని కోరగా.. ఒడిసా ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు తెలిపారు. సింగరేణి లీజుకు తీసుకున్న ప్రభుత్వ భూముల్లో ఇళ్లు కట్టుకున్నవారికి ఆ భూములను క్రమబద్ధీకరించడానికి వీలుగా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. పేద పిల్లలు కోచింగ్ కోసం హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం లేకుండా, నియోజకవర్గాల్లోనే అంబేడ్కర్ నాలెడ్జి సెంటర్ ద్వారా అత్యున్నత అధ్యాపకులతో కోచింగ్ ఇప్పిస్తామని తెలిపారు. సింగరేణి విస్తరణ చర్యలు ముమ్మరం చేశామని, ఇందులో భాగంగానే బొగ్గుతో పాటు ఇతర రంగాల్లోకి వెళతామని సంస్థ సీఎండీ ఎన్.బలరాం చెప్పారు. తాడిచర్ల-2 గనిలో రూ.50 వేల కోట్ల విలువైన బొగ్గు నిల్వలున్నాయన్నారు.



సింగరేణి గెస్ట్ హౌస్ శంకుస్థాపన చేస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి, చిత్రంలో మంత్రి పొన్నం తదితరులు

మహాలక్ష్మితో లాభాలు: భట్టి

మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయడంతో నష్టాల్లో ఉన్న ఆర్టీసీ ప్రస్తుతం లాభాల్లోకి వెళ్లిందని, ఇది రాష్ట్రానికే గర్వకారణమని భట్టివిక్రమార్క చెప్పారు. మహిళల టికెట్ డబ్బును ప్రభుత్వం ఎప్పటికప్పుడు టీఎస్ ఆర్టీసీకి చెల్లిస్తోందన్నారు. మంగళవారం ఆయన ఎన్టీఆర్ మార్గ్ వద్ద మంత్రులు పొన్నం, కోమటిరెడ్డితో కలిసి గ్రీన్ మెట్రో ఎక్స్‌ప్రెస్ నాన్ ఏసీ ఎలక్ట్రిక్ సిటీ బస్సులను ప్రారంభించారు. ఆ బస్సుల్లోనే సచివాలయానికి చేరుకున్నారు. ఆర్టీసీ సిబ్బందికి 21 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించడంతో పాటు సంస్థ అభ్యున్నతికి ప్రభుత్వం సాయం అందిస్తోందని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం వల్ల టీఎస్ఆర్టీసీ కళకళలాడుతోందన్నారు. సంస్థ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. కష్టపడి పని చేస్తూ టీఎస్ఆర్టీసీకి దేశంలోనే మంచి పేరు తీసుకురావాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. సంస్థ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం కింద 25 కోట్ల మంది మహిళలు.. రూ.879 కోట్ల డబ్బు ఆదా చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వ సహకారంతో 2515 బస్సులను వినియోగంలోకి తీసుకురావడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు.

మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా శంభీపూర్ రాజు



హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు బీఆర్‌ఎస్ మరో స్థానానికి అభ్యర్థిని ప్రకటించింది. అతిపెద్ద లోక్‌సభ నియోజకవర్గమైన మల్కాజిగిరి నుంచి శంభీపూర్ రాజును అభ్యర్థిగా ఎంపిక చేసింది. ఈ మేరకు పార్టీ అధినేత మంగళవారం ప్రకటన చేశారు. కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన శంభీపూర్ రాజు.. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. తెలంగాణ ఉద్యమకాలం నుంచి బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్నారు. మాజీ మంత్రి కేటీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరుంది. కాగా, నాలుగు స్థానాలకు బీఆర్‌ఎస్ ఇంతకుముందే అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే.

జీవో 46ను రద్దు చేయాలి: ప్రవీణ్ కుమార్

హైదరాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగులకు తీరని అన్యాయం చేస్తున్న జీవో నంబరు 46ను తక్షణమే రద్దు చేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ జీవో ప్రకారం 2011 జనాభా దామాషా బట్టి పోలీసు, ఉపాధ్యాయ నియామకాలు చేపడుతున్నారు. దీంతో జనాభా ఎక్కువ ఉన్న హైదరాబాద్-రంగారెడ్డి జిల్లాలకే 53 శాతం పోస్టులు, మిగతా జిల్లాలన్నింటికీ కలిపి 47 శాతం పోస్టుల కేటాయింపు జరుగుతోంది. దీని వల్ల తమకు నష్టం జరుగుతోందని గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఉన్న ఖాళీలకు అనుగుణంగా గ్రూప్-1, 2, 3 పోస్టులను పెంచాలని, టెట్ నిర్వహించిన తరువాతే డీఎస్సీ నిర్వహించాలని ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే బీఎస్పీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు. పోలీసు నిర్బంధంలో మూడు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న నిరుద్యోగ నేత అశోక్‌కు ఆయన సంఘీభావం తెలిపారు.

మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు అరెస్టు

- సిరిసిల్లలో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- హైదరాబాద్‌కు తరలింపు.. ట్యాపింగ్‌పై విచారణ
- డీసీపీ పర్యవేక్షణలో విచారిస్తున్న బృందం!



సిరిసిల్ల క్రైం, హైదరాబాద్ సిటీ(ఆంధ్రజ్యోతి), మార్చి 12: స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ)లో విధుల దుర్వినియోగం, అనధికారిక ఫోన్ ట్యాపింగ్, కంప్యూటర్ హార్డ్‌డిస్కుల ధ్వంసం కేసులో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు అలియాస్ ప్రణీత్‌కుమార్ అరెస్టయ్యారు. కేసు దర్యాప్తు చేస్తున్న పంజాగుట్ట పోలీసులు మంగళవారం రాత్రి అతణ్ని రాజన్న-సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అదుపులోకి తీసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎస్ఐబీలో డీఎస్పీగా పనిచేసిన ప్రణీత్‌రావు అప్పట్లో విపక్ష నేతల ఫోన్లను ట్యాప్ చేశారనే అభియోగాలను ఎదుర్కొంటున్నారు. గత ఏడాది డిసెంబరు 4న (అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాతి రోజు) ప్రణీత్‌రావు కంప్యూటర్లు, హార్డ్‌డిస్క్‌లను కాల్చివేశారంటూ ఎస్ఐబీ అదనపు ఎస్పీ డి.రమేశ్ ఆదివారం పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఆ మేరకు పంజాగుట్ట పోలీసులు ప్రణీత్‌రావుపై ఐపీసీ, పీడీపీపీ, ఐటీ చట్టాల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రణీత్‌రావు సస్పెన్షన్‌కు ముందు రాజన్న-సిరిసిల్ల జిల్లా డీసీఆర్బీలో డీఎస్పీగా పనిచేశారు. సస్పెన్షన్ ఉత్తర్వుల్లోనే డీజీపీ రవిగుప్తా అతణ్ని సిరిసిల్ల జిల్లా హెడ్‌క్వార్టర్స్ దాటి వెళ్లకూడదని ఆదేశించారు. తొలుత ప్రణీత్‌రావు అజ్ఞాతంలోకి వెళ్లారనే వార్తలు వచ్చాయి. పంజాగుట్ట పోలీసుల బృందం సోమవారమే సిరిసిల్లకు చేరుకున్నా.. అతని జాడ దొరకలేదని సమాచారం. అయితే.. సిరిసిల్లలోని శ్రీనగర్‌కాలనీలో అతను అద్దెకు ఉంటున్న ఇంట్లో అరెస్టు చేసినట్లు పంజాగుట్ట పోలీసులు మంగళవారం రాత్రి ప్రకటించారు. అతణ్ని హైదరాబాద్‌కు తరలించారు. పంజాగుట్ట ఠాణాలో ప్రణీత్‌రావును ప్రాథమికంగా విచారిస్తున్నట్లు తెలిసింది. పశ్చిమ మండలం డీసీపీ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో ఈ విచారణ జరుగుతున్నట్లు సమాచారం. విపక్ష నేతల ఫోన్ ట్యాపింగ్‌కు ఆదేశాలు ఇచ్చిందెవరు? ఎస్ఐబీలో ఎవరి ప్రోద్బలం ఉంది? ఎవరి మెప్పు కోసం ఫోన్లను ట్యాప్ చేశారు? ఆ సమాచారాన్ని ఎవరికి అందజేశారు? ధ్వంసం చేసిన కంప్యూటర్లు, హార్డ్‌డిస్క్‌లలో ఏముంది? అనే కోణాల్లో విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రతి మహిళా సంఘానికీ కోటి రుణం

- గత పదేళ్లలో స్త్రీలను గౌరవించని బీఆర్ఎస్ సర్కారు
- మహిళాశక్తి సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- మహిళలకు గౌరవమిచ్చే పార్టీ కాంగ్రెస్: మంత్రి పొన్నం
- స్త్రీలు సంతోషంగా ఉంటే సమాజం బాగుంటుంది: సీతక్క

హైదరాబాద్ సిటీ, మార్చి12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి మహిళా సంఘానికీ వడ్డీ లేకుండా కోటి రూపాయల రుణాలను ఇప్పించబోతున్నామని మహిళా శక్తి సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో 64 లక్షల మంది స్వయం సహాయక సంఘం సభ్యులకు ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు ఇప్పించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 2023 డిసెంబర్7 నుంచి.. మహిళలు తీసుకున్న రుణాలకు వడ్డీ కట్టాల్సిన అవసరం లేదని, ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. వచ్చే ఐదేళ్ల మహిళల రుణాలకు ప్రభుత్వమే వడ్డీ కడుతుందని తెలిపారు. రుణం తీసుకున్న మహిళలు దురదృష్టవశాత్తూ మరణిస్తే ఆ రుణాల్ని ప్రభుత్వమే చెల్లించేందుకు రూ.5లక్షల బీమా కల్పిస్తున్నామన్నారు. పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలను గౌరవించలేదని మండిపడ్డారు. తాము స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇప్పించడమే కాక.. వ్యాపారం చేసుకోవడానికి, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు పెట్టించడానికి త్వరలో రాష్ట్రవ్యాప్తంగా పారిశ్రామిక పార్కులు తీసుకొస్తామని ప్రకటించారు. ఇక.. కాంగ్రెస్ పార్టీ అంటేనే మహిళలకు ప్రత్యేక గౌరవమిచ్చే పార్టీ అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. "గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క మహిళా మంత్రి కూడా లేకుండె. నేడు ఇద్దరు అక్కలు మంత్రులుగా ఉన్నారు" అని ఆయన పేర్కొన్నారు. మహిళలు ఇంట్లో ఆర్థికంగా సంతోషంగా ఉంటేనే ఆ ఇల్లుగానీ, సమాజంగానీ బాగుంటాయని మంత్రి సీతక్క అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆనాడు తీసుకొచ్చిన రిజర్వేషన్‌తో తాను ఎంపీపీగా ఎన్నికై, నేడు ఎమ్మెల్యే, మంత్రి అయ్యాయని కొండా సురేఖ తెలిపారు.

స్టాల్స్ సందర్శించిన సీఎం

మహిళలు స్వయం ఉపాధితో రాణిస్తున్న తీరును సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన స్వశక్తి మహిళా సదస్సులో పాల్గొన్న ఆయన.. సదస్సు ఆవరణలో మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులతో కలిసి సందర్శించారు. స్టాల్స్‌లోని ఉత్పత్తుల కోసం నిర్వాహకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కొందరు మహిళలు తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో.. ఆ ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించే ఏర్పాట్లు చేస్తామని వారికి సీఎం హామీ ఇచ్చారు.

హైదరాబాద్‌లో ప్రపంచ వరి సదస్సు

- అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో జూన్ 4 నుంచి 6 వరకు..
- 28 దేశాల నుంచి ప్రతినిధుల రాక
- రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల



హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వరి సదస్సుకు హైదరాబాద్ వేదిక కానుంది. అంతర్జాతీయ కమాడిటీస్ సంస్థ (కాలిఫోర్నియా), అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ (ఫిలిప్పైన్స్) సంయుక్తంగా రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో వచ్చే జూన్ 4 నుండి 6 వరకు ఈ సదస్సు నిర్వహించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ సదస్సును అంతర్జాతీయ కమాడిటీస్ సంస్థ గత 22 సంవత్సరాల నుంచి వివిధ దేశాల్లో నిర్వహిస్తోందని, మొదటిసారిగా భారతదేశంలో, అదీ తెలంగాణలో నిర్వహించడానికి ముందుకురావటం గొప్ప విషయమన్నారు. వరి సాగు, విత్తన రంగంలో రాష్ట్రంలో అనుకూల పరిస్థితులను గుర్తించి ఈసారి హైదరాబాద్‌ను వేదికగా ఎంచుకున్నట్లు తెలిపారు. 28 దేశాలకు చెందిన సుమారు 500 మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. పరిశోధకులు, విద్యా, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, ఎగుమతి-దిగుమతిదారులు, స్టార్టప్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఎగుమతి, దిగుమతిదారుల మధ్య ఒప్పందాలు కుదిరే అవకాశం ఉంటుందన్నారు. ఈ సదస్సు ద్వారా తెలంగాణలో ఉత్పత్తి అయ్యే వరి వంగడాలు, ఉత్పత్తులు ప్రపంచ దేశాలకు పరిచయం కావడంతో పాటు మార్కెట్లో డిమాండ్ వస్తుందన్నారు. వరి విత్తన సాగును పెంచి ఎగుమతులను ప్రోత్సహిస్తే వాణిజ్య పంటల కంటే మూడు, నాలుగు రెట్లు ఎక్కువ లభిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా బియ్యం ఎగుమతులు 1,77,86,092 టన్నులు (రూ.51,088 కోట్లు) ఉంటే తెలంగాణ రాష్ట్రం నుంచి 22,498 మెట్రిక్ టన్నులు (రూ.313.61 కోట్లు) మాత్రమే ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సన్నబియ్యం ఎగుమతులపై నిషేధం విధించటంతో రైతులకు మార్కెట్లో గిట్టుబాటు ధర రావటం లేదన్నారు. రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా కేంద్రం సరళమైన విధానం రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

ఎస్‌హెచ్‌జీ మహిళలకు ఉపాధి

- స్కూల్ యూనిఫామ్‌లు కుట్టే బాధ్యత వారికే..

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్‌లు కుట్టే బాధ్యతను రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా 63,44,985 జతల స్కూల్ యూనిఫామ్‌లు అవసరమని, వీటిని 45 రోజుల్లో సిద్ధం చేయాలన్నారు. ఎస్‌హెచ్‌జీ మహిళల్లో కుట్టుపని వచ్చిన 28,200 మందిని ఎంపిక చేసి ఈ యూనిఫామ్‌లు కుట్టే పని అప్పగించాలని తెలిపారు. వారికి ఉపాధి కల్పించేలా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని విభాగాలు, కార్పొరేషన్లకు అవసరమయ్యే వస్త్రాలు, యూనిఫామ్స్ క్లాత్‌ను 'టెస్కో' ఆధ్వర్యంలోనే కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. చేనేత కార్మికులకు జీవనోపాధి కల్పించటానికి, చేనేత రంగ అభివృద్ధికి ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రాథమిక, చేనేత సహకార సంఘాలు, చిన్నతరహా పవర్‌లూమ్స్ సంఘాల్లో తయారైన వస్త్రాలను తెలంగాణ రాష్ట్ర హ్యాండ్లూమ్ వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ (టెస్కో) ద్వారా సేకరిస్తామని తెలిపారు.

ఇక ప్రతి ఏటా 'విమోచన దినోత్సవం'

- నిర్వహించాలని కేంద్రం నిర్ణయం.. నోటిఫికేషన్ జారీ

న్యూఢిల్లీ, మార్చి 12: తెలంగాణ విమోచన దినోత్సవానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నిజాం పాలన నుంచి తెలంగాణకు విముక్తి లభించిన సెప్టెంబరు 17వ తేదీన ఇకపై ప్రతి ఏటా 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'గా జరుపుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. బ్రిటిష్ పాలకుల నుంచి భారత దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినా.. నిజాం పాలనలో ఉన్న హైదరాబాద్ ప్రాంతానికి స్వాతంత్ర్యం రాని విషయాన్ని, ఆ ప్రాంత ప్రజల పోరాటాల నేపథ్యంలో 1948 సెప్టెంబరు 17న 'ఆపరేషన్ పోలో' పేరిట నాటి కేంద్ర హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చేపట్టిన సైనిక చర్యతో నిజాం నవాబు దిగివచ్చిన విషయాన్ని ఈ నోటిఫికేషన్‌లో కేంద్రం పేర్కొంది. కాగా, కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కారు ఇప్పటికే కొన్నేళ్లుగా విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ కార్యక్రమానికి హాజరవుతూ వస్తున్నారు. నిజాం ఏలుబడిలో ఆనాడు రజాకార్లు సాగించిన అకృత్యాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పిస్తున్నారు.



రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) కోసం శ్రీనివాస్ రాసిన 'రణధీర సీతక్క' పుస్తకాన్ని సీఎం రేవంత్ రెడ్డి సచివాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. - హైదరాబాద్





పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన స్వశక్తి మహిళా సదస్సులో మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రి సీతక్క; సదస్సుకు హాజరైన మహిళలు

మోదీ, కేసీఆర్ మధ్య చీకటి ఒప్పందం

(మొదటిపేజీ తరువాయి)

సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన స్వశక్తి మహిళా సదస్సుకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రధాని మోదీపై, కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ సర్కారు జోలికి వస్తే కనుగుడ్లు పీకేస్తామని హెచ్చరించారు. ఆడబిడ్డలే కంచెవేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాపాడతారని అన్నారు. "కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పు నా నెత్తిన పెట్టాడు. సంసారం దివాళా తీయించాడు. రాష్ట్రాన్ని తాగుబోతుల సంసారం చేశాడు. అంతా ఆగమాగం చేసిండు. ఒక్కో చిక్కుముడి విప్పుకొంటూ వెళ్తున్నా. ఈ రోజు కేసీఆర్, కేటీఆర్, కవిత అంతా కలిసి రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్‌ను ఓడగొట్టాలంటున్నారు.. పడగొట్టాలంటున్నారు. ఏం పాపం చేశాను నేను? ఎవరిదైనా ఆస్తిని గుంజుకున్నానా? కేసీఆర్ ఫాంహౌస్‌ను ఏమైనా అడిగానా? కేసీఆర్ కుటుంబం దోచుకున్న దాంట్లో వాటా అడిగానా? కేటీఆర్‌కున్న జన్వాడ ఫాంహౌస్‌లో వాటా అడిగానా? మీకు పథకాలిస్తామన్నాం. ఇదేమైనా తప్పా? కేసీఆర్ సీఎంగా ఉన్నంతకాలం ఆయన బిడ్డను తప్ప.. ఎవరినైనా చూసిండా? బతుకమ్మ ఆడాలన్నా, ఎంపీ కావాలన్నా, ఎమ్మెల్సీ కావాలన్నా కవితనే కావాలి. ఆయన బిడ్డ ఆయనకెంత ముద్దో.. మా అక్కచెల్లెళ్లు మాకూ అంతే ముద్దు. రైతు కుటుంబం నుంచి వచ్చిన నేను సీఎం అయితే కేసీఆర్ ఓర్వలేకపోతుండు. దొరలే ఆ కుర్చీలో కూర్చోవాల్నా? రైతుబిడ్డ కూర్చోవద్దా? ప్రజలు ఓట్లేస్తే సీఎం అయ్యాను. మీరు గెలిపించిన కాంగ్రెస్‌ను పడగొడ్తమని ఫాంహౌస్‌లో చిందులేస్తున్నాడు. చూస్తూ ఊరుకోవాల్నా? అక్కలూ.. మీరే చెప్పండి. సలాకులు కాల్చి వాతలు పెట్టండి. ప్రభుత్వాన్ని పడగొడ్తననేటోళ్లు ఊర్లలోకి వస్తే తిరగేసి కొట్టండి. ఓటు అడగడానికి వస్తే చెయ్యి చాపమని చెప్పి వాతలు పెట్టండి" అని సీఎం అన్నారు.

పదేళ్లలో ఏం చేశారని మోదీకి ఓటేయాలి?

నరేంద్రమోదీ పదేళ్లుగా ప్రధానిగా ఉన్నారని, కానీ.. మన రైతాంగం పండించిన వరి, కందులు, మిర్చి, పసుపు.. దేనినీ కొనలేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.



సీఎం రేవంత్‌కు జ్ఞాపికను అందజేస్తున్న మహిళలు

పైగా.. రైతు వ్యతిరేక చట్టాన్ని తీసుకొచ్చారని మండిపడ్డారు. అదానీ, అంబానీ, అమెజాన్‌లకు దేశాన్ని, రైతులను తాకట్టు పెట్టారని ఆరోపించారు. లక్షలాది రైతులు ఢిల్లీలో ధర్నాలు చేస్తుంటే తుపాకీ తూటాలతో వారిని కాల్చి చంపారని ధ్వజమెత్తారు. ఈరోజు బీజేపీ వాళ్లు కూడా తమకు అవకాశామివ్వాలంటూ బయలుదేరారని, వారికి ఇంకోసారి ఎందుకు అవకాశమివ్వాలని ప్రశ్నించారు. ప్రధాని మోదీ 2022 నాటికి పేదలందరికీ ఇళ్లు ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. స్విస్ బ్యాంకులో ఉన్న నల్లధనాన్ని తీసుకువచ్చి పేదవాడి ఖాతాలో రూ.15 లక్షల చొప్పున వేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. అమిత్ షా తెలంగాణకు వచ్చి ఓట్లు అడుగుతున్నారని, పార్లమెంటులో తలుపులు మూసి సోనియాగాంధీ తెలంగాణను ఇచ్చారంటూ రాష్ట్ర ఏర్పాటును మోదీ అవహేళన చేశారని రేవంత్ అన్నారు. అటువంటి మోదీకి ఎందుకు ఓట్లేయాలని ప్రశ్నించారు. మోదీ, కేసీఆర్ చీకట్లో ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. అందుకే బీజేపీ, బీఆర్ఎస్.. ఒక పార్టీ అభ్యర్థులను ప్రకటించిన చోట మరో పార్టీ ప్రకటించలేదని తెలిపారు. అధికారం పోయినా కేసీఆర్‌కు ఇంకా సిగ్గు రాలేదని, ఆయనది వంకరబుద్ధి అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కంచె వేసి కాపాడేది ఆడబిడ్డలేనని చెప్పారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో 14 ఎంపీ స్థానాలను గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్‌ను నడుపుతున్నదే మహిళాశక్తి..

కాంగ్రెస్ పార్టీని నడుపుతున్నదే మహిళా శక్తి అని సీఎం రేవంత్ అన్నారు. "ఒక మహిళ నాయకత్వంలో మేము పని చేస్తున్నందుకు గర్వంగా భావిస్తున్నాం. పదేళ్లలో ఏ ఆడబిడ్డనూ కేసీఆర్ పట్టించుకోలేదు. మహిళలకు పావలా వడ్డీ రుణాలు ఇవ్వలేదు. సున్నా వడ్డీ రుణాల గురించి మాట్లాడలేదు. మహిళా సంఘాలను దివాళా తీయించాడు. ఆడబిడ్డల ఉసురు తగిలింది కాబట్టే ఆయన ఉద్యోగం పోయి ఫాంహౌస్‌కు పోయిండు. కాంగ్రెస్ అధికారంలో ఉందంటే అది మహిళల ఆశీర్వాదం వల్లే. మేం వచ్చిన వెంటనే ఆడబిడ్డల కోసం ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. ఈ 92 రోజుల్లో 25కోట్ల మంది మహిళలు ఉచితంగా బస్సులో ప్రయాణం చేశారు. ఉచిత ఆర్టీసీ ప్రయాణంపై కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్, కవిత కలిసి ఆటోడ్రైవర్లకు కిరాయిలిచ్చి ధర్నాలు చేయిస్తున్నారు. ఆడబిడ్డలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణాన్ని బంద్ చేయాలంటున్నారు. ఏం చేయాలో మీరే చెప్పండి! ఎవరైనా అడ్డం పడితే అదే ఆర్టీసీ బస్సు ఎక్కించైనా సరే ఆడబిడ్డలకు ఉచిత ప్రయాణం కల్పిస్తాం" అని రేవంత్ అన్నారు. ఆరోగ్యశ్రీని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువస్తే.. కేసీఆర్ నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ఇప్పుడు తాము దానిని రూ.10 లక్షలకు పెంచామన్నారు. రూ.400 గ్యాస్ సిలిండర్‌ను మోదీ, కేసీఆర్ కలిసి రూ.1200కు పెంచారని, ఆడబిడ్డల కోసమే తాము రూ.500కే ఇస్తున్నామని తెలిపారు. తాను పాదయాత్ర చేస్తున్నప్పుడు.. భూమి ఉన్నవారికే ఫ్రీ కరెంట్ ఇస్తున్నప్పుడు పేదవారికెందుకు ఇవ్వరని అడిగారని, అందుకే గృహజ్యోతి పథకాన్ని తీసుకువచ్చామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ఎన్నికల కంటే ముందే నిర్ణయించామని చెప్పారు. డబ్బా ఇళ్లు వద్దు.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తానని చెప్పి కేసీఆర్ మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తాం..

ఐదేళ్లలో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తామని సీఎం రేవంత్ అన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల్లో కోటి మంది చేరాలని పిలుపునిచ్చారు. అప్పుడే తెలంగాణ అభివృద్ధి చెందుతుందన్నారు. "పరేడ్ గ్రౌండ్‌లో లక్ష మందితో సభ నిర్వహించాలని చెబితే ఇక్కడకు వచ్చి మీ శక్తేంటో చూపించారు. మహిళల నైపుణ్యమేంటో నేను చూశాను. వారి కష్టాలేంటో నాకు తెలుసు. ఆడబిడ్డలు ఉత్పత్తి చేసే వస్తువులకు మార్కెటింగ్ అవసరం.. అందుకు వ్యాపార కేంద్రాలు అవసరం. అందుకోసం రాబోయే నెల రోజుల్లో శిల్పారామం పక్కన మహిళలు తమ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు ప్రత్యేకంగా వంద స్టాల్స్ ఏర్పాటు చేయిస్తాం. ఇందుకు అధికారులకు ఆదేశాలను ఇదే వేదికపై నుంచి ఇస్తున్నా. అంతర్జాతీయ స్థాయిలో ఉత్పత్తులను అమ్ముకునే విధంగా స్టాల్స్ ఉంటాయి. ఆ బాధ్యతను నేనే తీసుకుంటాను. రాబోయే రోజుల్లో పది లక్షల మంది ఆడబిడ్డలతో కవాతు చేస్తాం" అని సీఎం ప్రకటించారు. ఈ కార్యక్రమం అనంతరం మహిళా స్వయం సహాయక సంఘాలకు సీఎం చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు.

సీఎం చొక్కాపై హస్తం గుర్తు!

సీఎం రేవంత్‌రెడ్డి చొక్కాపై హస్తం గుర్తు బ్యాడ్జీని ఏఐసీసీ కార్యదర్శి, మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి పిన్ చేశారు. మహబూబ్‌నగర్‌లో పార్టీ చేపట్టిన ప్రచార దీక్షలో భాగంగా సీఎంను ఆయన నివాసంలో మంగళవారం కలిసిన వంశీచంద్‌రెడ్డి ఆ బ్యాడ్జీని పిన్ చేశారు.

'యాదాద్రి' విచారణ ఎఫెక్ట్

- అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బదిలీ

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంపై న్యాయ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఉపక్రమించిన నేపథ్యంలో.. ఆ కేంద్రం నిర్మాణ పనుల్లో కీలకంగా వ్యవహరించిన ఓ అధికారిపై బదిలీ వేటు పడింది. థర్మల్ విద్యుత్ కేంద్రం కోసం జరిగిన భూసేకరణలో భారీగా కుంభకోణం జరిగిందని, అందులో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ) జి.బుచ్చయ్య పాత్ర కూడా ఉందని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ప్లాంట్ కోసం అటవీ భూములను సేకరించి ఆ భూములకు పరిహారం చెల్లింపుల పేరిట భారీగా నిధులు వెనకేసుకున్నారని బుచ్చయ్యపై ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆయన్ను రామగుండానికి బదిలీ చేసి, ఆ స్థానంలో నవీన్‌కుమార్‌కు బాధ్యతలు ఇస్తూ మంగళవారం ట్రాన్స్‌కో సీజీఎం టి.రాజేంద్రప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

జీవో 317, 46లపై 14న వినతుల స్వీకరణ

- గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు.. అవసరమైతే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో భేటీ
- మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జీవో 317, జీవో 46 వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై లోతుగా అధ్యయనం చేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన మంత్రులు డి.శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉపసంఘం మంగళవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశమైంది. సదరు జీవోల వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి, జీవోల్లోని లోటుపాట్ల గురించి మంత్రులు ఈ సందర్భంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఘాల నుంచి ఈ నెల 14న సాయంత్రం వినతులు స్వీకరించాలని, అవసరమైతే జీవోల్లోని లోటుపాట్లను సరిదిద్దేందుకు ఆయా సంఘాలతో సమావేశం కావాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. నేరుగా హాజరు కాలేని ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం ఆన్‌లైన్ ద్వారా కూడా సమస్యలు వివరించే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ సర్వీసుల శాఖ సెక్రటరీ నోడల్ అధికారిగా వ్యవహరించాలని కమిటీ సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, పీఆర్‌సీ కమిటీ చైర్మన్ శివశంకర్, ప్రభుత్వ సర్వీసెస్ సెక్రటరీ నిర్మల, విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన, డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ శృతి ఓజాతోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రెండు జ్యుడీషియల్ కమిషన్లు

(మొదటిపేజీ తరువాయి)

పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ మీడియాకు వెల్లడించారు. బీఆర్ఎస్ సర్కారు నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అక్రమాలు జరిగాయంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవలి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దీనిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చి.. శ్వేతపత్రాన్ని ప్రవేశపెట్టారు. జ్యుడీషియల్ కమిషన్ వేసి, అవినీతిని బట్టబయలు చేస్తామంటూ అప్పట్లో సీఎం రేవంత్ ప్రకటించారు. తాజాగా కేబినెట్ సమావేశంలో ఈ అంశమై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి, భారత మాజీ లోక్‌పాల్, ఏపీ హైకోర్టు రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పినాకిని చంద్రఘోష్ చైర్మన్‌గా కమిషన్ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తు కొనుగోలు వ్యవహారంపై రిటైర్డ్ జడ్జి జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డిని నియమించారు. వీటితో పాటు వివిధ కుల వృత్తుల వారికి 16 కార్పొరేషన్ల ఏర్పాటుకు క్యాబినెట్ ఓకే చెప్పింది. మొదటి దశలో ఒక్కో నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. ఇకపై రేషన్ కార్డులు సరుకులు తీసుకునేందుకే ఉపయోగపడతాయని, వాటితో ఆరోగ్య శ్రీ, ఇతర పథకాలకు ఎలాంటి సంబంధం ఉండదని స్పష్టం చేసింది.

పార్టీలు చూడకుండా ఇందిరమ్మ ఇళ్లు..

ప్రజలు మెచ్చేలా పాలన అందించాలని నిర్ణయించామని.. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన అంశాలతో పాటు, అభయ హస్తం ఆరు గ్యారెంటీల్లో కొన్నింటిని మంత్రిమండలి సమావేశంలో ఆమోదించామని మంత్రి పొంగులేటి తెలిపారు. పైరవీలకు తావులేకుండా గ్రామాల వారీగా సభలు నిర్వహించి.. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. తొలి విడతలో రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇళ్లతో పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. వేలాది పేదలు తెల్ల రేషన్ కార్డులకు ఎదురుచూస్తున్నారని, అర్హులకు అతి త్వరలో ఇస్తామని ప్రకటించారు. ఆడ బిడ్డలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంలో భాగంగా మహిళా సంఘాలు ఉత్పత్తి చేసే వస్తువులకు బ్రాండింగ్ ఇచ్చి ఔటర్ చుట్టూ 25-30 ఎకరాల్లో మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తామన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఛత్తీస్‌గఢ్ నుంచి 1000 మెగావాట్ల విద్యుత్తును నామినేషన్ పద్ధతిన కొన్నారని.. వాడనప్పటికీ, దళారులతో కుమ్మక్కై డబ్బు చెల్లించారని ఆరోపించారు. గత పదేళ్లలో జరిగిన అవినీతి, అన్యాయాలపై ఏంచేయాలన్న అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించామని చెప్పారు. 84 శాతం రైతులకు రైతు బంధు ఇచ్చామని.. రెండు రోజుల్లో 93 శాతానికి పైగా ఇవ్వాలని నిర్ణయించామన్నారు.

బీసీల ఉన్నతికే కార్పొరేషన్లు: పొన్నం

బీసీలకు పరిస్థితులకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలని, వారి కుల వృత్తులకు సాంకేతికతను జోడించాలన్న ఉద్దేశంతో కులవృత్తులకు సంబంధించి కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని మంత్రి పొన్నం చెప్పారు. విధులు, నిధులను కల్పించడంతో పాటు ఆ కులాలకు న్యాయం చేయాలన్న ఆలోచనతో ఉన్నామని తెలిపారు. గత ప్రభుత్వం ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు ఇచ్చినా రూ.1000 కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. గీత కార్మికులు తాటి చెట్లు ఎక్కేందుకు సేఫ్టీ మోకును తీసుకొచ్చే ప్రతిపాదనపై చర్చించామన్నారు.

మహిళలను కోటీశ్వరులు చేస్తాం: శ్రీధర్‌బాబు

2008 డీఎస్సీలో అర్హత సాధించి, నియామకాలు పొందని అభ్యర్థులకు ఉద్యోగాలపై కసరత్తుతో పాటు కనీస వేతనాలను అమలు చేయనున్నామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణ మహిళా శక్తి పేరుతో కొత్త కార్యక్రమాన్ని చేపట్టబోతున్నామని ఐదేళ్లలో మహిళలను కోటీశ్వరులను చేయాలన్న ఆలోచనతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. ప్రైవేటు సంస్థలను కలుపుకొని మహిళా సంఘాల ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రమోట్ చేయాలని ఆలోచిస్తున్నామన్నారు. వేసవిలో మంచినీటికి ఇబ్బంది లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అప్రమత్తం చేస్తామని చెప్పారు. కులవృత్తుల కార్పొరేషన్లకు విధివిధానాల కోసం ఆయా కుల సంఘాలతో చర్చిస్తామని తెలిపారు.

అప్పులున్నా పథకాల ఆపం: కోమటిరెడ్డి

ఎన్నికల కోసం కాదు.. ప్రజలకు ఇచ్చిన మాటతో పథకాలను అమలు చేస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ఎన్ని అప్పులున్నా మాట నిలబెట్టుకుంటున్నామన్నారు. బావ బామ్మర్దులు(హరీశ్‌రావు, కేటీఆర్) నోరు జారకుండా గౌరవప్రదమైన ప్రతిపక్ష పాత్ర పోషించాలని సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సలహాలు ఇవ్వాలని.. నోటికి వచ్చినట్లు మాట్లాడడం తగదని పేర్కొన్నారు.

కేబినెట్ ఆమోదించిన కుల వృత్తుల కార్పొరేషన్లు
ముదిరాజ్, యాదవ, కురుమ, మున్నూరు కాపు, పద్మశాలి, పెరిక(పురగిరి క్షత్రియ), లింగాయత్, మేర, గంగపుత్ర


ఆర్థికంగా వెనుకబడిన తరగతుల (ఈబీసీ) వారికి..
ఈబీసీలకు ప్రత్యేక సంక్షేమ బోర్డు, ఆర్య వైశ్య, రెడ్డి, నగర, మాదిగ, మాదిగ ఉప కులాల, మాల, మాల ఉప కులాల కార్పొరేషన్లు

గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన మూడు ప్రత్యేక కార్పొరేషన్లు
తుకారాం ఆదివాసీ(కుమ్రం భీం), సంత్ సేవాలాల్ లంబాడా, ఎరుకుల (ఏకలవ్య)

మగువల ప్రయాణం మరింత భద్రం!

- 'టీ-సేఫ్' యాప్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- దేశంలోనే తొలిసారిగా తెలంగాణ పోలీసుల ప్రత్యేక సేవ

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మహిళల ప్రయాణ భద్రత పర్యవేక్షణకు ప్రత్యేకంగా రూపొందించిన 'టీ-సేఫ్(ట్రావెల్ సేఫ్)' యాప్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. తెలంగాణ పోలీసులు దేశంలోనే తొలిసారిగా మహిళల భద్రత కోసం ఈ సేవలను అందుబాటులోకి తెచ్చారు. టీ-సేఫ్‌ను తమ స్మార్ట్ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకున్న మహిళలు ప్రయాణంలో ఉన్నప్పుడు పోలీసులు ఆ ప్రయాణాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు. ఇందుకోసం యూజర్లు యాప్‌లో ఎప్పటికప్పుడు సేవను కోరుకోవాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా పోలీసులు నిర్దేశిత సమయాల్లో యూజర్లకు యాప్ ద్వారా సందేశాలు, ఫోన్ కాల్స్ చేస్తుంటారు. యూజర్ నుంచి తగిన రీతిలో స్పందన రాకపోతే పోలీసులు వెంటనే రంగంలోకి దిగుతారు. అలాగే, ఎవరైనా యూజర్ తాము ప్రమాదంలో ఉన్నామని భావిస్తే తక్షణ సాయం కోసం ఈ యాప్ ద్వారా తమ లైవ్ లొకేషన్‌ను పోలీసులకు పంపవచ్చు. సమీపంలో పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు అప్రమత్తమై వెంటనే సాయం అందిస్తారు. రాష్ట్రంలోని 791 ప్యాట్రోకార్లు, 1085 బ్లూకోల్ట్స్ వాహనాలకు ఈ యాప్‌ను ఇప్పటికే అనుసంధానించారు. ఆడపిల్లలు, మహిళలతోపాటు చిన్నారులకు కూడా ఈ యాప్ ఉపయోగకరంగా ఉంటుందని పోలీసు వర్గాలు వెల్లడించాయి. గూగుల్ ప్లేస్టోర్, యాపిల్ స్టోర్‌లో టీ-సేఫ్ యాప్ అందుబాటులో ఉందని పేర్కొన్నారు. స్మార్ట్ ఫోన్ లేనివారు కూడా టీ-సేఫ్ సేవలను ఉపయోగించుకోవచ్చు. ఫోన్ నుంచి డయల్ 100, లేదా 112కు డయల్ చేసి ఐవీఆర్ మెన్యూలో '8'వ ఆప్షన్ ఎంపిక చేసుకుంటే టీ-సేఫ్ సేవలు పొందవచ్చు. ఒంటరిగా ప్రయాణించే మహిళలు సురక్షితంగా గమ్యస్థానం చేరే వరకు పర్యవేక్షించేలా టీ-సేఫ్ సేవలను అందుబాటులోకి తెచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సచివాలయంలో జరిగిన టీ-సేఫ్ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతి కుమార్, డీజీపీ రవిగుప్తా తదితరులు పాల్గొన్నారు.



సీఏఏ దరఖాస్తులకు వెబ్‌సైట్

ప్రారంభించిన కేంద్ర హోంశాఖ.. త్వరలోనే మొబైల్ యాప్ కూడా

న్యూఢిల్లీ, మార్చి 12: పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)-2019 కింద భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులైన వారి కోసం కేంద్ర హోంశాఖ మంగళవారం ఒక వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. ఫోన్ల ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి వీలుగా సీఏఏ-2019 పేరుతో ఒక మొబైల్ యాప్‌ను కూడా త్వరలో అందుబాటులోకి తీసుకురానుంది. పాక్, అఫ్గాన్, బంగ్లాదేశ్ నుంచి.. 2014 డిసెంబరు 31కి ముందు ఇక్కడికి వలస వచ్చిన హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్శీలు, క్రైస్తవులు భారత పౌరసత్వం మంజూరు కోసం https://indiancitizenshiponline.nic.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. పాస్‌పోర్టు సైజు ఫొటోతో పాటు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దర్యాప్తు సంస్థలు బ్యాక్‌గ్రౌండ్ పరిశీలన పూర్తిచేసిన తర్వాత వాటిని ప్రాసెస్ చేస్తారు. నిర్దేశిత అధికారి నేతృత్వంలోని జిల్లా స్థాయి కమిటీ ద్వారా సాధికార కమిటీకి ఈ దరఖాస్తును సమర్పిస్తారు. ఈ చట్టం ఎలాంటి పత్రాలు లేనివారి కోసం ఉద్దేశించినందున, దరఖాస్తుదారులు అంతకుముందు తాము నివసించిన దేశాల్లో (పాక్, అఫ్గాన్, బంగ్లాదేశ్) అక్కడి ప్రభుత్వాలు జారీ చేసిన ఏవైనా పత్రాలను అప్‌లోడ్ చేయవచ్చు.

సమర్పించాల్సిన పత్రాలు

సీఏఏ నిబంధనల ప్రకారం.. దరఖాస్తుదారులు ఆయా దేశాల్లో తమకు ప్రస్తుతం ఉన్న పౌరసత్వాన్ని వదులుకోవడంతో పాటు భారతదేశాన్ని శాశ్వత చిరునామాగా అంగీకరిస్తూ డిక్లరేషన్ ఇవ్వాలి. విధేయతతో కూడిన ప్రమాణం కూడా చేయాల్సి ఉంటుంది. అలాగే వారు హిందూ, సిక్కు, జైన, బౌద్ధ, పార్శీ, క్రైస్తవ మతాలకు చెందినవారని, ప్రస్తుతం ఆయా మతాల్లోనే కొనసాగుతున్నారని ధ్రువీకరిస్తూ గుర్తింపు పొందిన ఏదైనా స్థానిక సంస్థ జారీ చేసిన అర్హత సర్టిఫికెట్‌ను సమర్పించాలి. వీటితో పాటు పౌరసత్వం కోసం ఈ కింది పత్రాల్లో ఏదైనా ఒకదాన్ని సమర్పించవచ్చు. పాక్, అఫ్గాన్, బంగ్లాదేశ్ ప్రభుత్వం జారీ చేసిన పాస్‌పోర్ట్, జనన ధ్రువీకరణ పత్రం/ ఏదైనా లైసెన్స్/ భూమి లేదా కౌలు రికార్డులు, స్టడీ సర్టిఫికెట్లు, అక్కడి ప్రభుత్వాలు మంజూరు చేసిన మరేదైనా గుర్తింపు పత్రంతో పాటు దరఖాస్తుదారుని తల్లిదండ్రులు లేదా తాతలు, ముత్తాతల్లో ఒకరు ఆయా దేశాలకు చెందినవారని నిరూపించే ఏదైనా పత్రం, దరఖాస్తుదారులు ఆయా దేశాల నుంచి వచ్చినట్లు నిర్ధారించేందుకు అక్కడి ప్రభుత్వాలు లేదా ప్రభుత్వ సంస్థలు జారీ చేసిన ఏ పత్రాన్నయినా ఆమోదిస్తారు. ఒకవేళ వాటి కాలపరిమితి దాటినా కూడా అవి చెల్లుబాటు అవుతాయని నిబంధనల్లో పేర్కొన్నారు.

భారత్‌లో స్థానికత నిరూపణకు....

దరఖాస్తుదారుడు 2014, డిసెంబరు 31 కంటే ముందే భారతదేశంలోకి ప్రవేశించినట్లుగా రుజువు చేసేందుకు ఈ పత్రాల్లో ఏదో ఒకదాన్ని సమర్పించాల్సి ఉంటుంది. భారత్‌కు వచ్చిన సమయంలోని వీసా కాపీ, ఇమిగ్రేషన్ స్టాంప్ కాపీలు, గ్రామీణ, పట్టణ సంస్థలకు ఎన్నికైన సభ్యులు లేదా రెవెన్యూ అధికారి జారీ చేసిన ధ్రువీకరణ పత్రం, భారత్‌లో జన గణన సమయంలో ఎన్యూమరేటర్లు జారీ చేసిన స్లిప్, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, స్కూల్ టీసీ, విద్యార్హత సర్టిఫికెట్లు, వ్యాపార లైసెన్స్‌ను సమర్పించాల్సి ఉంటుంది.

రెట్రోస్పెక్టివ్ విధానంలో పౌరసత్వం

పౌరసత్వ చట్టం-1955లోని సెక్షన్-6బీ కింద పౌరసత్వం పొందినవారిని దేశంలో ప్రవేశించిన తేదీ నుంచి భారత పౌరులుగా పరిగణించనున్నట్లు ఎంహెచ్ఏ వెబ్‌సైట్‌లో పేర్కొనడంపై కేంద్ర హోంశాఖ అధికారులు స్పందించారు. సీఏఏ కింద అర్హులైన వారికి చట్టంలో పేర్కొన్న ప్రకారం రెట్రోస్పెక్టివ్ విధానంలో పౌరసత్వం మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు.



సీఏఏ అమలుపై స్టే ఇవ్వండి

హైదరాబాద్/చెన్నై, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సీఏఏ అమలుపై స్టే మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం సుప్రీంకోర్టులో వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్)తో పాటు, డెమొక్రాటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డీవైఎఫ్ఐ)లు ఈ పిటిషన్లు వేశాయి. సీఏఏ-2019 రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై తీర్పు వెలువరించే వరకు ఈ నిబంధనల అమలును వాయిదా వేయాలని ఐయూఎంఎల్ తన పిటిషన్‌లో కోరింది. పౌరసత్వం కోసం ముస్లింలు కూడా దరఖాస్తు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరింది. సీఏఏ అమలుకు వ్యతిరేకంగా తాము మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని మజ్లిస్ అధ్యక్షుడు ఒవైసీ తెలిపారు. ఎన్నార్సీకి వ్యతిరేకంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే దారిలో నడవాలని ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా, సీఏఏను తమిళనాడులోని అధికార డీఎంకేతో సహా ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే, కమల్ హాసన్ మక్కల్ నీది మయ్యం, విజయ్ తమిళగ వెట్రి కళగం, వీసీకేతో పాటు మరికొన్ని పార్టీలు వ్యతిరేకించాయి.

రక్షణలో స్వావలంబన

దేశీయంగా రక్షణ పరికరాల తయారీ రెట్టింపు.. 'భారత్ శక్తి' విన్యాసాల్లో ప్రధాని వెల్లడి

- పోఖ్రాన్‌లో అబ్బురపరచిన 'స్వదేశీ' విన్యాసాలు
- రూ.85 వేల కోట్ల రైల్వే ప్రాజెక్టులకు మోదీ శ్రీకారం


పోఖ్రాన్‌లో సైనిక వాహనంలో తిరుగుతూ భారత్ శక్తి విన్యాసాలను తిలకిస్తున్న ప్రధాని మోదీ

పోఖ్రాన్, మార్చి 12: రక్షణ రంగంలో స్వావలంబన సాధిస్తున్నామని ప్రధాని మోదీ అన్నారు. గత పదేళ్లలో దేశీయంగా రక్షణ పరికరాల ఉత్పత్తి రెట్టింపుపైనే ఉందని.. వాటి విలువ రూ.లక్ష కోట్లు దాటేసిందని తెలిపారు. ఈ విజయ సాధనలో యువతదే కీలక పాత్రగా పేర్కొన్నారు. మంగళవారం రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో త్రివిధ దళాలు నిర్వహించిన 'భారత్ శక్తి' విన్యాసాల్లో ప్రధాని పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రక్షణ రంగంలో 150కిపైగా స్టార్టప్‌లు ఏర్పాటయ్యాయని.. సాయుధ బలగాలు రూ.1,800 కోట్ల విలువైన ఆర్డర్లు వాటికిచ్చి చేయూతనిస్తున్నాయని తెలిపారు. రక్షణ రంగంలో స్వావలంబన త్రివిధ బలగాల్లో విశ్వాసం నింపుతుందన్నారు. పోఖ్రాన్‌ను భారత ఆత్మనిర్భరత, విశ్వాసం, ఆత్మగౌరవం అనే త్రిమూర్తిత్వానికి ప్రతీకగా అభివర్ణించారు. తొలి అణు పరీక్ష ఇక్కడే జరిగిందని గుర్తుచేసుకున్నారు. పోఖ్రాన్ గగనతలాన యుద్ధవిమానాల గర్జన.. భూతలంపై సాయుధ జవాన్ల విన్యాసాలు 'నవ భారతా'నికి సంకేతమన్నారు.

స్వదేశీ విమానాలు, ఆయుధ సంపత్తి..

జైసల్మేర్‌కు వంద కిలోమీటర్ల దూరంలో పోఖ్రాన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ వద్ద 'భారత్ శక్తి' విన్యాసాలు జరిగాయి. మొదటిసారి పూర్తిస్థాయిలో స్వదేశీ తయారీ ఆయుధ సంపత్తి, యుద్ధవిమానాలు, క్షిపణులను ప్రయోగించారు. 50 నిమిషాలు జరిగిన ఈ విన్యాసాలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, త్రివిధ దళాధిపతులు, 30 మందికిపైగా విదేశీ ప్రతినిధులు, ఉన్నతాధికారులు తిలకించారు. టీ-90 (ఐఎం) యుద్ధట్యాంకులు, కే-9 వజ్ర, ధనుష్, సారంగ్ ఆర్టిలరీ గన్ వ్యవస్థలు, ఆకాశ్ ఆయుధ వ్యవస్థ, పినాక శాటిలైట్ సిస్టమ్, లాజిస్టిక్స్ డ్రోన్లు, రోబోటిక్ మూల్స్, ఏఎల్‌హెచ్, మానవ రహిత ఏరియల్ వాహనాలను వినియోగించారు. భారత నౌకాదళం నౌకావిధ్వంసక క్షిపణులు, అటానమస్ కార్గో ఏరియల్ వాహనాలను, గగనతల లక్ష్యాలను ఛేదించే ఆయుధ వ్యవస్థలను.. వైమానిక దళం తేలికపాటి తేజస్ యుద్ధవిమానాలు, లైట్ యుటిలిటీ హెలికాప్టర్లు, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లను ప్రదర్శించాయి. భారత యుద్ధసన్నద్ధతను చాటడం.. సమకాలీన, భావి సవాళ్లను స్వదేశీ పరిష్కారాలతో అధిగమించడం... భారత స్వదేశీ రక్షణ సామర్థ్యం, నైపుణ్యాలు, నవీన ఆవిష్కరణలను ప్రపంచానికి చూపడం ఈ విన్యాసాల పరమార్థమని రక్షణశాఖ తెలిపింది.

వారసత్వాన్ని రక్షించుకోవాలి...

సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోలేని దేశానికి.. భవిష్యత్ కూడా ఉండదని ప్రధాని మోదీ అన్నారు. దేశ వారసత్వం పరిరక్షణకు గత ప్రభుత్వాలకు రాజకీయ సంకల్పం లేకపోయిందని విమర్శించారు. 1930 మార్చి 12న మహాత్మాగాంధీ చేపట్టిన దండియాత్ర వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సబర్మతీలో రూ.1,200 కోట్లతో రూపకల్పన చేసిన గాంధీ ఆశ్రమ్ స్మారకం మాస్టర్‌ప్లాన్‌ను మోదీ ఆవిష్కరించారు. పునరుద్ధరించిన కోచరబ్ ఆశ్రమ్‌ను ప్రారంభించారు. ఇదిలా ఉండగా, పాము కాట్లతో సంభవిస్తున్న మరణాలను 2030కల్లా సగానికి తగ్గించటం కోసం కేంద్రం జాతీయ కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది. దేశంలో ఏటా పాముకాటుతో 50 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారు.

రైల్వే ట్రాక్‌పైనే నా జీవనం మొదలు

రైల్వే ట్రాక్‌పైనే తన జీవితం మొదలైందని.. అందుచేత గతంలో రైల్వేలు ఎలా ఉండేవో తనకు తెలుసని ప్రధాని మోదీ అన్నారు. మంగళవారం అహ్మదాబాద్ నుంచి దేశవ్యాప్తంగా రూ.85 వేల కోట్ల విలువ చేసే వివిధ రైల్వే ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. పది నూతన వందేభారత్ రైళ్లను మోదీ ప్రారంభించారు. గత ప్రభుత్వాల స్వార్థాలకు రైల్వే బలైందన్నారు.

కుప్పకూలిన తేజస్ యుద్ధవిమానం

వైమానిక దళానికి చెందిన తేజస్(ఎల్‌సీఏ) యుద్ధవిమానం రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో కుప్పకూలింది. 2001లో ఈ యుద్ధవిమానాన్ని తయారుచేసిన తర్వాత 23 ఏళ్లకు చోటు చేసుకున్న తొలి ప్రమాదం ఇది. ప్రమాదం నుంచి పైలెట్ సురక్షితంగా బయటపడ్డాడు. 2016లో ఈ తేలికపాటి యుద్ధ విమానాన్ని వైమానిక దళంలో ప్రవేశ పెట్టారు. జైసల్మేర్‌లో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ఓ విద్యార్థుల హాస్టల్‌పై తేజస్ కుప్పకూలింది. శిక్షణ సమయంలో ఈ ప్రమాదం జరిగిందని, దీనికి కారణం తెలుసుకొనేందుకు విచారణ(కోర్టు ఆఫ్ ఎంక్వయిరీ)కు ఆదేశించినట్లు 'ఎక్స్'లో వైమానిక దళం పేర్కొంది. నేలకూలిన తర్వాత తేజస్ మంటల్లో చిక్కుకుంది. రాజస్థాన్‌లో ప్రస్తుతం జరుగుతున్న యుద్ధ విన్యాసాల్లో ఈ యుద్ధవిమానం కూడా ఉందా... లేదా అన్న విషయంలో స్పష్టత లేదు.

నియంతృత్వంలో విశ్వగురు

- 2018 నాటికే ఎలక్టోరల్ అటోక్రసీ.. వీ-డెమ్ నివేదిక వెల్లడి

V-Dem VARIETIES OF DEMOCRACY

న్యూఢిల్లీ, మార్చి 12: నియంతృత్వం పరంగా భారత్ ప్రపంచ దేశాల్లో విశ్వగురు స్థానంలో ఉందని 'వెరైటీస్ ఆఫ్ డెమొక్రసీ' (వీ-డెమ్) తాజా నివేదిక వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా నియంతృత్వం కింద మగ్గుతున్న 280 కోట్ల మందిలో సగం జనాభా భారత్‌లోనే ఉందని పేర్కొంది. 2013 నుంచి భారత్‌లో ఏకస్వామ్యం పెద్ద ఎత్తున పెరిగిపోయిందని, 2018 నాటికి దేశం ఎలక్టోరల్ అటోక్రసీ (ఎన్నికలు జరిగే నియంతృత్వ దేశం) స్థాయికి పడిపోయిందని తెలిపింది. 'భారత్ అసలు ప్రజాస్వామ్య దేశంగానే లేదు' అని తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. భారత్‌తోపాటు మొత్తం 42 దేశాల్లో నియంతృత్వం ఉందని వీ-డెమ్ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా నియంతృత్వ ధోరణులు పెరిగిపోతున్నాయని, ఇటీవలి కాలంలో ఈ దిశగా అడుగులు వేసి అత్యంత దారుణంగా తయారైన దేశాల్లో భారత్ ఒకటని వెల్లడించింది. మొత్తం 179 దేశాల్లో ప్రజాస్వామ్యం పరిస్థితిని ఈ నివేదికలో సమీక్షించగా.. భారత్ 0.28 స్కోరుతో 104వ స్థానంలో నిలిచింది. కాగా, పాకిస్థాన్ 0.21 స్కోరుతో 119వ ర్యాంకులో ఉంది. స్వీడన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ గుథెన్‌బర్గ్ పొలిటికల్ సైన్స్ విభాగంలో ఏర్పాటైన వీ-డెమ్ ఇన్‌స్టిట్యూట్ ఏటా ప్రపంచ దేశాల్లో ప్రజాస్వామ్య పరిస్థితులపై నివేదికను విడుదల చేస్తోంది. అత్యంత నియంతృత్వ ప్రభుత్వాలున్న ప్రాంతాల్లో దక్షిణ, మధ్యాసియా రెండోస్థానంలో ఉంది. ఈ ప్రాంతంలోని 93 శాతం జనాభా భారత్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, కజకిస్థాన్ వంటి ఎలక్టోరల్ అటోక్రటిక్ (ఎన్నికలు జరిగే నియంతృత్వ) దేశాల్లో ఉంది.

మోదీ హయాంలో హక్కుల అణచివేత

భారత్‌లో 2008 నుంచే నియంతృత్వం దిశగా అడుగులు మొదలయ్యాయని పేర్కొన్న వీ-డెమ్... మీడియా స్వతంత్రతను హరించటం, సోషల్ మీడియాపై ఉక్కుపాదం, హక్కుల అణచివేత, ప్రభుత్వాన్ని విమర్శించే జర్నలిస్టులపై వేధింపులు మోదీ హయాంలో పెరిగిపోయాయని విమర్శించింది. గత ఐదేళ్లుగా ఇంటర్నెట్ షట్‌డౌన్ల రాజధానిగా భారత్ కొనసాగుతోందని వ్యాఖ్యానించింది. గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా సంభవించిన ఇంటర్నెట్ షట్‌డౌన్లలో 58 శాతం భారత్‌లోనే చోటు చేసుకున్నాయి.

మాల్దీవుల నుంచి భారత సైన్యం వెనక్కి

మాలె/బీజింగ్, మార్చి 12: మాల్దీవుల నుంచి సైన్యం ఉపసంహరణ ప్రక్రియను భారతదేశం ప్రారంభించింది. మాల్దీవుల్లో నిఘా విమానం విధులు నిర్వహిస్తున్న 25 మంది భారతీయ సైనికులు ఆదివారం స్వదేశానికి వెళ్లిపోయారని మాల్దీవుల పత్రిక మిహారు ప్రచురించింది. అయితే, దీనిపై ఇరుదేశాల నుంచి అధికారిక నిర్ధారణ ఏమీ వెలువడలేదు. చైనా అనుకూల వైఖరితో ఉన్న మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు.. మే 10లోగా భారత సైనికులు తమ దేశాన్ని వీడాలని ఆదేశించారు.

ఉచితంగా ఆధార్ అప్‌డేట్‌కు గడువు పెంపు

న్యూఢిల్లీ, మార్చి 12: ఆధార్ వివరాలను ఆన్‌లైన్‌లో ఉచితంగా అప్‌డేట్ చేసుకోవడానికి గడువును జూన్ 14 వరకు పొడిగిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. తొలుత ఈ గడువు మార్చి 14 వరకు ఉండగా, దాన్ని పొడిగించినట్టు తెలిపింది. 'మై ఆధార్' పోర్టల్‌లో ఉచితంగా వివరాలను నమోదు చేసుకోవచ్చని పేర్కొంది. అదే ఆధార్ కేంద్రాలకు వెళ్లి వివరాలను అప్‌డేట్ చేసుకోవాలంటే రూ.50 చెల్లించాల్సి ఉంటుంది.

గుజరాత్ తీరంలో రూ.480 కోట్ల డ్రగ్స్ సీజ్

న్యూఢిల్లీ, మార్చి 12: పెద్దమొత్తంలో మాదక ద్రవ్యాలతో భారత్‌లోకి ప్రవేశించబోయిన పాకిస్థాన్ బోటును గుజరాత్ తీరంలో అధికారులు పట్టుకున్నారు. అందులోని రూ.480 కోట్ల విలువైన డ్రగ్స్‌ను సీజ్ చేశారు. బోటులోని ఇద్దరు పాక్ సైనికులు సహా ఆరుగురు పాకిస్థానీయులను అరెస్టు చేశారు. ఎన్‌సీబీ, భారత కోస్ట్‌గార్డ్(ఐసీజీ), గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్(ఏటీఎస్) సంయుక్తంగా ఈ ఆపరేషన్‌ను నిర్వహించాయి.

హరియాణా సీఎంగా నాయబ్ సైనీ

ఖట్టర్ అనూహ్య రాజీనామా


నాయబ్ సైనీతో ప్రమాణం చేయిస్తున్న దత్తాత్రేయ

చండీగఢ్, మార్చి 12: ఉత్తరాది రాష్ట్రం హరియాణలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఒక్క రోజులోనే రాజకీయం మారిపోయింది. మనోహర్‌లాల్ ఖట్టర్ సీఎం పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో కురుక్షేత్ర నియోజకవర్గం ఎంపీ నాయబ్ సింగ్ సైనీ(54) సీఎంగా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సైనీ ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 90 అసెంబ్లీ స్థానాలున్న హరియాణలో 2019 అక్టోబరులో జరిగిన ఎన్నికల్లో బీజేపీ 41 సీట్లు గెలిచింది. సాధారణ మెజారిటీ(46)కి కొద్ది దూరంలో ఆగిపోయింది. దీంతో 10 సీట్లు నెగ్గిన దుష్యంత్ చౌతాలా నాయకత్వంలోని జననాయక్ జనతా పార్టీ (జేజేపీ)తో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దుష్యంత్‌కు డిప్యూటీ సీఎంగా, ఆయన పార్టీకి చెందిన ఇద్దరికి మంత్రులుగా అవకాశం ఇచ్చింది. అయితే, లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై రెండు పార్టీల మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వంలో భారీ మార్పులు ఉంటాయంటూ మంగళవారం ఉదయం ఊహాగానాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం ఖట్టర్ సహా 13 మంది మంత్రులు రాజీనామాలు చేసేశారు. వీటిని గవర్నర్ దత్తాత్రేయ ఆమోదించారు. కొద్దిసేపటికి బీజేపీ శాసనసభాపక్షం సమావేశమై సైనీని తమ నాయకుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. రాష్ట్రంలోని ఏడుగురు స్వతంత్ర ఎమ్మెల్యేల్లో ఆరుగురు బీజేపీ సర్కారుకు మద్దతు ప్రకటించారు. దీంతో జేజేపీ మద్దతు లేకుండానే మెజారిటీ చేకూరింది. మంగళవారం సాయంత్రమే సైనీతో గవర్నర్ దత్తాత్రేయ ప్రమాణం చేయించారు. ప్రతిపక్ష కాంగ్రెస్‌కు 30 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. హరియాణ అసెంబ్లీకి ఈ ఏడాది అక్టోబరులో ఎన్నికలు జరగాల్సి ఉంది. ఖట్టర్ 2014 నుంచి సీఎంగా కొనసాగారు. ఖట్టర్‌ను కర్నాల్ నుంచి ఎంపీగా బరిలో నిలిపే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఖట్టర్‌కు సన్నిహితుడు

నాయబ్‌సింగ్ సైనీ 1970 జనవరి 25న అంబాలా జిల్లా మిర్జాపూర్ మజ్రా గ్రామంలో జన్మించారు. 30 ఏళ్ల కింద బీజేపీలో చేరారు. ఆర్ఎస్ఎస్‌లో పనిచేసినప్పటి నుంచే ఖట్టర్‌కు సన్నిహితుడయ్యారు. నారాయణగఢ్ నియోజకవర్గం నుంచి 2014లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఖట్టర్ మంత్రివర్గంలోనూ పనిచేశారు. గత అక్టోబరులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగానూ నియమితులయ్యారు. హరియాణ జనాభాలో నాయబ్‌సింగ్ సామాజికవర్గమైన సైనీలు 8% ఉంటారు. రాష్ట్రంలో బలమైన జాట్‌లు కాంగ్రెస్, జేజేపీ, ఐఎన్ఎల్‌డీకి మద్దతుగా నిలుస్తుండడంతో.. ఓబీసీలు, ఇతర వర్గాలను ఆకర్షించేందుకు సైనీని బీజేపీ రాష్ట్ర చీఫ్‌గా నియమించింది. ఇప్పుడు ఏకంగా సీఎం బాధ్యతలు అప్పగించింది. కాగా, రాష్ట్రంలో పరిణామాల నేపథ్యంలో జేజేపీ నాయకత్వం తమ పదిమంది ఎమ్మెల్యేలను ఢిల్లీలో మంగళవారం భేటీకి పిలిచింది. ఐదుగురు ఎమ్మెల్యేలు దీనికి డుమ్మాకొట్టారు. ఈ నేపథ్యంలో పార్టీ చీలిపోతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. వీరంతా బీజేపీ వైపు వెళ్లే అవకాశం ఉంది.

వయసు నిర్ధరణకు ప్రామాణికం స్కూల్ సర్టిఫికెట్లే

- అవి లేనప్పుడే వైద్య పరీక్షలు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మార్చి 12: వయసు నిర్ధరణకు పాఠశాలలు ఇచ్చే ధ్రువపత్రాలనే ప్రామాణికంగా తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అవి ఇచ్చే జనన ధ్రువ పత్రాలకే విలువ ఎక్కువని తెలిపింది. అవేవీ లేనప్పుడు మాత్రమే చివరి అవకాశంగా వైద్యులు ఇచ్చే పత్రాలను పరిశీలించాల్సి ఉంటుందని తెలిపింది. 1982లో జరిగిన హత్య కేసులోని ముద్దాయి పెట్టుకున్న దరఖాస్తుపై విచారణ జరిపిన కోర్టు ఈ మేరకు తీర్పు వెలువరించింది. పాఠశాలలు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు ఇచ్చే డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌ను ప్రామాణికమైనవిగా చూడాలని, అవి అందుబాటులో లేనప్పుడు వైద్యులు ఇచ్చే ఆసిఫికేషన్ టెస్ట్ సర్టిఫికెట్‌ను పరిశీలించాలని తెలిపింది. 1982 సెప్టెంబరు 10న జరిగిన హత్య సంఘనలో ప్రస్తుత కేసు పిటిషనర్ వినోద్ కటారాతో పాటు మరో మగ్గురికి ట్రయల్ కోర్టు 1986లో యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. సుప్రీంకోర్టు కూడా ఈ శిక్షను సమర్థించింది. ప్రస్తుతం వారు మథుర జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. మరోవైపు శిక్షలు పడిన ముద్దాయిల్లో కొందరు నేరం జరిగిన సమయంలో మైనర్లుగా ఉన్నారేమో పరిశీలించాలని అలహాబాద్ హైకోర్టులో 'పిల్' దాఖలయింది. 2021లో దోషులను పరీక్షించిన మథుర జైలు మెడికల్ బోర్డు వినోద్ కటారా వయసు 2021 డిసెంబరు 10 నాటికి 56 ఏళ్లు ఉంటుందని నిర్ధరించింది. దీని ప్రకారం హత్య జరిగిన 1986 సెప్టెంబరు 10 నాటికి తన వయసు సుమారుగా 15 ఏళ్లు ఉంటుందని, అందువల్ల ఇంత శిక్ష విధించడం తగదని వినోద్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు వినోద్ వయసుపై నివేదిక ఇవ్వాలని ఆగ్రా అదనపు జిల్లా కోర్టు జడ్జిని 2022 సెప్టెంబరు 12న ఆదేశించింది. స్కూల్ సర్టిఫికెట్లతో పాటు పలు పత్రాలను పరిశీలించిన ఆ జడ్జి.. నేరం జరిగినప్పుడు వినోద్ మేజరేనని తేల్చారు. సుప్రీంకోర్టు కూడా దీన్ని సమర్థించింది.

అగ్రనేతల వారసులకు కాంగ్రెస్ టికెట్లు

న్యూఢిల్లీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల వారసులను బరిలోకి దించుతోంది. రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గహ్లోత్ కుమారుడు వైభవ్ గహ్లోత్‌ను జాలోర్ నుంచి, మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్‌నాథ్ తనయుడు నకుల్‌నాథ్‌ను ఛింద్వారా స్థానం నుంచి బరిలోకి దింపాలని నిర్ణయించింది. ఇక అసోం మాజీ సీఎం, దివంగత తరుణ్ గొగోయ్ కుమారుడు, ప్రస్తుతం లోక్‌సభలో కాంగ్రెస్ ఉపనేతగా ఉన్న గౌరవ్ గొగోయ్ జోర్హాట్ నుంచి పోటీ చేయనున్నారు. ఈ మేరకు ఐదు రాష్ట్రాల్లోని 43 స్థానాలకు అభ్యర్థులతో కాంగ్రెస్ రెండో జాబితాను మంగళవారం విడుదల చేసింది. ఇందులో అసోం, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్‌తోపాటు కేంద్ర పాలిత స్థానమైన డామన్ డయ్యూలోని స్థానాలున్నాయి. ఈ జాబితాలో తెలంగాణలోని ఏ స్థానానికి అభ్యర్థిని ప్రకటించలేదు. కాగా, మొత్తం 43 మంది అభ్యర్థుల్లో 10 మంది జనరల్, 13 మంది ఓబీసీ వర్గానికి చెందినవారు ఉండగా, ఎస్సీలు 10 మంది, ఎస్టీలు 9 మంది, ఒక ముస్లిం అభ్యర్థి ఉన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సోమవారం సమావేశమై.. ఈ అభ్యర్థులను ఖరారు చేసింది. ఈ జాబితాను పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మంగళవారం ప్రకటించారు. కాగా, రాజస్థాన్‌లోని చురు ఎంపీ రాహుల్ కస్వాన్ సోమవారం బీజేపీకి రాజీనామా చేసి ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా.. ఆయనకు వెంటనే టికెట్ దక్కింది. ఇక ఇప్పటికే కాంగ్రెస్ తొలి జాబితాలో వివిధ రాష్ట్రాల్లోని 39 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే.

దిగొచ్చిన ఎస్‌బీఐ

(మొదటి పేజీ తరువాయి)

తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రచురించాల్సి ఉంది. కాగా, ఎన్నికల బాండ్ల వివరాలను ఈసీకి సమర్పించాలంటూ ఫిబ్రవరి 15న తాము ఇచ్చిన తీర్పు అమలుపై అఫిడవిట్ దాఖలు చేయాలని ఎస్‌బీఐ చైర్మన్, ఎండీలను సుప్రీంకోర్టు సోమవారం విచారణ సందర్భంగా ఆదేశించిన సంగతి తెలిసిందే. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. వారి అఫిడవిట్లు సిద్ధమయ్యాయిగానీ, ఇంకా కోర్టుకు సమర్పించలేదు. మరోవైపు.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై 'ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్' కోరాలంటూ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ చీఫ్ ఆదీష్ సి అగర్వాలా... రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు మంగళవారం ఒక లేఖ రాశారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ అంశంపై మరోసారి విచారణ జరిపేదాకా తీర్పు అమల్లోకి రాకుండా చూడాలని అందులో కోరారు. వివిధ రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చిన కార్పొరేట్ల పేర్లను బయటపెట్టడం వల్ల ఆయా సంస్థలు ఇబ్బందిపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు తక్కువ విరాళాలిచ్చిన కంపెనీలను పార్టీలు చిన్నచూపు చూసి, హింసించే ప్రమాదం ఉందని.. తద్వారా విరాళాల రాక తగ్గిపోయే ముప్పుందని అంచనా వేశారు. సుప్రీం తీర్పు గతకాలానికి కూడా వర్తింపజేస్తూ సున్నితమైన సమాచారాన్ని విడుదల చేస్తే.. అంతర్జాతీయ సమాజంలో అది మన దేశ పరువును దెబ్బతీస్తుందన్నారు.

ఎన్నికల్లో ఫేక్ న్యూస్‌కు గూగుల్ బ్రేక్..!

న్యూఢిల్లీ, మార్చి 12: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లకు గూగుల్ తనవంతు సాంకేతిక సాయం అందించనుంది. ఎన్నికల సమయంలో తప్పుడు సమాచారం (ఫేక్ న్యూస్) వ్యాప్తి చెందకుండా నివారించడానికి, అధీకృత కంటెంట్‌ను ప్రోత్సహించడానికి, కృత్రిమ మేధ(ఏఐ) అందించే డేటాను ప్రజలకు చేరువచేయడానికి భారత ఎన్నికల కమిషన్‌తో గూగుల్ చేతులు కలిపింది. ఎన్నికలకు సంబంధించి వివిధ అంశాలపై అధికారిక సమాచారాన్ని అందించేలా తమ ఫీచర్లను రూపొందించినట్టు గూగుల్ ఇండియా మంగళవారం ప్రకటించింది. సోషల్ మీడియాలో కంటెంట్ క్రియేటర్లు ఎక్కువగా కృత్రిమ మేధను వినియోగిస్తున్నందున.. ఆ కంటెంట్‌లోని వాస్తవికతను గుర్తించడంలో ప్రజలకు సహాయపడేలా తాము కొన్ని చర్యలు చేపట్టినట్టు తెలిపింది. డీప్ ఫేక్, తప్పుదోవ పట్టించే కంటెంట్‌ల నుంచి తాము ఇప్పటికే ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించింది. త్వరలోనే యూట్యూబ్ కూడా కంటెంట్ క్రియేటర్లు తమ వాస్తవిక కంటెంట్‌ను ఎప్పుడు సృష్టించారో వెల్లడిస్తుందని తెలిపింది.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● బుధవారం 13 మార్చి 2024

భవిష్యత్తుకు బాటలు వేసే బోర్డు పరీక్షల్లో మొదటిది టెన్త్ ఎగ్జామ్. అన్ని పరీక్షల మాదిరిగానే ఇదీ ఒకటి. అయితే ఈ పరీక్ష కెరీర్‌ను నిర్దేశిస్తుంది, అందుకు అవకాశాలను మెరుగుపరుస్తుంది. అసలు పరీక్ష అంటేనే విద్యార్థుల్లో ఎంతో కొంత ఒత్తిడి ఉంటుంది. పేషెన్స్, కమిట్‌మెంట్‌తో ఒత్తిడిని అధిగమించాలి. బోర్డు ఏదైనప్పటికీ టెన్త్ పరీక్షలకు సంబంధించిన వ్యూహం ఈ విధంగా ఉంటే పర్ఫార్మెన్స్ మెరుగ్గా ఉంటుంది.

టెన్త్ సక్సెస్



పదిలో పదికి పదునైన వ్యూహం

పొమొడొరొ (పీఓఎంఓడీఓఆర్ఓ) టెక్నిక్

ఇదో టైమ్ మేనేజ్‌మెంట్ టెక్నిక్. ఇది బాగా పనిచేస్తుంది. ఉన్న సమయం, అవసరమైన వేగానికి మధ్య సమన్వయానికి తోడ్పడుతుంది. ఈ పద్ధతిలో అతి పెద్ద చాప్టర్‌ను చిన్న చిన్న ముక్కలుగా విభజించుకుని ప్రతి దానికి అర్ధ గంట నుంచి గంట సేపు సమయం కేటాయించుకోవాలి. మధ్యలో అయిదు - పది నిమిషాల బ్రేక్‌తో కనీసం రెండు సార్లయినా రిపీట్ చేసుకోవాలి. తదుపరి కనీసం అరగంట సేపు బ్రేక్ తీసుకోవాలి. అలా టైమ్ నిర్దేశించుకోగలిగితే అనుకున్న సమయంలోనే టాస్క్ పూర్తవుతుంది. అదే ముందుముందు మరింత ప్రొడక్టివ్‌గా రూపొందుతుంది. తద్వారా టైమ్ మేనేజ్‌మెంట్ స్కిల్స్ పెరుగుతాయి.

నెమొనిక్స్

సెల్ఫ్ నోట్స్‌లోని అందాన్ని గుర్తించాలి. సొంతంగా రూపొందించుకున్న నోట్స్ మైండ్‌కు కనెక్ట్ అవుతుంది. అంతకు మించి స్టోర్ అవుతుంది. మళ్ళీ జ్ఞాపకం చేసుకోవడం కూడా సులువు. ట్రిగ్నొమెట్రీ, జెనెటిక్స్, కార్బన్ అండ్ ఇట్స్ కాంపౌండ్స్ వంటి టాపిక్స్‌ను రివిజన్ చేసేందుకు కూడా ఈ టెక్నిక్ బాగా ఉపయోగపడుతుంది. డయాగ్రమ్స్, ఫ్లోచార్టులు/షార్ట్‌కట్స్, నెమోనిక్స్(గుర్తుంచుకునే విధంగా చదువుకునే విధానం)తో రూపొందించుకున్న సమాచారాన్ని మర్చిపోవడం కుదరదు. ఈ పద్ధతి విద్యార్థిలో భయాన్ని తగ్గిస్తుంది. అదే సమయంలో ప్రిపరేషన్‌కు సంబంధించి వేగం పెరుగుతుంది. ఉదాహరణకు ప్లీజ్ స్టాప్ కాలింగ్ మి ఎ కేర్‌లెస్ జీబ్రా(Please Stop Calling Me A Careless Zebra) పొటాషియం, సోడియం, కాల్షియం, మెగ్నీషియం, అల్యూమినియం, కార్బన్, జింక్ - ఇది కెమిస్ట్రీ రియాక్టివిటీ సిరీస్ ఆర్డర్. ఇదే గుర్తుంచుకునేందుకు ఏర్పాటు చేసుకున్న విధానం - నెమోనిక్స్. ఇలాంటి బండ గుర్తులను టీచర్లు కూడా చెబుతారు. కొందరు విద్యార్థులు తమకు తాము రూపొందించుకుంటారు. సులువుగా గుర్తుంచుకునేందుకు ఇంకా బాగా చెప్పాలంటే అస్సలు మర్చిపోకుండా ఉండేందుకు ఇలాంటి టెక్నిక్స్ ఉపయోగపడతాయి.

డెఫినెట్

'హ్యాంగింగ్ ఫ్రూట్స్'. చెట్టుకింద నిలబడి చేతికి అందిన పండ్లను తెంపుకోవడం. పరీక్ష సమీపిస్తున్న ఈ సమయంలో కచ్చితంగా, ఉజ్జాయింపుగా, వచ్చే అవకాశం అంటూ విడగొట్టుకుని స్టడీ చేయడం అన్నమాట. పరీక్షలు అంటే పుస్తకంలోని మొదటి నుంచి చివరి పేజీ వరకు అన్నింటిని నేర్చుకోవాల్సిన అవసరం ఉండదు. ఇక్కడ ఎగ్జామ్ బ్లూప్రింట్‌కు బదులు మార్కుల స్కీమ్‌లో కచ్చితత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఇది ఎలా పనిచేస్తుందంటే, మొదట చాప్టర్లు అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించాలి. వీటిలో ఎగ్జామినర్ల కంటిలో పడేవి కొన్ని ఉంటాయి. వాటి జాబితాను సిద్ధం చేసుకోవాలి. అలా ప్రశ్నలు తప్పకుండా అడిగే చాప్టర్లు ఏవీ అన్నది తెల్సుకోవాలి. ఉదాహరణకు కార్బన్ అండ్ ఇట్స్ కాంపౌండ్ - మళ్ళీ అందులో కెమికల్ ప్రాపర్టీస్ లేదా సోప్ యాక్షన్ మెకానిజం; ట్రయాంగిల్స్ - బీపీటీ/ థేలస్ థీరమ్ ప్రూఫ్, పైథాగరస్ థీరమ్ వంటివి తీసుకోవాలి.మార్కులకు వీలు కల్పించే చాప్టర్లు అన్నింటినీ ప్రతి సబ్జెక్టు నుంచి గుర్తించాలి. ఆపై కాన్ఫిడెన్స్ ఉన్న వాటితో ప్రిపరేషన్ మొదలుపెట్టుకోవాలి.

పాత ప్రశ్నపత్రాలు


కొన్ని టాపిక్స్ చాలా కష్టం అనిపిస్తాయి. ఒకపట్టాన కొరుకుడు పడవు. పైపెచ్చు వీటి నుంచి కనీసం ఇరవై నుంచి ఇరవై అయిదు మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. అప్పుడు ఏమి చేయాలి, ఆ మార్కులను ఎలా పొందాలి అన్నది ప్రశ్న. వరల్డ్ ఆఫ్ లివింగ్(సైన్స్), ఆల్జీబ్రా (మేథ్స్) చాలా మందికి కష్టం. ఇక్కడ స్కోర్ కోసం మొదట పాత ప్రశ్నపత్రాలను తిరగేయాలి. తద్వారా తరచూ అడుగుతున్న ప్రశ్నలను తెలుసుకోవాలి. వాటిని ప్రిపేరైతే చాలు, కష్టం అనిపించే టాపిక్స్‌లోనూ మంచి స్కోరింగ్‌కు అవకాశం ఉంటుంది.

బ్లండర్ నోట్స్

ప్రిపరేషన్‌లో ఎక్స్‌లెన్స్ కోసం ఇదో పద్ధతి. చేసిన తప్పులను ఒక దగ్గర రాయాలి. దీన్నే 'బ్లండర్ నోట్స్' అంటారు. చేసిన తప్పు, కరెక్ట్ చేసుకున్న విధం పరీక్షలో ఒక ప్రశ్నకు జవాబు రాస్తున్నప్పుడు గుర్తుకు వస్తే చాలు. ఆటోమేటిక్‌గా కరెక్ట్‌గా జవాబు రాయడానికి దోహదపడుతుంది. ఒక రకంగా ఇది ఎర్రర్ ఫ్రీ సొల్యూషన్. తప్పిదాల నుంచీ నేర్చుకోవడంగానూ చెప్పుకోవచ్చు. అసలు ఫన్ లేకుండా మార్కులు వస్తాయనుకోవడమే తప్పు. సమయాన్ని సరిగ్గా సద్వినియోగం చేసుకుంటే సరిపోతుంది. ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో చక్కగా గడపాలి. ఆ సమయంలో ఆనందంగా ఉండేలా చూసుకుంటే మరింత ఉత్సాహంగా ఉండగలుగుతారు. ఆరోగ్యంపై కూడా దృష్టిసారించాలి. అన్నింటికి ప్రాధాన్యం ఇస్తూ, చదువుకోవడంలో మమేకం కావాలి. అలా పరీక్షలు రాసేందుకు సన్నద్ధమైతే చాలు, మొత్తం ఎపిసోడ్ ఫలితాన్నిచ్చేదిగా మారుతుంది. సదా నేర్చుకోవడమే సరైన పద్ధతి.

- మానికా గౌతమ్

నోటిఫికేషన్స్



టీఎస్ పీఈసెట్

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(టీఎస్‌సీహెచ్ఈ)- 'తెలంగాణ స్టేట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్(టీఎస్ పీఈసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిని కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ నిర్వహిస్తోంది. ఈ టెస్ట్ ద్వారా రెండేళ్ల వ్యవధిగల బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ/ప్రైవేట్/అనుబంధ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: బీపీఈడీ కోర్సులో ప్రవేశానికి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 19 ఏళ్లు నిండి ఉండాలి.

- డీపీఈడీ కోర్సులో ప్రవేశానికి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 16 ఏళ్లు నిండి ఉండాలి.

టీఎస్ పీఈసెట్ వివరాలు: ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ ఉంటుంది. దీనికి 400 మార్కులు కేటాయించారు. పురుషులకు 100 మీటర్ల పరుగు, 800 మీటర్ల పరుగు, 6 కేజీల పుట్టింగ్ ద షాట్, లాంగ్ జంప్/హై జంప్; మహిళలకు 100 మీటర్ల పరుగు, 400 మీటర్ల పరుగు, 4 కేజీల పుట్టింగ్ ద షాట్, లాంగ్ జంప్/హై జంప్ ఉంటాయి. ఒక్కో ఈవెంట్‌కు 100 మార్కులు నిర్దేశించారు. రెండో పార్ట్‌లో స్కిల్ టెస్ట్ ఉంటుంది. బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నిస్, వాలీబాల్ క్రీడల్లో ఒకదానిలో అభ్యర్థి క్రీడానైపుణ్యాన్ని పరీక్షిస్తారు. దీనికి 100 మార్కులు ఉంటాయి. హార్ట్ సంబంధిత సమస్యలు ఉన్నవారు, గర్భిణులు ఈ టెస్ట్‌లలో పాల్గొనడానికి అనర్హులు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.900; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** మార్చి 14 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 15
- **ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, స్కిల్ టెస్ట్ తేదీలు:** జూన్ 10 నుంచి 13 వరకు
- **వెబ్‌సైట్:** pecet.tsche.ac.in

ఏపీ ఈఏపీ సెట్

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(ఏపీఎస్‌సీహెచ్ఈ)- ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీ ఈఏపీసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిని కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే) నిర్వహిస్తోంది. ఈ టెస్ట్‌ను 'ఇంజనీరింగ్'; 'అగ్రికల్చర్& ఫార్మసీ' స్ట్రీమ్‌లలో నిర్వహిస్తారు. వీటి ద్వారా ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, బీటెక్ (డెయిరీ టెక్నాలజీ/అగ్రికల్చర్ ఇంజనీరింగ్/ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ), బీఎస్సీ(అగ్రికల్చర్/హార్టికల్చర్), బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్సీ బీఫార్మసీ, ఫార్మాడీ, బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ(సీఏ&బీఎం) ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. అభ్యర్థులు సాధించిన ర్యాంక్ ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ ప్రొఫెషనల్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష సిలబస్, మోడల్ పేపర్‌ల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

అర్హత: కనీసం 45శాతం మార్కులతో మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఇంజనీరింగ్ డిప్లొమా/ఒకేషనల్ కోర్సు(ఇంజనీరింగ్, టెక్నాలజీ) పూర్తిచేసినవారు; ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సులకు అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 16 ఏళ్లు నిండి ఉండాలి. ఫార్మాడీ కోర్సుకు మాత్రం 17 ఏళ్లు నిండి ఉండాలి. బీటెక్ (డెయిరీ టెక్నాలజీ/అగ్రికల్చర్ ఇంజనీరింగ్/ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ), బీఎస్సీ(అగ్రికల్చర్) కోర్సుల్లో ప్రవేశానికి అభ్యర్థుల వయసు 17 నుంచి 22 ఏళ్ల మధ్య; బీఎస్సీ నర్సింగ్ కోర్సుకు 17 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.

ఏపీ ఈఏపీ సెట్ వివరాలు: దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇంజనీరింగ్ స్ట్రీమ్‌కు ఉద్దేశించిన పరీక్షలో మొత్తం 160 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మేథమెటిక్స్ నుంచి 80, ఫిజిక్స్ నుంచి 40, కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్‌లో కూడా 160 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. బోటనీ నుంచి 40, జువాలజీ నుంచి 40, ఫిజిక్స్ నుంచి 40, కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. ప్రశ్నలను ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఇస్తారు. ఈ టెస్ట్‌లో అర్హత పొందాలంటే కనీసం 25 శాతం మార్కులు రావాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; బీసీ అభ్యర్థులకు రూ.550; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **కరెక్షన్ విండో ఓపెన్:** మే 4 నుంచి 6 వరకు
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 7 నుంచి
- **ఏపీ ఈఏపీ సెట్ తేదీ:** ఇంజనీరింగ్ అభ్యర్థులకు మే 13 నుంచి 16 వరకు; అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ అభ్యర్థులకు మే 17 నుంచి 19 వరకు
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in

SCHOLARSHIP ALERT

The Cadence Scholarship Program 2024-25

Description: Cadence Design Systems Private Limited & Concern India Foundation invites applications from students pursuing undergraduate or postgraduate courses in the Delhi NCR, Bangalore, Pune, or Ahmedabad regions to continue their education.

Eligibility: Open to applicants residing and studying in Delhi NCR, Bangalore, Pune, or Ahmedabad (Indian nationals only) pursuing under graduate and postgraduate courses.

Prizes & Rewards: Financial support for key educational expenses

Last Date to Apply: 30-05-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/TCSP4

National AIDS Control Organisation (NACO) Internship Programme

Description: National AIDS Control Organisation (NACO) Internship Programme 2024 is an opportunity offered by the Ministry of Health & Family Welfare, Government of India for students pursuing undergraduate, postgraduate, M.Phil and Ph.D. degree courses in various disciplines.

Eligibility: Open for Indian nationals pursuing undergraduate, postgraduate, M.Phil, and Ph.D. degree courses in specified disciplines.

Prizes & Rewards: A monthly stipend of 8,000 and a completion certificate

Last Date to Apply: Round The Year

Application mode: via post or email at: Deputy Secretary National AIDS Control Organisation (NACO) 9th Floor, Chandralok Building, 36, Janpath, New Delhi – 110001

Email ID: naco.internship@gmail.com

Short Url: www.b4s.in/aj/NACO1

National Institute of Public Cooperation and Child Development Internship

Description: National Institute of Public Cooperation and Child Development Internship 2024 is an opportunity offered by the National Institute of Public Co-operation and Child Development (NIPCCD), New Delhi, for postgraduate and research students. This programme aims to familiarise interested and motivated students with the overall process of training and research in Women & Child Development schemes and programs.

Eligibility: Open for postgraduate or research students pursuing studies at various universities and recognized research institutes.

Prizes & Rewards: A monthly honorarium of up to 5,000 and other incentives

Last Date to Apply: 31-03-2024

Application mode: via email or post to: NIPCCD, Coordination Unit, 5 Siri Institutional Area, Hauz Khas New Delhi - 110016

Email ID: pu-nipccd@gov.in

Short Url: www.b4s.in/aj/NIPC1

buddy4study.com

విటమిన్



మీకు తెలుసా?

- చైనాలోని పెంగజువాంగ్ పట్టణంలో పుచ్చకాయ మ్యూజియం నాలుగువేల స్క్వేర్ ఫీట్స్‌లో ఉంది. దీన్ని 2002 సంవత్సరంలో నిర్మించారు. దీనిపేరు ఫ్లయింగ్ వాటర్‌మెలన్.
- పుచ్చకాయ మ్యూజియం లుక్ దగ్గరనుంచి లోపలకి వెళ్తే నియాన్ లైట్ల మధ్య పుచ్చకాయ రంగులతో తళుకులీనుతుంటుంది. ముఖ్యంగా ప్రతి పుచ్చకాయపై వాటి పుట్టు పూర్వోత్తరాల గురించి సమాచారం ఉంటుంది.
- ఆఫ్రికాలో ఉండే పుచ్చకాయల దగ్గరనుంచి.. ప్రపంచంలో దొరికే పుచ్చకాయల కథ అంతా ఈ మ్యూజియంలో తెలుస్తుంది.
- ఒకప్పుడు చైనా సాహిత్యంలో పుచ్చకాయల ప్రస్తావనం ఉండేదట.
- మ్యూజియం లోపల 300 ఫొటోలు ఉన్నాయి. వీటిని ఎక్కడ సాగు



చేస్తారు? ఎలా చేస్తారు? అనే సమాచారం ఇక్కడ దొరుకుతుంది.
- ఇక్కడి స్టాచూస్ వాక్స్ బొమ్మలే. చైనాలోని ఓల్డెస్ట్ వాటర్‌మెన్ కల్చర్‌ను వివరిస్తారిక్కడ. ఒక్క చైనాలోనే 170 రకాల వాటర్‌మెలన్‌లు ఉన్నాయట.
- ఇక్కడ సమాచారం ఇంగ్లీషులో ఉండదు. చైనాభాషలోనే ఉంటుంది. విషయమేంటంటే.. బొమ్మలు చూస్తూనే విషయం అర్థం అవుతుంది. ఈ మ్యూజియం చూడటానికి కనీసం నాలుగు గంటలు పడుతుంది.
- 5 వేల సంవత్సరాల కితమే ఈజిప్టులో పుచ్చకాయలను పండించినట్లు ఇక్కడ సమాచారం ఉంది.


సరైన నీడ ఏది?



6 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 253

	2		7	3				
3	4	7			2		6	
								7
4		8		5		2	3	
	6	5		1		7		8
1								
	7		4			5	1	9
				9	3		7	

సుడోకు - 252 సమాధానం

1	8	4	3	6	7	9	5	2
7	5	6	1	9	2	3	8	4
2	3	9	5	4	8	7	6	1
5	9	3	2	1	4	6	7	8
4	6	7	8	5	9	1	2	3
8	2	1	6	7	3	5	4	9
9	7	2	4	3	6	8	1	5
6	1	8	9	2	5	4	3	7
3	4	5	7	8	1	2	9	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.